# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 19, సంచిక: 5, మే 2026

వెల: రూ. 25/-





# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 19 సంచిక: 5


**సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**


ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్: **పత్తి సుబ్రమణ్యం,**
శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్



**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.srivenkatesham.org
Phone: **040–27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| అంతర్యామి అనుగ్రహాన్ని అందుకొన్న పూతన | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 10 |
| వరాహ జయంతి | 21 |
| శ్రీరామ దూతం శిరసా నమామి | 23 |
| పరమాత్మని చేరుకునే మార్గాలు | 27 |
| మార్గదర్శకులు – మహర్షులు | 30 |
| రామాయణ రత్నాకరం (సీరియల్) | 36 |
| జయదేవుని 'గీత గోవిందము' | 40 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం (సీరియల్) | 44 |
| తిరుమల సర్వస్వం (సీరియల్) | 50 |
| మంత్రాలయ శ్రీరాఘవేంద్ర స్వామి | 56 |
| నచికేతుడు తెలుసుకున్న ఆత్మవివరాలు | 58 |
| నవవిధ భక్తిమార్గాలు | 60 |
| మీ ప్రశ్న మా సమాధానం | 63 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


# గోవిందనామమే – గురువు

భగవంతుని సాధన నిమిత్తమై మనకు ఈ మానవ జన్మ లభించింది. జన్మించిన ప్రతి మనిషి భగవంతుణ్ణి తనివితీరా ప్రార్థించి తీరాలి, అప్పుడే ఈ జన్మ సార్థకమవుతుంది. ఈ జన్మ సార్థకం చేసుకునే నిమిత్తమై మనకు ఎన్నో కష్టాలు, ఇబ్బందులు, పోట్లాటలు మొదలగు నానా రకాల హింసలకు గురవుతాము. ఈ కష్టకాలంలో భగవంతుని తనివితీరా స్మరించాలనే ఏకైకభావం దీని వెనక దాగి ఉన్నదనే విషయమును గుర్తించాలి. ఇక భగవంతుణ్ణి ఎందుకు స్మరించాలి? అనే విషయమును తెలుసుకొనుటకు గాను ఆయనే మనకు భాగవత రామాయణాది ఎన్నో పురాణాల ద్వారా ఆయన వైశిష్ట్యమును తెలియజేశారు. దీనితో పాటు మనము ఎలా భగవంతుని సన్నిధికి త్వరగా చేరగలము? అందులోని ఆటంకాలను ఏవిధంగా ఎదిరించాలి? భగవంతుణ్ణి అతి సులభంగా ప్రసన్నుణ్ణి ఏవిధంగా చేసుకోగలము? దానికి మనం ఆచరించవలసిన, పాటించవలసిన పద్ధతులు ఏమిటి అనే విషయాలను సులభంగా తెలుసుకొనుటకు గురువులను కూడా ప్రసాదించారు. ఈ గురువులు ఎంతో శక్తి సంపన్నులు. వీరు ప్రజలను భక్తి మార్గములో నడిపించుటే కాకుండా సంఘములో అంతకుముందు నుండి ఉన్న దురాచారాలను రూపుమాపారు. జగద్గురువు శ్రీ శంకరాచార్యులు, భగవద్రామానుజాచార్యులు మరియు శ్రీ మధ్వాచార్యులు ఆ కోవకు చెందినవారు. వీరు లోక కళ్యాణం కోసం సంఘం లోని దురాచారాలను రూపుమాపి భగవంతుణ్ణి చేరుటకు భావితరాలకు అవసరమైన, సులభమైన మార్గదర్శకాలను స్థాపించారు. మరియు వీటిని తరతరాల భక్తులకు అందించుటకని పీఠాలను స్థాపించారు. వీరు భగవంతుడు ప్రసాదించిన గురువులు కాబట్టి వారు స్థాపించిన పీఠాలను ఆదరిస్తూ, అనుసరిస్తూ జీవించుట మన కర్తవ్యం. గురువును అనుసరిస్తే మన అంధకారం తొలగిపోతుంది. అజ్ఞానమనే చీకటి స్థానములో జ్ఞానమనే వెలుగు నిండుతుంది. తద్వారా భగవంతుడు దగ్గరవుతాడు. పూర్వం శ్రీవేంకటేశ్వరుడు కూడా తనకు ఎలాంటి గురువు అవసరం లేనప్పటికీ భగవద్రామానుజాచార్యులను తన గురువుగా స్వీకరించి భక్తులకు మార్గదర్శకుడు అయినాడు. కాబట్టి ప్రతివారు అందుబాటులో ఉన్న గురువులను ఆశ్రయించి తరించవలెను.

ఇక ఈ కలియుగములో "గోవిందనామమే గురువు". గురువు చేసే ప్రతి పని ఈ నామం చేసి తీరుతుంది. "కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతి రన్యథా" కలియుగంలో హరినామం తప్ప వేరే దారి లేదు. ఈ నామమే మనకు గురువుతో సమానము. మనకు ఉన్న సమస్త క్లేశాలను, దుఃఖాలను, దురలవాట్లను దూరము చేసి భగవంతుని సన్నిధికి చేర్చు సాధనం "గోవింద నామం". ఒకానొక సందర్భములో తాను వైకుంఠములో కాని, కైలాసములో కాని లేనని, గోవిందనామం పలికే భక్తుల మధ్య నివసిస్తున్నానని స్వయంగా భగవంతుడే చెప్పాడు. కాబట్టి మనమందరం సదా గోవింద నామస్మరణ చేస్తూ గోవిందుని అనుగ్రహం పొందుదాం! భగవంతుడు ప్రసాదించిన ఈ మానవ జీవితమునకు సార్థకత చేకూర్చుదాం! ఈ ఆలోచనలో భాగంగానే శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో హరినామ క్షేత్రాన్ని నిర్మించుటకు నిర్ణయించుకున్నాము. అందులో సదా గోవిందనామం వివిధ భక్త బృందాలచే జరుగుతూ ఉంటుంది. ఇది భక్తులకు గోవిందుని కృపను సులభంగా పొందే సాధనమని శ్రీవేంకటేశ్వరుడు సూచించాడు కాబట్టి భక్తులందరూ గోవిందుణ్ణి స్మరిస్తూ హరినామ క్షేత్రంలో భాగస్వాములు కాగలరని ఆశిస్తున్నాము.

నమో వేంకటేశాయ

నమో వేంకటేశాయ
వినా వేంకటేశం న నాథో న నాథః ।
సదా వేంకటేశం స్మరామి స్మరామి॥

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**

నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.

లేదా

శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను

లేదా

**Srivenkatesham**

A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.


పూర్తి పేరు:______________________
______________________
చిరునామా:______________________
______________________
______________________
______________________
______________________
పిన్‌కోడ్:______________________
చందా వివరాలు:______________________



మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

– డా॥ కె.వి. రాఘవాచార్యులు

**శ్లో॥ అహం దూరతస్తే పదాంభోజయుగ్మ**
**ప్రణామేచ్ఛయాఽగత్య సేవాం కరోమి**
**సకృత్సేవయా నిత్యసేవా ఫలం త్వం**
**ప్రయచ్ఛ ప్రయచ్ఛ ప్రభో వేంకటేశ**

తాత్పర్యం – ఓ వేంకటేశా! నీ పాద పద్మములకు నమస్కరించు కోరికతో చాలా దూరము నుండి వచ్చి నిన్ను సేవించుచున్నాను. ఈ ఒక్కసారి సేవించుట చేతనే ప్రతిదినము నిన్ను సేవించిన గల్గు ఫలమును అనుగ్రహింపుము.

**శ్లో॥ అజ్ఞానినా మయా దోషా నశేషాన్ విహితాన్ హరే**
**క్షమస్వ త్వం క్షమస్వ త్వం శేషశైల శిఖామణే**

తాత్పర్యం – శ్రీహరీ! శేషాచలపతీ! అజ్ఞానముచే నేను చేసిన దోషము లన్నింటినీ నశింప చేయుము. దోషకారి అయిన నన్ను క్షమింపుము క్షమింపుము.



# ముక్తిమార్గము

భావానువాదం:
శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య

## సామంతం

ఇందరికి నభయంబు – లిచ్చు చేయి
కందువగు మంచి బం – గారు చేయి ॥పల్లవి॥

1. వెలలేని వేదములు – వెదకి తెచ్చిన చేయి
చిలుకు గుబ్బలి కిందc – చేర్చు చేయి,
కలికి యగు భూకాంతc – గాcగిలించిన చేయి
వలనైన కొనగోళ్ళ – వాcడి చేయి ॥ఇంద॥

2. తనివోక బలిచేత – దాన మడిగిన చేయి
ఒనరంగా భూదాన – మొసcగు చేయి
మొనసి జలనిధి యమ్ము – మొనకుc దెచ్చిన చేయి
యెనయ నాగేలు ధరి – యించు చేయి ॥ఇంద॥

3. పురసతుల మానములు – పొల్ల సేసిన చేయి
తురగంబుc బరపెడి – దొడ్డ చేయి
తిరువేంకటాచలా – ధీశుcడై మోక్షంబు
తెరువు ప్రాణులకెల్లc – దెలిపెడి చేయి ॥ఇంద॥





భావము – పరమాత్ముని దివ్యహస్తము ప్రపన్నులైనవారికి అభయంబు లొసంగునది. అది ఈ క్రింద చెప్పబోవు రీతిగా సకలవిధ నైపుణ్యములు గల మంచి మేలైన చేయి.

శ్రుతులను దొంగిలించి సముద్రములో దాగిన సోమకుని సంహరించి ఆ చేయి అమూల్యమైన వేదములను వెదకి తెచ్చినది. అమృతమునకై సురాసురులు క్షీరసాగరమును మథించునపుడు ఆ చేయి మందరాద్రిని నిలబెట్టుటకై దానిక్రింద జేర్చబడినది. హిరణ్యాక్షుడు భూమిని చాపచుట్టగా జుట్టి పాతాళమునకు త్రోసినప్పుడు ఆ రక్కసుని సంహరించి భూదేవిని ప్రేమతో ఆలింగనము చేసికొన్న హస్తమది. భక్తోత్తముడైన ప్రహ్లాదుని మాట దక్కించుటకై స్తంభమున నావిర్భవించి హిరణ్యకశిపుని చీల్చి చెండాడిన వాడియైన కొనగోళ్ళు గల హస్తమిదే.

దేవతల నుద్ధరించుటకై తాను సర్వేశ్వరుని హస్తముగా నుండియుం తనకున్న దానితో తనివి నొందక బలిని దానమడిగిన హస్తమిది. ఇరువదొక్క మారులు రణరంగమున క్షత్రియులను నురుమాడి స్వాధీనము గావించుకొన్న భూమినంతయు కశ్యపునకు దానమిచ్చిన హస్తమది. రావణుని బరిమార్చుటకై కపిసేనతో కదిలిపోయినపుడు మార్గమధ్యమున అడ్డుదగిలిన సముద్రమును బాణాగ్రమునకు వశము గావించిన హస్తమది. నాగేలును ఆయుధముగా దాల్చిన హస్తమదియే.

ఆ చేయి త్రిపురాసుర వనితల పాతివ్రత్యాభిమానములను చెఱచినది. అది దుష్టులను సంహరించుటకై గుఱ్ఱమును నలుదెసల బరపిన చేయి. మరియు శ్రీవేంకటగిరి నాథుడై జీవులకందరికీ ముక్తిమార్గము చూపుచున్న చేయి గూడ అదియే.




# అంతర్యామి అనుగ్రహాన్ని అందుకొన్న పోతన

– డా|| కె.బి.రాజేంద్ర ప్రసాద్

పురుషోత్తముడు, పుణ్యశ్లోకుడు పరమేశ్వరుడైన శ్రీహరి అవతార విశేషాలను పురాణ వాఙ్మయం హృద్యంగా అనవద్యంగా వివరించాయి. మక్కువ కొద్దీ లెక్కలు కట్టిన విజ్ఞులు ముఖ్యమైనవి, విఖ్యాతమైనవి అంటూ ఏకవింశతి అవతారాలను కొందరు, దశావతారాలని మరికొందరు వివరంగా ప్రపంచానికి పరిచయం చేశారు. నిజానికి అంతర్యామి ఆకృతులు అనేకాలు. ప్రతి ఆకృతియూ జగద్ధితం కోసమే వచ్చాయి. భవబంధాల చిక్కుముడులలో తగుల్కొని, తల్లడిల్లే జీవాత్మలకు ఊరటను, ఓదార్పును కల్గించేవే శ్రీహరి అవతార విశేషాలు. అందులో అందమైన, మధురమైన, మోహనమైన అవతారం శ్రీకృష్ణావతారం. నరుడై ఈ నేలపై నడయాడిన నారాయణుడే శ్రీకృష్ణభగవానుడు. సాధు సజ్జన సంరక్షణ, దుష్టరాక్షస శిక్షణ, ధర్మసంస్థాపనే ధ్యేయంగా, విశ్వశ్రేయంగా, విశ్వజనప్రియంగా వచ్చిన శ్రీపతి లీలా వినోదమే శ్రీకృష్ణావతారం. మధురాధిపతియైన స్వామి తత్త్వమే ఒక ఆనంద లహరి. అనురాగాల బిల్హరి. అనేక నీతుల, రీతుల, గీతుల, అనుభూతుల అమృత ఝరి. ఆ తత్త్వఝరిలో మునకలు వేసిన గోకులం, భరతవంశం, భారతావని, భారతీయత ఒక్కటేమిటి? సమస్తం పునీతం. జీవాత్మలకు జీవధాని, రసరమ్య జీవలోకానికి రాజధాని శ్రీకృష్ణ పరమాత్మ. స్వామి అలంకార ప్రియుడు, శృంగార రత్నాకరుడు, నిత్యానుకంపానిధి, నిర్వాణ సంధాయకుడు. జన్మ కర్మల గుట్టు విప్పగల్గిన దైవం స్వామి. స్వామిలో అనుగ్రహం ఉంటుంది. నిగ్రహం ఉంటుంది. మాయలు చేసినా, మహిమలను చూపినా, అల్లరి చేసినా, ఆరడి పెట్టినా, రక్తిని పెంచినా, విరక్తిని కల్గించినా, భక్తికి ఆజ్యం పోసినా సర్వమూ ప్రాణుల హితం కోసమే. అందుకు సాక్ష్యమే బలిచక్రవర్తి కుమార్తె రత్నమాల. జన్మకర్మల ఫలితం, విష్ణుమాయా వినోదం, సాయుజ్య సౌగంధం మొత్తంగా సనాతన ఆధ్యాత్మిక భావనల వైశిష్ట్యానికి నిదర్శనం.

బలి చక్రవర్తి రాక్షస ప్రభువు. జాతి సహజమైన వైరం దేవతలపై కలవాడు. కాని పరమ ధార్మికుడు. దాన నిరతుడు.

ఆడిన మాట తప్పనివాడు. ఆయనకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె. మొత్తం అయిదుగురు సంతానం.

శుక్రాచార్యుని మంత్రాంగం ఫలించి, బలిచక్రవర్తి త్రిలోకాధిపత్యాన్ని చేపట్టాడు. ఇంద్రాది దేవతలు అసహాయులై, పదవులు కోల్పోయి, దీనావస్థలో ఉన్నారు. కలిసి వచ్చే కాలం కోసం ఎదురు చూస్తున్నారు. ఇంతలో ఉన్నట్లుండి రాక్షసజాతి బల సామర్థ్యాలలో మార్పు వచ్చింది. నిర్వీర్యమైపోతున్నారు. అప్పుడు బలి చక్రవర్తి తమ తాత అయిన ప్రహ్లాదుని పిలిచి, కారణం అడిగినాడు. అందుకు ప్రహ్లాదుడు ''శ్రీహరి మాయ వలన ఇలా జరుగుతోంది'' అన్నాడు. వెంటనే బలి ''ఎవడా హరి? దేవతలనే తరిమికొట్టిన నాకు హరి ఎంత?'' అంటూ గర్వంతో, అజ్ఞానంతో మాట్లాడి శ్రీహరిని చులకనగా అవహేళన చేశాడు. ఇది ప్రహ్లాదునకు కోపం కల్గించింది. వెంటనే ''ఆ శ్రీహరి చేతనే నీవు పదవీ భ్రష్టుడవవుతావు'' అని బలిని శపించాడు.

బ్రహ్మాది దేవతల దైన్యాన్ని చూచిన దేవదేవుడు వామనావతారానికి రూపకల్పన చేశాడు. సరిగ్గా అదే సమయంలో బలి చక్రవర్తి యాగం చేస్తున్నాడు. వామనమూర్తి అదితీ కశ్యపులకు బిడ్డగా జన్మించాడు. కాలక్రమంలో ఉపనయనం జరిగింది. ఈ ఉపనయనం సందర్భంగా బ్రాహ్మణుల నుండి బలి చక్రవర్తి సమాచారాన్ని రాబట్టాడు వామనుడు. తానే యాచనకు బయలుదేరాడు స్వామి. సిరుల దేవేరిని ఉరమున ధరించి యున్న శ్రీపతి ఒక వటువుగా, మరుగుజ్జురూపంలో అడుగులు వేస్తూ బలిచక్రవర్తి యాగశాలకు వచ్చాడు. దివ్య సుజ్ఞాన తేజస్సుతో వెల్గొందుతున్నాడు. ముద్దులు మూటగట్టిన ముచ్చటైన స్వరూపం, ఆయన నడక, చూపులు, వాలకం, మాటలు, కలుపుగోలుతనం, కమనీయంగా ఆయన ఆకృతి మరింత రమణీయంగా భాసిస్తోంది. ఆ చిన్ని వటువును బలిచక్రవర్తి కుమార్తె రత్నమాల చూచింది. ఆమెకు కన్నార్పబుద్ధి కావడం లేదు. ఆయమ్మలో మాతృత్వం పొంగింది. అమ్మతనపు పారవశ్యంలో ''ఎంత బావున్నాడు. ఆ బాలుడు నాకు నిజంగా బిడ్డయితే, నా స్తన్యామృతాన్ని ఆస్వాదింప చేసి ధన్యతను పొందుతాను కదా'' అంటూ వామనమూర్తిని ఆత్రంగా ఆర్ద్రతగా చూచింది. అంతర్యామి అలవోకగా రత్నమాల మనోభావనలకు ముగ్ధుడై ''తథాస్తు'' అన్నాడు.

ఆ తర్వాత స్వామి బలిని మూడడుగులు నేలను దానమీయమని అడగడం, ''అలాగే'' యని స్వామికి బలి మాటివ్వడం జరిగిపోయింది. శుక్రాచార్యులు బలిచక్రవర్తిని హెచ్చరించాడు. ''ప్రభూ ఈ వటుడు సామాన్యుడు కాదు. దానమీయవలదు, మాటను వెనుకకు తీసుకొనుమ''ని హితవు పలికాడు. దాననిరతుడు, సత్యసంధుడైన బలి సమ్మతించలేదు. మూడడుగుల నేలను దానంగా శాస్త్రోక్తంగా ఇచ్చాడు. అప్పుడు వామనమూర్తి ఇంతవాడంతవాడైనాడు. బ్రహ్మాండాంత సంవర్ధియై, భూమిని ఒక అడుగు, ఆకాశంపై రెండవ అడుగు, మూడవ అడుగుకు నేల లేమితో బలిచక్రవర్తి శిరముపై అడుగు మోపి, అతణ్ణి పాతాళానికి అణగ ద్రొక్కడం





జరిగింది. చివరకు ప్రహ్లాదుని ప్రార్థనపై అక్కడే ''సామ్రాజ్య వైభవాన్ని అనుభవించు''మని సెలవిచ్చి, తాను ఆయన పాతాళ సామ్రాజ్యానికి కాపలాగా ఉంటానని మాట ఇవ్వడంతో బలి కథ సమాప్తమైంది. కాని రత్నమాల కథ అలాగే ఉంది.

జరిగిన సన్నివేశాన్ని పూర్తిగా చూస్తున్న రత్నమాలలో రాక్షసావేశం కల్గింది. వామనునికి స్తన్యాన్ని ఇవ్వాలనే భావనా పారవశ్యం పొందిన తాను అదే స్తన్యాన్ని విషంగా ఇవ్వాలని భావించింది. ఇది కూడా గమనించిన స్వామి ''తథాస్తు'' అన్నాడు.

''తథాస్తు'' వేరు, వరం వేరు. రత్నమాల రెండు కోరికలు నెరవేరాలి. అంతే. వాటి ఫలితాలు దైవేచ్ఛ. అంటే కర్మలు చేయడం జీవుల వంతు. కర్మఫలాలు అందించడం దేవుని ఇచ్ఛ.

పై సన్నివేశ ఫలితంగానే ద్వాపర యుగంలో స్వామి శ్రీకృష్ణ పరమాత్మగా దేవకీ వసుదేవులకు జన్మించాడు. కాని కంసుని దుశ్చర్యలకు దూరంగా ఉండడానికి యశోదా నందులింటకు చేరాడు. గోకుల వాసి యైనాడు. గోకులంలో బాలకృష్ణునకు బారసాల జరిగింది. స్వామి పసివాడై యశోదమ్మ స్తన్యామృతాన్ని ఆస్వాదిస్తూ, కాలం కోసం ఎదురు చూస్తున్నాడు.

దేవకీదేవి అష్టమ గర్భ సంజాతుని చేతిలో తనకు మరణం తప్పదని ఎఱింగిన కంసుడు మిక్కిలి భయంతో బ్రతుకుతున్నాడు. ఇంతలో యోగమాయ నిజాన్ని కూడా తెల్పుతూ ''నిను చంపేవాడు పెరుగుతున్నాడ''ని ప్రకటించింది. ఈ నిజాన్ని వినిన కంసుడు మరింత భయకంపితుడైనాడు. పసిపిల్లలను చంపే రాక్షస స్వభావమున్న వారి కొఱకు వెదికించుతున్నాడు. పరమాత్మ ప్రణాళిక చాలా విచిత్రంగా ఉంటుంది. నాటి బలిచక్రవర్తి కుమార్తె రత్నమాల పూతన అనే రాక్షసిగా జన్మించి, శిశుహంతకిగా తిరుగుతూ, కంసుని దృష్టిని ఆకర్షించింది. కంసుడు పూతనని పిలిచి ''నీవు అందమైన మానవ స్త్రీగా మారి, విషాన్ని నింపుకొన్న స్తన్యాన్ని ఇస్తూ, పసిబాలుడనేవాడు బ్రతకకుండా చేయాలి'' అని ఆనతిచ్చాడు. అందుకు అంగీకరించిన పూతన కంసుని ఆజ్ఞను పాటించి, పసివారికి పాలను ఇచ్చే నెపంతో విషాన్నిస్తోంది. పసివారు చనిపోతున్నారు. సత్యం తెలియని, రాక్షస మాయని గుర్తించని గోకులం దుఃఖిస్తోంది. ''కర్మ చేతనే జీవుడు జన్మిస్తున్నాడు. కర్మల వలననే ప్రాణులు వృద్ధి క్షయాలు, ఆనంద విషాదాలను అనుభవిస్తున్నారు. జీవుల భాగ్యాన్ని అనగా అదృష్టాన్ని నిర్ణయించేది చేసుకున్న కర్మయే. సుఖ దుఃఖాలకు కారణమైన కర్మలను మంచి బుద్ధితో, ఇతర జీవులకు నొప్పి కల్గని రీతిలో ధార్మిక నీతితో చేయాలి. ఎందుకంటే దేహం నశించగానే జీవుడు కర్మానుసారమైన దేహాల్ని పొందుతాడు'' అని పురాణ వచనం.

అలా రత్నమాల కర్మలకు సానుకూలంగానే ఈ ద్వాపరయుగంలో పూతన అనే రాక్షస స్త్రీ రూపాన్ని పొందింది. గతంలో పరమాత్మ నుండి రెండుమార్లు ''తథాస్తు'' అని అన్పించుకుంది. ఇప్పుడవి నెరవేరే సమయం వచ్చింది. పూతన యశోద ఇంటికి వచ్చింది. బాలకృష్ణుని ఎత్తుకుంది. ముద్దాడింది. పాలిళ్ళకు గట్టిగా హత్తుకుంది. ''నీకు పాలిచ్చి వెళ్తాను. తరువాత కదా వేడుక'' అని భావించింది. ఇంతలో

యశోదాదేవి చూచింది. ''ఓయమ్మా నీవెవరవో తెలియదు. స్తన్యాన్ని ఇవ్వకుము'' అని అరుస్తుంటే పట్టించుకోకుండా, మాయ పన్నినట్లు, మెల్లగా చను గుడిపింది. స్వామి అంతా గమనిస్తున్నాడు. అంతే స్తన్యాన్ని నోట పెట్టుకుని, పాలతో పాటు పూతన ప్రాణ వాయువులను కూడా ఆస్వాదించేశాడు. ''నీవు సామాన్యుడవు కావు. నా చన్ను వదిలిపెట్టు'' అంటూ అరుస్తూ, ఆర్తనాదాలు చేస్తూ పూతన నేలకొరిగింది. స్తన్యాన్ని ఇవ్వడం, విషాన్ని స్వామి కర్పించడం రెండు ''తథాస్తు''లు పూర్తి అయినాయి.

పాములను దిగమ్రింగే గరుత్మంతుడు వాహనం గల స్వామి, గరళ కంఠుడైన శివదేవుని చేత ''ఆరాధ్యా'' అని పిలిపించుకొనే స్వామి, బ్రహ్మకే తండ్రియైన స్వామి పరమాత్మ. ఆయనను ఈ విషాలు ఏం చేస్తాయి? కొండంత బలాన్ని ఇస్తాయి.

యశోద, రోహిణి తదితరులందరూ వచ్చి స్వామికి దిష్టి తీశారు. రక్ష కట్టించారు. ఇంతలో యాదవ నాయకులు పూతన రాక్షసి శరీరాన్ని గొడ్డళ్ళతో నరికి, ముక్కలు చేసి, చందనం కట్టెలతో దహనం చేశారు. ఆ పూతన కళేబరం కాలుతుంటే అగరు సువాసనల పొగలు వెలువడ్డాయి.

పాపిష్టి రాక్షసి పూతన. శిశుహంత. క్షంతవ్యురాలు కాదు. అయినా పరమాత్మ సందర్శనం, పరతత్త్వ సంస్పర్శనంతో పాపాలు నశించి, నిజంగా విష్ణువునకు తల్లి లాగానే పరమగతిని పొందింది. శ్రీకైవల్యానికి నోచుకుంది. స్వామి నామస్మరణం, స్వామి తత్త్వ ధ్యానం జీవులకు పుణ్యలోకాలను అందిస్తాయి. నిజానికి రత్నమాల మొదటిగా స్వామిని చూచినప్పుడు (వామనుని రూపంలో) తాను తనను తల్లిగా భావించుకొని, వాత్సల్యామృతాన్ని భావన చేసింది. కాని చివరలో తండ్రియైన బలిని పాతాళానికి స్వామి అణిచేశాడని ఆగ్రహించింది. విషం గ్రక్కింది. అయినా దయామయుడైన స్వామి ఆమెలోని తల్లితనానికి సంతృప్తి నిచ్చాడు. తల్లిలాగానే తన సాయుజ్యాన్ని ప్రసాదించాడు. ఇది బాలకృష్ణుని లీల అంటామా? మంచి భావనల మహిమ అంటామా?

ప్రతి స్త్రీ మూర్తిలో అమ్మ ఉంటుంది. అమ్మతనంలో అమృతం ఉంటుంది. అమ్మ అంటే ఆ పరబ్రహ్మమూర్తియే. అమ్మతనం పరతత్త్వ విభూతియే. అందుకే ''మాతృదేవోభవ'' అన్నది సనాతన ధర్మం.

**"ఓం నమో వాసుదేవాయ"**


# రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.


ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుచుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com






38వ భాగము

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం

## స్వామి వారి దివ్య లీలలు



**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**– గోవింద దాసు**

**(పుల్లగూర్ల సాయిరెడ్డి)**

**దిశా నిర్దేశం:** సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారీగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వారా ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగా చేయుటకు వీలుగా స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 38 వ భాగపు లీలల ప్రచురణ. (జనవరి 2022 – మార్చి 2022).

ఈ మధ్యన కోవిడ్ 3వ వేవ్ వచ్చింది. మనిషి ఎదుటి మనిషిని చూచి భయపడుతున్నాడు. జనవరి నెలలో కొన్ని కళ్యాణాలు వచ్చినప్పటికీ మేము కోవిడ్ భయము వలన చేయలేదు. మరియు ఈ కళ్యాణాల కార్యక్రమానికి కొన్ని రోజులు విరామం ఇవ్వాలనుకున్నాము. స్వామి వారిని ప్రార్థించి మా నిస్సహాయతను వివరించాము. దీనికి స్వామివారు ఒక చిన్న లీల చూపారు.

**తేది 08-01-2022 కల :** మేము కళ్యాణము చేయుటకు ఒక స్థలమునకు వెళ్ళాము. కళ్యాణ వేదిక మీద ఏవో కొన్ని సామాన్లు సర్దుచున్నారు. ఇంతలో బ్రాహ్మణులు వచ్చారు. వారితో నేను ఏదో విషయాన్ని చెప్పుచున్నాను. ఇంతే కల.

బహుశా వారితో ఈ కార్యక్రమానికి కొంత విశ్రాంతి ఇవ్వబోతున్నామని చెప్పి ఉండవచ్చును. లేదా వారి వద్ద నుండి విశ్రాంతికి అనుమతి కోరి ఉండవచ్చునని భావించాను.

### స్వామివారి కళ్యాణాలు – నా అనుభూతి

**తేది 15-01-2022:** ఇప్పటివరకు మొత్తం 111 కళ్యాణాలలో 17 కళ్యాణాలను స్వామి కృపతో చేయగలిగాము. ఇప్పుడు కోవిడ్ కారణంగా కొంతకాలము విశ్రాంతి లభించింది. ప్రభుత్వము వారు ఆధ్యాత్మిక కార్యక్రమాలను అనుమతించినప్పుడు పునః ప్రారంభించగలము. అయితే, ఈ విశ్రాంతి కాలములో ఈ కళ్యాణాల కార్యక్రమము గురించి నేను పొందుచున్న అనుభూతులను, నా మానసిక స్థితిని ఈ క్రింది విధంగా వ్రాసుకున్నాను.

పూర్వము 'నమో వేంకటేశాయ' రథయాత్రను ప్రతి సంవత్సరము ప్రారంభ, ముగింపు రోజులతో కలిపి 25 రోజులు చేసేది. ఈ రథయాత్ర ప్రారంభం

నుండి నా మానసిక స్థితి మరియు ప్రవర్తన ఇతర రోజులతో పోల్చితే భిన్నంగా ఉండేది. నన్ను దగ్గర నుండి గమనించువారు, ముఖ్యంగా ఇంటిలోనివారు, రథయాత్రతో నాతో వచ్చేవారు దీనిని స్పష్టంగా గమనించేవారు. నా శరీరములో ఒకరకమైన పులకరింత, మానసిక ఉద్రేకము, స్వామి సేవలో చిన్న పాటి లోటును సహించలేని అసహనము కలిగేది. ఏదైనా కారణము వలన రథయాత్ర ఆలస్యమైనప్పుడు తట్టుకోలేకపోవుట, త్వరగా భక్తుల చెంతకు వెళ్ళాలనే తపన ఉండేది. రథయాత్రలో వీలైనంత ఎక్కువమంది భక్తులు దర్శించాలనే కోరికతో మొత్తం శరీరంలో శ్రీవేంకటేశ్వరుడే నిండియుండేవారు. 'నా' అన్న దానిని ఆ సమయాన పూర్తిగా మరిచిపోయేవాడిని. 2004 సంవత్సరం నుండి 2019 సంవత్సరం వరకు మొత్తం 16 సంవత్సరాలు రథయాత్రను హైదరాబాద్ నుండి తిరుపతి వరకు త్రిప్పిన తరువాత 2020 సంవత్సరం నుండి మానివేశాము.

ఇప్పుడు ఈ రథమును 'శ్రీ శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమములో వాడుచున్నాము. ఈ రథములో కళ్యాణ సామగ్రితో పాటు స్వామివారిని తీసుకుపోవుచున్నాము. మరియు ప్రతి కళ్యాణం కంటే 2 గంటల ముందు వెళ్ళుదము. అందులో ఒక 30 నిముషాలు స్వామివారి ఎదుర్కోలు ఉండును. కొంత దూరము నుండి ఈ రథయాత్రను మేళ తాళాలతో, నృత్యాలతో, భజనలతో కళ్యాణ ప్రాంగణము వరకు అత్యంత వైభవంగా ఎదుర్కొని పోవుటను ప్రవేశపెట్టాము. ఇందులో ఎంతో ఆనందం లభిస్తుంది.

అయితే రథయాత్ర సందర్భంగా నేను ఏ రకమైన, మానసిక మార్పుకు లోనౌదునో అదే రకమైన మానసిక ఆనందమును ప్రతి కళ్యాణ సమయాన పొందుచున్నాను. ఇది మా ఇంటి వద్ద రథం ప్రారంభించు సమయము నుండి నాలో ప్రారంభమగుచున్నది. నిజానికి రథం ప్రారంభానికి ఒక గంట ముందు నుండే నాలో ఈ భావాలు, అంటే శరీరము పులకింతకు గురవుట, ఆనందముతో ఉక్కిరి బిక్కిరి అగుట, చిన్న తప్పును, ఆలస్యమును సహించకుండుట మొదలగునవి నాలో ప్రవేశిస్తున్నవి. రథము మా ఇంటి నుండి ప్రారంభమగు సమయాన, రథానికి మాలలు వేసి హారతి ఇచ్చి టెంకాయ కొట్టి ప్రారంభించుదుము. ఈ సమయాన తిరుమల శ్రీవేంకటేశ్వరుని విరాట్ రూపము మొత్తం రథముపై తన రెండు పాదములు పెట్టి నిలుచున్నట్లు అనుభూతి పొందుదును. స్వామివారిని నా తనివితీర దర్శిస్తూ ఎంతో ఆనందిస్తాను. ఈ లీల 2004 సంవత్సరం నుండి ప్రతి రథయాత్రలో తిరుపతికి వెళ్ళేముందు జరిగేది. మరియు ప్రస్తుతము కళ్యాణాలలో కూడా ఇలాగే జరుగుచున్నది. కళ్యాణము జరిగే రోజు నేను పూర్తిగా మరో లోకములో విహరిస్తున్నట్లు ఉంటాను. ఎంతో ఆనందిస్తాను. కళ్యాణము తరువాత ఇంటికి వచ్చాక కూడా పూర్వపు 25 రోజులు రథయాత్ర ముగింపు తరువాత ఏవిధమైన మానసిక స్థితి ఉండేదో అదే రకమైన స్థితిని అనుభవిస్తున్నాను. ఇతర రోజులలో నా స్థితికి ఈ స్థితికి భేదము తెలుస్తోంది. ఈ స్థితి ముఖ్యంగా స్వామివారి లీలలను తెలుసుకొనుటకు ఉపయోగపడుతుంది. సాధారణ మనుష్యులకు, నాకు గల తేడాను స్పష్టంగా గుర్తిస్తాను. శ్రీవేంకటేశ్వరుడు తన భక్తులను ఉద్ధరించుటకు నాచే ఈ లీలలను కొనసాగిస్తున్నాడని భావిస్తూ మురిసిపోతాను. ఆ తరువాత రెండు రోజులు గడిచిన పిదప సాధారణ మనిషిగా మారుతాను.

పూర్వము ప్రతి సంవత్సరం 25 రోజులు రథయాత్రను చేసేవారిమి. బహుశా ఈనాడు కూడా మేము సంవత్సరానికి 20 పైన కళ్యాణాలను చేసి ఆనాటి రోజులకు సరి చేయుదుమని భావించాను. స్వామి అనుగ్రహము ఎలా ఉన్నదో తెలియదు. కాని ప్రతి కళ్యాణము ప్రారంభానికి ఒక రెండు రోజుల ముందు నుండి నాలో ఒక నూతన శక్తి ప్రవేశించి నన్ను ఆనందభరితుణ్ణి చేస్తున్నది. ముఖ్యంగా కళ్యాణం రేపనగా నాలో ఆత్రుత మరింత పెరుగుతుంది. కళ్యాణంలో ఎలాంటి తప్పులు జరగకుండా ఒకటికి రెండు సార్లు నిర్వాహకులతో మాట్లాడుదును. వారు సరైన దిశలో పయనించేటట్లు చేస్తాను. ప్రతి చిన్న విషయానికి నన్ను సంప్రదించండని సూచిస్తాను. ఏ తప్పు జరగకుండా నా వంతు అన్ని ప్రయత్నాలు చేస్తాను. తిరుమల శ్రీవేంకటేశ్వరుని కళ్యాణము శాస్త్రోక్తముగా జరిపించాలి కాబట్టి వైఖానస పద్ధతిని అవలంబించాము. కళ్యాణాలలో వాడే అన్ని పాత్రలు ఇత్తడివి సమకూర్చుకున్నాము. నిర్వహణ వారు ఏదైనా లోపం చేసినచో దానిని మేము పూరించి, కళ్యాణమును శాస్త్రోక్తముగా జరిపించుదుము. ఒక రకంగా టి.టి.డి వారు స్వయంగా నిర్వహించితే ఏ విధంగా ఉండునో ఆ విధమైన భావం కలిగే విధంగా ప్రయత్నిస్తున్నాము. మా ఈ ప్రయత్నమునకు తగిన శక్తి సామర్థ్యములను ప్రసాదించుమని స్వామివారిని ప్రార్థిస్తున్నాము.

ఈ విధంగా మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలను పూర్తి చేసిన వెంటనే నా సంకల్పము నెరవేరగలదని భావించాను. కాని ఈ 111 కళ్యాణాల తరువాత నా సంకల్పం నెరవేరునని స్వామివారు ఇంతవరకు చెప్పలేదు. కాని నా మనస్సులోని కోరికను ఆయన తెలుసుకొనును. నన్ను తప్పక ఆనందింప చేయునని విశ్వసించాను. పూర్వం మొదటి జప సమర్పణ సమయాన ఆయన పాదాలను చూడాలనే నా కోరికను నేను కోరకముందే తీర్చాడు. అదేవిధంగా దీనిని తీర్చుననే విశ్వాసము నాలో ఉన్నది. గత సంకల్పములో స్వామివారు చెప్పినట్లు చాలాసార్లు నడుచుకోలేదు. కొన్ని లోపాలు జరిగాయి. అందుకు

పర్యవసానంగా ఓడిపోయాను. కాని ఈ సంకల్పములో ఎలాంటి తప్పులు లేకుండా నిర్వహించి స్వామి మెప్పు పొందాలనే ఆరాటంతో జీవిస్తున్నాను. దీనికి స్వామివారు కూడా సహకారాలందిస్తున్నారు. గత 6 మాసముల కాలము అంటే తేది 20-07-2021 కళ్యాణాలు ప్రారంభించినప్పటి నుండి అన్య విషయాలపై కాని, ఇతరులతో కాలక్షేపము చేయుట కాని, స్వామి సంబంధము లేని విషయాల పట్ల ఆసక్తిని పూర్తిగా కోల్పోయాను. ఇప్పుడు పూర్తిగా ఒక క్రొత్త లోకములో జీవిస్తున్నాను. ఇల్లు, ఆఫీసు మరియు స్వామి సేవ తప్ప మరో ధ్యాస లేకుండా జీవిస్తున్నాను. గత 6 నెలల కాలము పూర్వము రథయాత్ర జరుగు రోజులలో ఎలాంటి జీవితముతో, ఆలోచనలతో ఉండేవాణ్ణో అలా ఉన్నాను. నా సంకల్పం యోగ్యత సాధించడం, ''స్వామివారిని పొందడం'' దానిపైననే పూర్తి దృష్టిని నిలిపాను. చివరికి ఆయన దయ నా భాగ్యం! అని భావించాను.

''ఈ కలియుగములో ఒక సాధారణ మానవుడు ఎల్లప్పుడు శ్రీవేంకటేశ్వరుని నామస్మరణ, ఆయన భక్తులకు సేవ చేయుట ద్వారా, శ్రీవేంకటేశ్వరుణ్ణి పొందవచ్చును'' అనే విషయాన్ని నన్ను ఉపయోగించి లోకానికి తెలపండని వేడుకున్నాను. ఎలాగైతే పూర్వం భీముణ్ణి ఉపయోగించి బంగారు పుష్పాలకు బదులు మట్టి పుష్పాలకు విలువ ఇచ్చారో, ఇప్పుడు నన్ను ఉపయోగించుకొని ఒక నూతన సందేశాన్ని లోకానికి ఇవ్వమని ప్రార్థించాను.

## 700 అనుభూతులను పొందానని చెప్పట

తేది 15-01-2022 నాడు నేను 700 అనుభూతులను పొందానని డా|| కె.వి.రమణాచారి గారితో మొదటిసారిగా చెప్పాను. ఆయన వీటిని ఒక పుస్తక రూపములో త్వరగా పెట్టమన్నారు. మరియు తిరుపతిలో స్వామి పాదాల చెంత పెట్టి విడుదల చేయమన్నారు.

నాకు కూడా ఈ అనుభూతులను త్వరగా వ్రాయాలని ఉన్నది. కాబట్టి ప్రచురించుటకు అవకాశం ఇవ్వమని వేడుకున్నాను. కాని స్వామివారి నుండి స్పందన లేక ఊరుకున్నాను. నిజానికి కళ్యాణాల కార్యక్రమము ప్రారంభములో మూడవ వంతు కళ్యాణాలు పూర్తైన తరువాత అనుభూతుల ప్రచురణకు అవకాశము ఇవ్వమన్నాను. కాని దీనిని మరచి మధ్యలో అనుభూతుల ప్రచురణకు అవకాశము ఇవ్వమనుట నా తప్పే!

## 'నీ కర్తవ్యమందే మనస్సు నిలపాలి – సంకల్పం సిద్ధించుకోవాలి'

**తేది 16-01-2022 :** కళ్యాణాల కార్యక్రమము ప్రారంభానికి కొంచెము ముందు స్వామివారు ఈ క్రింది విషయమును ఒక హృదయాంతర భావం ద్వారా చెప్పారు. దీనిని అప్పుడు వ్రాయుట మరచిపోయి ఇప్పుడు క్రింది విధంగా వ్రాసుకున్నాను.

''నీవు ఏ చిన్న వ్యాపారము చేయరాదు. నీ మనస్సు సంపూర్ణంగా స్వామి సేవ యందే నిలపాలి. ప్రతిరోజు, ప్రతిక్షణం అదే ధ్యాసతో జీవించాలి. నీ మనస్సును ఇతరమైన ఎలాంటి విషయాల పట్ల పోనివ్వరాదు, మరియు ఇతర విషయాల పట్ల ఆసక్తిని ఎట్టి పరిస్థితులలోనూ చూపరాదు'' అని నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు చెప్పాడు. నేను ఆయన సేవకుడిని కాబట్టి చెప్పగానే సరే అని ఒప్పుకున్నాను. మరియు సాధ్యమైనంత వరకు ఆచరిస్తున్నాను.

## శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం 'మార్కు'

ఇప్పుడు గతంలో జరిగిన విషయాలను ఒకసారి ఈ క్రింది విధంగా గుర్తు చేసుకున్నాను.

నేను నా మొదటి సంకల్పంలో అంటే స్వామివారికి 16 సంవత్సరాలలో 111 కోట్ల జప సమర్పణలో ఓడిపోయాను. కాబట్టి నా చిరకాల కోరికైన శ్రీవేంకటేశ్వరుణ్ణి పొందడంలో విఫలుణ్ణైనాను. దీనికి చాలా చింతించాను. మరియు నేనే ఓడిపోయాను కాబట్టి స్వామివారిని తప్పు పట్టలేదు. మరో అవకాశం ఇవ్వవలసిందిగా దీనంగా వేడుకున్నాను. ఆ మరో అవకాశమే ఈ 111 శ్రీనివాస కళ్యాణాలుగా భావించాను. ఇక ఈ 111 కళ్యాణాలను సమర్థవంతంగా అంటే అటు స్వామివారు, ఇటు ఆయన భక్తులు ఇద్దరూ మెచ్చే విధంగా ఉండాలని తపించిపోయేవాడిని, ఏ చిన్న తప్పు జరగకుండా ఒకటికి రెండు సార్లు సరి చూసుకునేవాడిని. మా రథంతో వచ్చు స్వామి సేవకులకు మరియు కళ్యాణము నిర్వహించు బ్రాహ్మణోత్తములకు సూచనలిస్తూ, స్వామివారు, భక్తులు మెచ్చే విధంగా ఉండాలని కోరుకునే వాడిని. చివరికి మా స్వామి సేవకులు ఈ 6 నెలల కాలంలో ఒక దారికి వచ్చారు. ఈ వైఖానస బ్రాహ్మణులు మాత్రం ఈ మధ్యనే వచ్చిన క్రొత్తవారు, ప్రతి కళ్యాణానికి మారుచున్నారు కాబట్టి కొద్ది సమయములోనే ఒక రెండు బృందాలను ఎంచుకుని శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం యొక్క ఒక 'మార్కు'ను సాధించుటకు ప్రయత్నిస్తున్నాను.

## స్వామి సేవకై ఎదురు చూచుట

**తేది 19-01-2021 :** వరుసగా 5-6 రోజులు స్వామివారి ఏ కార్యక్రమాలు లేకుండా ఉండలేకపోతున్నాను. స్వామిసేవ కావాలని నా శరీరములోని ప్రతి అణువు తహ తహ లాడుచున్నది. ఉద్రేకము ఉరకలేస్తున్నది. ఎలాగైనా స్వామి సేవను దక్కించుకోవాలి, కల్పించుకోవాలని నా మనస్సు ఆరాట పడుచున్నది. ఉవ్విళ్ళూరుచున్నది. ఈ కోరికను తీర్చుకొనుటకు

నాకు తెలిసిన స్వామివారి భక్తులను సంప్రదించసాగాను. శ్రీనివాస కళ్యాణమును చేసుకోండని, స్వామివారి కృపను పొందండని, ఖర్చు కూడా పెద్దగా ఉండదని, మీ జీవితములో ఇదొక మరపురాని రోజుగా నిలిచిపోవునని చెప్పేవాడిని. మీకు, మీ బంధువులకు, మీ ద్వారా కళ్యాణము వీక్షించిన ప్రతి పౌరునికి స్వామివారి కృప లభిస్తుంది, దానికి మీరు మధ్యవర్తులుగా ఉన్నందుకు ధన్యులు కాగలరని చెప్పేవాడిని.

పూర్వము 'బాణాసురుడు' అను ఒక రాక్షసుడు ఉండేవాడు. వాని కుమార్తె పేరు ఉష. ఆమెను శ్రీకృష్ణుడు తన మనుమడు అనిరుద్ధునకిచ్చి పెండ్లి చేశాడు. బాణాసురునికి శివశంకరుని వర ప్రభావము వలన అత్యంత బలం సిద్ధించింది. మహా యోధ. తనతో పోటీపడువారు ఎవ్వరూ లేనందున, యుద్ధం చేయాలని తహ తహ లాడేవాడు. యుద్ధ కాంక్ష మితిమీరి ఉండేది. ఎప్పుడు ఎక్కడ ఎవరు దొరుకుతారా అని వేయి కళ్ళతో చూస్తుండేవాడు. అదే విధమైన తహ తహ నాలోనూ ఉన్నది. కాని నాది స్వామివారి సేవాకాంక్ష. ఎప్పుడు ఎక్కడ ఎవరు దొరుకుతారా అని వేయి కళ్ళతో ఎదురు చూడసాగాను. ఈ మధ్యన కోవిడ్ వలన రాష్ట్ర ప్రభుత్వం ఆధ్యాత్మిక ఉత్సవాలను నిషేధించినందుకు చాలా బాధగా ఉన్నది. ఎప్పుడు తిరిగి మొదలెడదామా అని ఎదురు చూస్తున్నాను.

శ్రీవేంకటేశ్వరుని సేవలో తృప్తి లభించేది కాదు. ఇంకా కావాలని నా మనస్సు ఉవ్విళ్ళూరేది. ఆ కోరికను శాంతింప చేయుటకు రకరకాల క్రొత్త పద్ధతులను వెతికేవాడిని. స్వామి సేవలను సమర్థవంతంగా చేయాలని, సదా దాని గురించే ఆలోచించేవాడిని. సేవ లోని లోపాలు, పొరపాట్లు మళ్ళీ జరగకుండా చూసుకునేవాడిని. కళ్యాణం నిర్వహించిన వారిని పొరపాట్ల గురించి అడిగేవాడిని. కాని వారు పొరపాట్లు ఏమీ లేవని నూటికి నూరు పాళ్ళు తృప్తి చెందామనేవారు. దీనితో నేను సరైన మార్గములో ఉన్నానని సంతోషించేవాడిని.

## శ్రీనివాస కళ్యాణాలలో ముఖ్య విషయములు

శ్రీనివాస కళ్యాణాలు మా ద్వారా చేసుకున్నవారు చాలా ఆనందాన్ని అనుభవిస్తున్నారు. కొందరి కళ్ళలో ఆనంద బాష్పాలను చూచాను. అంతటి ఆనందాన్ని భగవంతుడు భక్తులకు ఇస్తున్నాడు. ప్రతి కళ్యాణమునకు రెండు రోజుల ముందు నుండి స్వామివారిని ఇదే కోరేవాడిని. కళ్యాణం బాగా జరగాలి, కళ్యాణం జరిపిన, చూచిన వారందరికీ మీ కృపా కటాక్షాలు ప్రసాదించమని పదే పదే కోరేవాడిని. దాని ప్రకారంగా స్వామివారు ప్రతి కళ్యాణం నిర్వహించిన, వీక్షించిన భక్తులను అత్యంత ప్రేమతో అనుగ్రహించేవారు. వారు తన్మయులవుచున్నారు. తిరుమల లడ్డూ రుచి మధురం. అదే ముడి పదార్థాలతో అదే తయారు చేయువారు తిరుమలలో కాకుండా, మరో ప్రదేశంలో తయారు చేసినప్పుడు అంతటి రుచి రానట్లే, స్వామివారి కళ్యాణాన్ని అదే బ్రాహ్మణోత్తములు ఇతర ప్రాంతాలలో జరిపినప్పుడు ఇంతటి ఆనందం పొందరు అనే విషయాన్ని నేను బాగా గమనించాను. ఇంతటి అనుగ్రహాన్ని స్వామివారు మాకు కల్పించినందులకు మేము వారికి సదా ఋణపడి ఉన్నామని భావించాను.

## "శ్రీవేంకటేశ్వర కృపా కటాక్షాలు సిద్ధిరస్తు" – ఆశీర్వదించిన స్వామివారు

శ్రీవేంకటేశ్వరుడు గత 6 మాసముల నుండి ఎలాంటి అనుభూతులను చూపక పోవుట వలన బాధపడసాగాను. తేది 20-07-2021న శ్రీనివాస కళ్యాణాలను ప్రారంభించిన నాటి నుండి ఆయన లీలలకు దాదాపు దూరమైనాను. అయినప్పటికీ నేను మాత్రం నా సేవక ధర్మాన్ని పాటిస్తూ నా పని నేను చేసుకుపోవుదునని కళ్యాణాలను కొనసాగిస్తున్నాను. మరియు ఇలా విశ్లేషించుకున్నాను. గత కాలములో నాతో చేయించే పనులను నేను సమర్థవంతంగా నిర్వహించలేదు. ఫలితంగా నన్ను సన్మార్గంలో పెట్టుటకు స్వప్నాల రూపంలో ఎన్నో మార్గదర్శకాలు చేస్తూ, వాటిని నా హృదయంలో నాటుకొనునట్లు చేశారు. బహుశా దీనితో మీ యొక్క ఎన్నో లీలలను చూచే అదృష్టం కలిగింది. కాని ఆ రోజు మీరు ఈ లీలలు ఎందుకు చూపుతున్నారో అర్థం చేసుకోలేదు. నా ఆనందం కోసం అనుకున్నాను. ఏది ఏమైనా నేను మీ ఆజ్ఞ ప్రకారం నడుచుకోలేదు. కాబట్టి మీరు పలుమార్లు మీ లీలలను చూపి మీరు ఆశించే మార్గం లోనికి మార్చారు. ''కాని ఈ ''శ్రీనివాస కళ్యాణాలు'' అనే కార్యక్రమం మొదలుపెట్టిన నాటి నుండి మీ ఆజ్ఞను తూచా తప్పకుండా శిరసా వహిస్తున్నాను. మీ లక్ష్యాన్ని స్థిరంగా నిర్ణయించుకున్నాను, అన్ని వ్యవహారిక విషయాల పట్ల ఆసక్తిని వదులుకున్నాను. మిమ్మల్ని మాత్రమే సంతోషపెట్టడం నా ప్రధాన ధ్యేయంగా నిర్ణయించుకుని జీవిస్తున్నాను. ఇలా ఈ కళ్యాణాల కార్యక్రమము మొదలు పెట్టిన నాటి నుండి తప్పులు చేయక మీ లక్ష్యం వైపు అడుగులేస్తున్నందున నాకు మీ అనుభూతులను కల్పించుట లేదని భావించాను''. స్వామివారి లీలలను చూడాలని తపించిపోయే నాకు ఈ విరామం కొంతవరకు బాధ కలిగించినప్పటికీ నేను ఏ తప్పూ చేయక స్వామి ఆజ్ఞను పాటిస్తున్నందుకు, స్వామివారు ఆనందిస్తున్నారని భావించి నేను ఆనందపడసాగాను. తేది 28-01-2022 నాడు ఒక నూతన కోరిక నా మనస్సుకు వచ్చింది. దానిని సాయంత్రం ఈ విధంగా అడిగాను.

''ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! నా ప్రణామములను స్వీకరించండి!

మరియు నా ఈ ప్రార్థనను ఆలకించండి. మీరు నాకు 2000 సంవత్సరం నుండి రక రకాల అనుభూతులను ప్రసాదించారు. అందులో కొన్ని నన్ను ధన్యుణ్ణి చేశాయి. కొన్నింటి ద్వారా తమ సేవాభాగ్యమును ప్రసాదించారు. తమ సేవలో ఏ తప్పులూ జరగకుండా అడుగడుగునా ఆదుకున్నారు. నాచే శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపమును నిర్మింపచేసి, శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠమును స్థాపింపచేశారు. దాని ద్వారా ప్రతి సంవత్సరం 7 కోట్ల జప సమర్పణ జరిపిస్తున్నారు. 'నమో వేంకటేశాయ' రథమును తయారు చేయించి రథయాత్రను జరిపింప చేశారు. 'శ్రీవేంకటేశం' అనే మాసపత్రికను నడిపిస్తున్నారు. 'భజగోవిందం' అనే కార్యక్రమమును కొనసాగిస్తున్నారు. చివరికి 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టే విధంగా చేశారు''. హే ప్రభూ! నేను ఈ 'శ్రీనివాస కళ్యాణాలు' కార్యక్రమములో కాకుండా మిగిలిన అన్నింటిలో తప్పులు చేశాను. మీరు చెప్పినట్లు నడుచుకోలేదు. మీరు ఎన్నోసార్లు హెచ్చరించారు, అనుభూతుల రూపంలో దిశా నిర్దేశం చేశారు. అయినప్పటికీ నేను వాటిని పట్టించుకోక తప్పులు చేశాను, మిమ్మల్ని బాధ పెట్టాను. అనుభూతులను చూపుటలో మీరు ఎంతో శ్రమకోర్చారు, నేను మిమ్మల్ని కష్టపెట్టాను. ఈ దీనుని కోసం ఆ కష్టాన్ని సహించారు''. కాని నేను మాత్రం అజ్ఞానం వల్ల ఎన్నో తప్పులు చేశాను. అని చెప్పుచు నేను చేసిన తప్పులను ఈ క్రింది విధంగా చెప్పాను.

మీరు నన్ను వ్యాపారం చేయవద్దన్నారు. నేను వినలేదు. 'నా' అన్నది వదలమన్నారు, అదీ వినలేదు. కాలక్షేపము చేయక ఎల్లప్పుడు మిమ్మల్ని స్మరించమన్నారు. చేయలేదు. యోగ్యత సాధించమన్నారు... సాధించలేదు. అంతే కాకుండా మీరు నాకు అప్పచెప్పిన పనులలో తప్పులు చేశాను. పర్యవసానంగా నా సంకల్పంలో విఫలుణ్ణైనాను. నన్ను క్షమించు, మన్నించు, నీ సేవకుడిని రక్షించమంటూ వేడుకున్నాను. నా సంకల్పం నెరవేరే మార్గాన్ని, శక్తిని ప్రసాదించమని వేడుకున్నాను. ఈ ప్రార్థన నా హృదయాంతరంగము నుండి వచ్చింది కాబట్టి నా కళ్ళ నుండి నీరు ధారగా కారాయి. కొంత సమయం తరువాత హృదయం ప్రశాంతతతో నిండింది. అప్పుడు మళ్ళీ స్వామివారిని దీనంగా వేడుకున్నాను, నన్ను ఆశీర్వదించమని, మన్నించమని పదే పదే వేడుకున్నాను. గత 20 సంవత్సరాల నుండి చేసిన ప్రతి తప్పును క్షమించమని ప్రాధేయపడ్డాను. ఇప్పటి నుండి మీవాడిగా, మీరు చెప్పినట్లు నడుచుకుంటానని మాట ఇచ్చాను. నాలాంటి చిన్న సేవకుని కోసం స్వామివారు ఎంతో కష్టపడ్డారు. దానికి నేనే కారణం, క్షమించమని భోరుమన్నాను. దుఃఖాన్ని ఆపుకోలేక చాలాసేపు పశ్చాత్తాపముతో విలపించాను. ఆ తరువాత మళ్ళీ ఇలా ప్రార్థించాను.

ముఖ్యంగా మీ ఋణాన్ని తీర్చుకునే మార్గాన్ని సూచించమని దీనంగా వేడుకున్నాను. మీరు చూపిన ప్రేమకు, లీలలకు, కనీసం నాలుగు జన్మలు ఈ జన్మలో చేసినంత సేవ చేస్తే కొంతవరకు తీర్చుకోగలను. అందుకు నన్ను ఆశీర్వదించమని వేడుకున్నాను. మరియు ప్రతి క్రొత్త జన్మలో మీకు ఋణపడి ఉన్నాననే జ్ఞానమును మరచిపోకుండా ఉండేటట్లు అనుగ్రహించమన్నాను. ప్రతిరోజు ప్రతి క్షణం ఈ విషయాన్ని నాకు గుర్తు చేయవలసిందిగా పదే పదే వేడుకున్నాను. నేను ఈ జన్మలో ఇంతవరకు చేసిన మొత్తం సేవ వడ్డీకి కూడా సమానము కాదని అన్నాను. మీరు చూపిన ఒక్కొక్క లీల ఒక్కొక్క జన్మ మొత్తం సేవ చేసినా సరిపోదని, అలాంటివి ఎన్నో ప్రసాదించారని, నేను ఎలా మీ ఋణం తీర్చుకునేదని ఏడ్వసాగాను. నాకు మరిన్ని జన్మలు అవసరము, మరియు ప్రతి జన్మలో మీ సేవాభాగ్యము లభించుట అన్నది మీ కృప పైననే ఆధారపడి ఉంటుందని ప్రార్థించాను. దీనిని ఈరోజు సాయంత్రం మా ఆఫీసులో ప్రార్థించాను. నా ఈ వేదనకు స్వామివారు 12 గంటల లోపలే ఈ క్రింది విధంగా సమాధానమిచ్చారు.

**తేది 29-01-2022 కల :** ఈ కలలో నేను మా ఊరిలోని పాత ఇంటిలో ఉన్నాను. అదే మా ఇల్లంట. భిక్షాటనకై ఒక హరిదాసు వచ్చాడు. వాకిట్లో నిలబడి, ఇంటిలో ఉన్న మమ్మల్ని భిక్షం వేయండి అనే విధంగా తన సహజ ప్రవర్తనైన ''హరిలో రంగ హరి'' అంటూ చిరుతలు వాయిస్తూ నిలుచున్నాడు. నేను ఒక చాటలో బియ్యం తీసుకుని గడప దాటి ఆ హరిదాసు అక్షయపాత్రలో పోశాను. దానికి ప్రతిగా తన అక్షయ పాత్ర నుండి కొన్ని బియ్యాన్ని తన పిడికిలితో తీసి, నేను తెచ్చిన చాటలో ప్రతిఫలంగా మూడుసార్లు పోశాడు. ''శ్రీవేంకటేశ్వర కృపా కటాక్ష సిద్ధిరస్తు'' అని దీవిస్తూ ఈ బియ్యాన్ని ప్రతిఫలంగా




శ్రీ వేంకటేశ్వర కృపాకటాక్ష సిద్ధిరస్తు
అని దీవిస్తున్న హరిదాసు

పోశాడు. వెంటనే అతడన్న ''శ్రీవేంకటేశ్వర కృపా కటాక్ష సిద్ధిరస్తు'' అనే మాట నా హృదయంలో ప్రతిధ్వనించసాగింది. ఉదయం 5.30 కు అలారం మ్రోగడంతో కల చెదిరింది. కాని శ్రీవేంకటేశ్వర కృపా కటాక్ష సిద్ధిరస్తు అనే మాట మాటి మాటికీ వినపడుచున్నది. ఉదయం 8 వరకు దాదాపు 30-40 సార్లు నా హృదయంలో ప్రకంపనలు వచ్చాయి. ఈ విధంగా శ్రీవేంకటేశ్వరుడు నన్ను ఆశీర్వదించాడు. ఉదయం నా భార్యకు చెప్పినప్పుడు ఆమె సంతోషించింది. దీనితో గతకొన్ని రోజుల నా తపనకు శాంతి లభించింది. మరియు నా సంకల్పము త్వరగా సిద్ధించుటకు ఒక ఉపాయాన్ని కూడా ఈ క్రింది విధంగా సూచించాడు.

## శ్రీ ఆంజనేయుణ్ణి ప్రార్థించమనే ఆదేశం

**తేది 06-02-2022 :** తేది 05-02-2022 నాడు వసంత పంచమి. ఈరోజు ఉదయం 5.15 గంటలకు ఒక హృదయాంతర అనుభూతిని పొందాను. ఈ అనుభూతిలో స్వామివారు నన్ను శ్రీ ఆంజనేయుల వారిని అర్చించమని సందేశమిచ్చారు. ప్రదక్షిణ పూర్వకంగా, అత్యంత భక్తితో, ఆత్రుత కలిగిన హృదయంతో అర్చించమన్నారు. నా యొక్క సంకల్పసిద్ధికి కావలసిన శక్తి సామర్థ్యాలను ప్రసాదించమని శ్రీ ఆంజనేయుల వారిని వేడుకొమ్మనే దివ్యమైన ఆదేశాన్ని ఈ క్రింది విధంగా పొందాను.

శ్రీ మహంకాళీ సమేత... ఉన్న ఆలయంలోని శ్రీ ఆంజనేయుల వారిని ప్రార్థించమని చెప్పారు. శ్రీ మహంకాళీ సమేత... గా ఉన్న ఆలయం మా కాలనీలోనే ఉన్నది. అది మా ఇంటినుండి ఆఫీసుకు వెళ్ళే దారిలోనే ఉన్నది. అది ''శ్రీ మహంకాళీ సమేత శ్రీరామాలయం'', కాకతీయనగర్, హబ్సీగూడ వీధి నెం.1 లో మా ఆఫీసుకు సమీపంలోనే ఉన్నది. ప్రతిరోజూ ఇంటినుండి ఆఫీసుకు, తిరిగి ఆఫీసు నుండి ఇంటికి వెళ్ళునపుడు తప్పకుండా ఈ ఆలయం ముందు నుండే వెళ్ళవలసి ఉంటుంది. ఈ విధంగా శ్రీ మహంకాళీ సమేత... అని చెప్పి విరామం ఇచ్చి అక్కడ ఉన్న శ్రీ ఆంజనేయ స్వామివారిని తనివితీరా అర్చించు, సంకల్పసిద్ధికి ప్రార్థించు, ఆయన అనుగ్రహము పొందు'' అనే ఆదేశాన్ని పొందాను.

స్వామివారి ఆదేశానుసారం తేది 05-02-2022 నాడు 11.30 గంటలకు నా తనివితీరా శ్రీ ఆంజనేయుణ్ణి 11 ప్రదక్షిణలు చేసి ప్రార్థించుట ప్రారంభించాను. మొత్తం 11 రోజులు తేది 15-02-2022 మంగళవారం వరకు చేశాను. శ్రీ ఆంజనేయుని తరువాత అక్కడనే ఉన్న శ్రీరాముడిని కూడా శ్రీవేంకటేశ్వరునిగా భావిస్తూ ప్రదక్షిణలు చేసి నా సంకల్పము సిద్ధించుటకు తగిన శక్తి సామర్థ్యములను ప్రసాదించమని వేడుకున్నాను.

బహుశా నేను గత కొన్ని రోజుల నుండి స్వామివారి ఋణాన్ని తీర్చుకునే భాగ్యాన్ని ప్రసాదించమని, సంకల్పం సిద్ధించుకునే మార్గాన్ని, శక్తిని ప్రసాదించమని అత్యంత దీనంగా వేడుకున్నాను కాబట్టి జవాబుగా ఈ ఆదేశం పొందానని భావించాను. మరియు కోవిడ్ వల్ల ఆగిపోయిన కళ్యాణాల కార్యక్రమము తిరిగి ప్రారంభమగుటకు శ్రీ ఆంజనేయుణ్ణి, శ్రీరాముణ్ణి ప్రార్థించమని చెప్పి ఉండవచ్చని కూడా భావించాను.

ఆ తరువాత స్వామివారిని ప్రతిరోజూ అత్యంత ఆత్రుతతో నా సంకల్పము నెరవేర్చుమని, తగిన శక్తి సామర్థ్యములను ప్రసాదించమని పదే పదే ప్రార్థించసాగాను. స్వతహాగా నేను అల్పుడనని, ఎలాంటి శక్తి సామర్థ్యాలు లేనివాడనని, మీరు దయ తలిస్తేనే విజయుణ్ణి కాగలనని లేకుంటే లేదని నా కారణంగా మీరు తరతరాలుగా స్మరింపబడే సేవను ప్రసాదించుమని వేడుకున్నాను.

మరియు ఈ మధ్యన నాకు తెలిసిన కొంతమంది సహాయముతో స్వామివారి హరినామ క్షేత్రమునకు అనువైన స్థలమును చూచుట ప్రారంభించాను. ఈ క్షేత్రం విశాలంగా ఉండాలని, భక్తులకు అందుబాటులో ఉండాలని, పైగా దీనిపై సంపూర్ణ అధికారాలు నాకే ఉండాలనే కోరిక నాలో బలంగా ఉండేది. నాకు దగ్గరగా ఉన్న హబ్సీగూడ, ఉప్పల్ ప్రాంతాలలో చూచాను. ఇంతలో స్వామివారు ఒక లీలను ప్రసాదించారు.

తేది 27-02-2022 నాడు మా ఇంటిలోని పూజ గదిలో పూజ చేయు సమయాన స్వామివారు ఒక ప్రత్యేకమైన విధంగా చాలా అందంగా, సుందరమైన, బలిష్టమైన బాహువులతో కనబడ్డారు. మరియు ధగ ధగా మెరుస్తూ ప్రత్యేక ఆకర్షణతో కనిపించారు. ఒక పర్యాయం అఖండ నామ సంకీర్తన స్థాపించుమని చెప్పినప్పుడు, లేదా భక్తులను సమ్మోహితులను చేసి తన వద్దకు రప్పించుకుందుననే విషయమును తెలిపిన సమయాన ఏ విధంగా బలిష్టమైన, సుందరమైన బాహువులతో కనబడ్డారో అదే విధంగా ఆనాటి చిత్రమును గుర్తుకు తెచ్చే విధంగా కనబడ్డారు. చాలా సంతోషించాను. దీని అర్థం శుభ సూచకమని భావించాను.

## శ్రీవేంకటేశం మాసపత్రిక పుణ్యాన్ని స్వామివారికి ధారపోయుట – స్వామివారు స్వీకరించుట

**తేది 02-03-2022 :** శ్రీవేంకటేశం మాసపత్రికను ఏప్రిల్ 2007 న ప్రారంభించాము. తేది 02-03-2021 వరకు మార్చి 2022 నెల శ్రీవేంకటేశం పత్రికకు సంబంధించిన పోస్టింగులు మరియు రచయితలకు డబ్బులు పంపడము పూర్తైంది. దీనితో మేము పత్రికను నడుపడం 16 సంవత్సరాలు పూర్తి చేసుకుని 17వ సంవత్సరం లోకి అడుగిడుచున్నాము. ఏప్రిల్ 2007


నుండి ఈ 16 సంవత్సరాలు స్వామి ఆజ్ఞ ప్రకారం మాసపత్రికను నడిపాము. ఇప్పుడు ఈ మొత్తం 16 సంవత్సరముల పుణ్యమును స్వామివారికి ధారపోయాలనే భావనతో ఈ విధంగా ప్రార్థించాను.

స్వామీ! భూమిలో పండిన ధాన్యము కేవలం యజమానికే చెందినట్లు, ఈ 16 సంవత్సరముల పుణ్యఫలము మొత్తం మీదే శ్రీవేంకటేశ్వరా! నేను కేవలం ఒక సేవకుడిని మాత్రమే కాబట్టి యజమానిగా ఈ మొత్తం పుణ్యాన్ని మీకు ధారపోస్తున్నానని స్వామివారికి ఈ మొత్తం పుణ్యమును ధారపోశాను. నీటిని చేతిలోకి తీసుకుని గోవిందా గోవిందా అంటూ స్వామివారి పాదాల ముందు వదిలాను. ఈ విధంగా అత్యంత భక్తి ప్రపత్తులతో, 16 సంవత్సరముల మొత్తం పుణ్యమును నా స్వామివారైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ధారపోశాను. ఇప్పుడు నా మనస్సులో భారము తగ్గి తేలికగా, హాయిగా ఉన్నాను. మీ సేవకుడిగా నన్ను మరింత కాలము మరిన్ని పనులను చెప్పి కరుణించమని వేడుకున్నాను. మరియు దీనిని మీరు స్వీకరించానని కనీసం ఒక వారం రోజులలో తెలుపవలసిందిగా దీనంగా వేడుకున్నాను.

తేది 04-03-2022 మా పెండ్లి రోజు. ఆ రోజు స్వామివారి ఆశీర్వాదము తీసుకొనుటకు ఒక రోజు ముందు అనగా తేది 03-03-2022 నాడు తిరుపతి వెళ్ళాము. తేది 03-03-2022 నాడు రెండు మరియు తేది 04-03-2022 నాడు మరో రెండు వి.ఐ.పి దర్శనాలను దర్శించాము. ఇలా మొత్తం 24 గంటలలో 4 సార్లు దర్శించినప్పటికీ నేను తృప్తి చెందలేదు. మరింతసేపు స్వామి చెంత ఉండి చూడాలనే కోరికతో ఉన్నాను. నా భార్య మాత్రం స్వామివారు ప్రసాదించిన దానితో తృప్తి చెందాలని చెప్పింది. ఆ తరువాత బాధాతప్త హృదయముతో హైదరాబాద్ వచ్చాము.

గత 4-5 రోజుల క్రితం మొత్తం 16 సంవత్సరాల శ్రీవేంకటేశం మాసపత్రిక పుణ్యమును నా స్వామివారికి సమర్పించాను. పొలములో పండిన ధాన్యముపై అధికారం కేవలం భూ యజమానిదే తప్ప ఆ పొలములో పని చేయువారిది కాదు కదా! ప్రభూ! అంటూ ఈ పుణ్యాన్ని సమర్పించాను. తేది 02-03-2022 నాడు హైదరాబాద్ లో మరియు మొన్న తిరుపతిలో కూడా నా ఈ ప్రార్థనను స్వీకరించవలసిందిగా వేడుకున్నాను. ఏదేని లీలను చూపమని ఆశ పడ్డాను. అనుకున్నట్లు ఈరోజు ఉదయం స్వామివారు మా మాసపత్రిక సేవతో అత్యంత తృప్తి చెందానని తెలుపుచు ఈ క్రింది లీలను చూపారు.

**తేది 08-03-2022 కల :** ఈ కలలో నేను ఒక అంగడికి వెళ్ళాను. ఆ అంగడిలో దీపావళికి దుకాణాలను ఏ విధంగా




పూలతో మరియు ప్రసాదాలతో నిండుగా ఉన్న దుకాణాలు

పూ లతో అలంకరించుకుందురో ఆ విధంగా ప్రతి దుకాణం మహా అద్భుతంగా పూలతో అలంకరించబడి ఉన్నది. నేను తిరుగుతూ తిరుగుతూ ఒక దుకాణం లోనికి వెళ్ళాను. అక్కడ పూల దండలను గజ మాలలుగా చేసి ఆ గజమాలలను ఆ దుకాణము నిండా కట్టారు. ఆ గజమాలలను ఆ దుకాణములో చుట్టూ ఉన్న గోడలు, పైన కప్పు కనబడకుండా కట్టారు. ఒక ఎనిమిదడుగుల పైన సన్నపు తీగలను జాలీ లాగా బిగించి దానిపైన పూలమాలలను పడుకోబెట్టారు. క్రిందినుండి చూచినప్పుడు చాలా ముచ్చటగా కనిపిస్తున్నవి. ఇక ప్రతి గోడలకు ఈ గజ మాలలను పైనుండి క్రిందికి వేలాడదీశారు. ఆ దుకాణంలో ప్రతి గోడకు, కప్పు ఎక్కడా ఇంచు కనబడకుండా మొత్తం గజమాలలతో అలంకరించారు. దుకాణం లోనికి వెళ్ళి చూచినప్పుడు చాలా ముచ్చటగా కనిపించింది. నేను ఇంతవరకు పూలమాలలతో అలంకరించుట చూచాను కాని గజమాలలతో అది కూడా చుట్టూ గోడలు, పైన కప్పు మొత్తం నిండునట్లు ఇంతపెద్ద గజమాలలతో అలంకరణ చూడడం నా జీవితంలో ఇదే మొదటిసారి. ఈ పూలు అతి సుందరంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, షాపు మొత్తం కలియతిరిగినా కూడా పూల అలంకరణకు ఇబ్బంది లేనట్లు, అన్నీ బాగా కనబడే విధంగా అలంకరించారు. చాలా క్రొత్త పద్ధతిలో అత్యంత సుందరంగా అలంకరించారు. వీటిని చూచి ఆశ్చర్యపోతూ ఏంటి ఇలా ఇన్ని టన్నుల పూలు కట్టారు, ఏంటి విషయం అని అడుగగా వారు నిన్న ''నాగోబా గద్దెల మీదికి వచ్చారు'' అనే అర్థంతో ఏదేదో అన్నారు. అంటే నిన్న దేవుడు వచ్చారు, అందుకు ఈ విధంగా అలంకరించామని అర్థం. ఆ తరువాత అక్కడ నుండి వేరే దుకాణం వద్దకు పోయాను. అక్కడ కొన్ని టన్నుల స్వీట్లు, కొన్ని వందల రకాలు నైవేద్యంగా అమర్చినవి చూచాను. అవి కూడా నిన్నటి పండుగకు స్వామివారికి సమర్పించారట. ఎన్నో టన్నుల మిఠాయిలను ఎనిమిది అడుగుల ఎత్తు వరకు ఒక పళ్ళెముపై మరో పళ్ళెము చొప్పున పటములో చూపినట్లు అమర్చారు. ఈ ప్రసాదాలు మార్వాడి భక్తులు స్వామివారికి 500-600 రకాల ప్రసాదాలను సిద్ధం చేసి మంచి పళ్ళాలలో పెట్టి నివేదించినట్లు ఉన్నది. ఒక క్రొత్త పద్ధతిలో అన్ని ప్రసాదాలు దేవుని ముందు, ఆయనకు కనపడే విధంగా ఏర్పాట్లు చేశారు. పిదప ఆ రోడ్డుపై నిలబడి చుట్టూ ఉన్న అన్ని దుకాణాలను ఆనందంతో చూడసాగాను. ఇంతలో నా ప్రక్కన మా బంధువు శ్రీమాన్ నాగిరెడ్డి సంజీవరెడ్డితో మాట్లాడినట్లు అనిపించింది. మరో క్షణములో ప్రక్కన ఒక తెలిసిన మా వాడైన ఒక చిన్నపిల్లవాడు కనబడ్డాడు. వాడు అప్పుడే అంత పెరిగాడా? అనే ఆలోచన వచ్చింది. ఆ పిల్లవాడు మా ఇంటివాడేనట, ఇంతకు ముందు చాలా చిన్నవాడు కాని నేడు నా ఎత్తుగా పెరిగినట్లు అనిపించింది. కల చెదిరింది.

ఇలా ఆ అంగడి మొత్తం అన్ని దుకాణాలలో వందల టన్నుల గజమాలలతో, వందల టన్నుల నైవేద్యాలతో అలంకరించారు. ఈ రెండూ కూడా ఒక విశిష్టమైన పద్ధతిలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. చాలా ఆనందపడ్డాను. దీని అర్థం –శ్రీవేంకటేశం 16 సంవత్సరాల పుణ్యఫలమును స్వామివారు స్వీకరించానని తెలుపుటకు నిదర్శనమని భావించాను.

ఇక శ్రీమాన్ సంజీవ రెడ్డి గారు మా పెద్ద కొడుకు చి|| వేదాంత్ కు పిల్లనిచ్చిన మామ. ప్రక్కన చిన్నపిల్లవాడు త్వరగా పెరిగి, నా అంత ఎత్తు కావడం కూడా చూచాను. దీనర్థమును విశ్లేషించాను.

నాకు ఇద్దరు కొడుకులు. శ్రీమాన్ సంజీవరెడ్డి మా పెద్ద కొడుకు మామ. ఆయన ప్రక్కన ఉన్న చిన్నపిల్లవాడు నా పెద్ద కొడుకైన చి|| వేదాంత్ కొడుకు. వీడు చిన్నపిల్లవాడిగా ఉండేవాడు, కాని త్వరగా పెరిగి నా ఎత్తుకు వచ్చాడు. అంటే... ఈ భాగం ప్రచురణ సమయం (మే 2026) వరకు నాకు ఒక మనవడు పుట్టబోతున్నాడని, వాణ్ణి మంచి భక్తుడిగా స్వామివారు స్వీకరిస్తున్నారని అర్థం. ఈ రాబోవు హరినామ క్షేత్రానికి ఒక ముఖ్యమైనవాడుగా ఉండగలడని భావించాను. నాకు ఒక భక్తుడైన మనవడు ఉండగలడని స్వామివారు చెప్పడం ఇది మూడవసారి. ఈ కలలో నేను వాణ్ణి చూచి చాలా రోజులైంది, ఇంతలో ఇంత పెరిగాడా? అని ఆశ్చర్యపోయాను. అంటే... నేను దీని ప్రచురణ సమయంలో కొడుకుతో కాని, మనవడితో కాని సంబంధమును అంతగా కలిగి ఉండక, స్వామి సేవలో ఒంటరి జీవితము గడుపుదునని స్వామివారు సూచించారు.

## చెప్పులు కొనుట

స్వామివారి ప్రతి లీలకు అర్థం పరమార్థం ఉంటాయి. కల గన్న సమయంలో అర్థం కానప్పటికీ ప్రతి లీలను ఏదో ఆశించి చూపెడతారు.

**తేది 17-03-2022 కల :** నేను చెప్పులు లేదా బూట్లు (షూ) కొనుటకై ఒక మంచి బాటా లాంటి పేరున్న సంస్థ షాపుకు పోయాను. అది ఒక మంచి అంగడిలో ఉన్నది. పూర్వం కాశీలో విశ్వేశ్వరుని ఆలయానికి వెళ్ళే దారిలో ఇరువైపులా క్రిక్కిరిసి ఉన్న దుకాణాల లాగా ఈ అంగడి ఉన్నది. ఆ దుకాణానికి చిన్న చిన్న సందుల లోనుంచి నడిచివెళ్ళి దుకాణం చేరుకుని అందులోని వారిని నాకు బూట్లు కావాలని అడిగాను. అది భారతదేశంలో పేరున్న కంపెనీ అట. అక్కడ ఈ దుకాణమునకు రెండు షాపులు ఉన్నవి. ఒకటి షోరూం అయితే, రెండవది స్టోర్ రూమ్ లాగా వాడుచున్నారు. నేను లోపల ఉన్న స్టోర్ రూమ్ కు వెళ్ళి అడిగాను. అక్కడ ఉన్న వ్యక్తి ఏదో చెప్పాడు. దానికి




చెప్పులు చిన్నగా ఉన్నవని ఒకింత చింతించుట

నేను సంతృప్తి చెందక వేరే దుకాణానికి పోవుటకు బయలుదేరు సందర్భంలో వీరి షోరూమ్ లో నా ఇంజనీరింగ్ మిత్రుడు శ్రీమాన్ 'బస్వరాజ్' ఆ షోరూమ్ ను నిర్వహిస్తూ కనబడ్డాడు. ఇద్దరం ఒకరినొకరు చూచుకొని చేతులతో హలో చెప్పుకున్నాము. ఆ తరువాత ఆయన నన్ను మళ్ళీ ఈ గోదాము లోనికి తీసుకొచ్చి ఒక గదిలో కూర్చోబెట్టాడు. తను ఈ ప్రాంతానికి ఈ కంపెనీ నిర్వహణ యజమాని అయినప్పటికీ చాలా బాధలను అనుభవిస్తున్నాడని, వారి బాధలను అది ఇట్లా ఇది అట్లా అంటూ తన వేదనను తెలిపాడు. నేను ఆయన మిత్రుడనని, ఆ గోదాంలో ఇంతకుముందు చెప్పులు చూపిన వ్యక్తికి పరిచయం చేసి మంచి బూట్లను చూపమని అన్నాడు. అప్పుడు ఆ వ్యక్తి నా కాలు సైజు చూచి మంచి వాకింగ్ షూ లాంటి వాటిని తెచ్చి ఇచ్చాడు. అవి చూచుటకు చిన్నసైజుగా కనబడ్డవి. కాని నేను వేసుకునేసరికి చక్కగా సరిపోయినవి. మంచి సౌకర్యవంతముగా కూడా ఉన్నవి. చూచుటకు మాత్రం చిన్నవి. నా కాలు చిన్నది, అందుకే ఇవి బాగుంటాయని ఆయన అభిప్రాయం. ప్రక్కన మరో షూ కొంచెం పెద్ద సైజుది కనబడ్డది. దాని పైకి మనస్సు పోయింది కాని చూడలేదు. కల చెదిరింది.

శ్రీమాన్ బస్వరాజ్ గారు నాకు ఇంజనీరింగులో మిత్రుడు. ఇప్పుడు ఈ సమయాన ఈయన సిద్ధిపేటలో ఇరిగేషన్ డివిజన్ కు హెడ్ గా, సూపరింటెండెంట్ ఇంజనీరుగా పని చేస్తున్నాడు. ఈయన నాకు మంచి సౌకర్యవంతమైన తగిన సైజు షూ ఇప్పించాడు. కాని నేను మాత్రం నా కాలు చిన్నదైనప్పటికీ, చూచిన వారికి చిన్నపిల్లవాడిగా కనిపిస్తానని, చిన్నచూపు చూస్తారనే కోణంలో ఆలోచించాను. ఐనప్పటికీ ఆయన ఇచ్చిన మంచి బూట్లు వేసుకుని ఆనందించాను. వీటితో ఎక్కడికైనా ఇబ్బంది లేకుండా వెళ్ళవచ్చనే అభిప్రాయము కలిగింది.

దీనర్థం – స్వామివారు నాకు తగినది ప్రసాదిస్తున్నప్పటికీ, నేను మాత్రం లౌకిక వ్యామోహం పూర్తిగా తగ్గక అంతరంగాన కొంత గొప్పల కోసం పాకులాడుదునని, బాహ్యంగా మాత్రం స్వీకరించని స్థితిలో దీని ప్రచురణ (మే 2026) సమయాన ఉందునని సూచించారు. ఈ అర్థం ఈ భాగం డి.టి.పి చేస్తున్నప్పుడు కలిగింది.

## బావి వద్ద కళ్యాణ శోభ

**తేది 18-03-2022 కల:** మేము చిన్నగుండవెల్లిలోని మా తోటబావి వద్ద బాగా అభివృద్ధి చేశామట. బహుశా అక్కడ ఆలయం నిర్మించి ఒక కళ్యాణ మంటపమును కూడా ఏర్పాటు చేశామట. స్వామి కళ్యాణ విషయమై కొంతమందితో కలిసి, నేను కూడా ఊరిలోని మా ఇంటి నుండి తోటబావి వద్దకు వెళ్ళుచున్నాను. మా తోటబావి వద్ద దేవుడు ఉన్నాడు, ఎదుర్కోవాలని భావించి చప్పుడుతో ఒక పది ఇరవైమందిమి కలిసి వెళ్ళుచున్నాము. తోటబావి వద్దకు చేరే క్రమములో మా భూమి కంటే ముందు ఉన్న గొల్ల యెల్లయ్య బావి వరకు వెళ్ళాము. దీని తరువాత పొలము మాదే. ఇంతలో మా బావి వద్ద ఇంతకుముందే ఒకరి కళ్యాణము లాంటి కార్యక్రమము జరుగుచున్నది. చాలామంది భక్తులు చప్పుడుతో ఊరేగింపు తీస్తున్నారు. వీరు చాలా పెద్ద మనుషులు, అంటే ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగినవారట. వీరు చప్పుడుతో అక్కడనే ఒక ప్రాంతము నుండి మరో ప్రాంతమునకు పోవుచున్నారు. అందులో కొందరు ఆ ప్రొసెషన్ నుండి బయటకు వచ్చి మాకు ఎదురుగా వచ్చుటను చూచాను. వారు మా పశువుల కొట్టము దగ్గర నుండి ఆ దారి గుండా మా పొలము ఎదురుగా ఉన్న ప్రధాన మార్గము వద్దకు వస్తున్నారు. ఇక వీరి ప్రొసెషన్ పశువుల కొట్టము వెనుక భాగములో ఉన్న చెఱువు సమీపములోని మా భూమిలో జరుగుచున్నది. ఈ శబ్దము విన్న నేను నా ప్రక్కవారితో ఇలా అన్నాను. ''చూచారా! ఇక్కడ చాలా కళ్యాణాలు అవుతూ ఉంటాయి, ఎవరో ఒకరు కళ్యాణం చేసుకుంటున్నారన్నాను''. కల చెదిరింది.

ఆ సమయాన దీనర్థం గ్రహించలేదు కాని నిజమైన అర్థం ఇలా ఉంది. మా తోట బావి వద్ద దాదాపు పశువుల కొట్టము అడుగు భాగములో దేవాలయము నిర్మించమన్నారు. దీని వెనుక భాగములో కళ్యాణ మండపములు కట్టుకోవచ్చన్నారు. మొత్తం మీద మా తోట బావి వద్ద స్వామివారు స్థిర నివాసము చేసుకుందురని సూచన ప్రాయంగా తెలిపారు.




బావి వద్ద కళ్యాణ శోభాయాత్ర

దాదాపు 45 రోజుల క్రితము ఉదయము నేను యోగా ముగించు సమయాన ''శీర్షాసనము'' శీర్షాసనము అంటూ ఒక హృదయాంతర భావము కలిగింది. ఆ రోజు నుండి వారానికి రెండు మూడు సార్లు శీర్షాసనము వేస్తున్నాను. స్వామివారు చెప్పారు కాబట్టి వేస్తున్నాను తప్ప ఈ అనుభూతి ఎందుకో నాకు తెలియదు. బహుశా భవిష్యత్తులో కొన్ని కఠిన పరిస్థితులను ఎదుర్కొనుటకు వీలుగా నా మానసిక స్థితిని దృఢ పరచుటకు సిద్ధం చేస్తున్నట్లు సూచనలిచ్చారు.

## కోరిక సిద్ధించు సమయము ఆసన్నమైనది

గత కొన్ని రోజుల నుండి హరినామ క్షేత్రము ఎక్కడ నిర్మించాలని నాకు తెలిసిన ఎన్నో ప్రాంతాలను చూస్తూ, ఎంతోమంది అభిప్రాయములను తీసుకుంటున్నాను. స్వామివారిని కూడా తగిన స్థలము చూపించమని తీవ్రంగా ప్రార్థించాను. దీని జవాబే ఈ కల.

**తేది 22-03-2022 కల :** ఈ కలలో నేను మా చిన్నగుండవెల్లి గ్రామములోని పాత ఇంటిలో ఉన్నాను. అదే మా ఇల్లనే భావన ఉన్నది. మా ఇంటిలో ఏదో ఒక పూజ లేదా యజ్ఞ కార్యక్రమము కొరకని చాలామంది బంధువులు, పాలివారు వచ్చారు. ఈ పూజ సంబంధమైన పనులను తలా ఓ పని చేస్తున్నారు. ఈ పూజను మేము చాలా రోజుల నుండి చేస్తున్నామట. ఇప్పుడు ఈ పూజ లేదా యజ్ఞం చివరి దశకు చేరిందట. అంటే... దేనిని ఆశించి మేము ఈ పూజ/యజ్ఞ కార్యక్రమాలు చేస్తున్నామో అది సిద్ధించు సమయము ఆసన్నమైనదనే భావం మనస్సున కలిగింది. మరియు ఈ మొత్తం కార్యక్రమము మా అమ్మ నిర్వహణ లోనే జరుగుచున్నదట. మా ఇంటికి వచ్చిన బంధువులు, పాలివారు అందరూ కూడా మా అమ్మ ఆహ్వాన అనుసారమే వచ్చారట. నా భార్య సురేఖ కూడా ఇందులో ఉన్నదట, కాని ఈమెది రెండవ స్థానమేనట. ఈ కలలో మా అమ్మ కాని, సురేఖ కాని కనబడలేదు, కేవలం ఊహ మాత్రమే. జనాల కోలాహలం జరుగుచున్నట్లు భ్రాంతి చెందాను. మరియు కోరిక సిద్ధించు సమయం ఆసన్నమైనదనే భావం స్పష్టంగా వచ్చింది. ఇంతే కల.

దీనర్థం నేను ఏది ఆశించి గత 20 సంవత్సరాల నుండి స్వామిసేవ ఒక యజ్ఞం లాగా చేస్తున్నానో అది సిద్ధించు సమయము ఆసన్నమైనదని అర్థం. ఎంతో సంతోషించాను.

ఈ కాలములో జరిగిన కళ్యాణాలు : 17 వ కళ్యాణం నుండి 18వ కళ్యాణం వరకు మొత్తం రెండు కళ్యాణాలు జరిగినవి.

నా దశ : స్వామివారు ప్రసాదించిన సేవలను విశ్లేషించుకుని ఒక అవగాహనకు వచ్చాను. మళ్ళీ తప్పు చేయకూడదని నిర్ణయించుకున్నాను. స్వామివారి ఆశీర్వాదం లభించింది. దీని ప్రచురణ సమయం, మే 2026 వరకు నాలో ఎంతో మార్పు జరుగునని సూచించారు.

భాగవత ఆశీర్వాదము : తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.


**శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు**

**గోవిందదాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**

**ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సీగూడ,**

**హైదరాబాద్. ఫోన్: 040-27175050**

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 24వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

## శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చుమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

**నిబంధనలు:**

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మా నుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/- ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/-కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/- స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

**గమనిక:**

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!


## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ,
హైదరాబాద్ - 500007. ఫోన్: 040- 27175050


ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:

**93482 12354**

# వరాహ జయంతి

- డాక్టర్ దేవులపల్లి పద్మజ

**ఓమ్ నమో నారసింహాయ వజ్రదంష్ట్రాయ వజ్రిణే !**

**వజ్ర దేహాయ వజ్రాయ నమో వజ్రనఖాయచ!!**

వరాహావతారం హిరణాక్షుడిని చంపి, భూమిని ఉద్ధరించి, వేదములను కాపాడిన అవతారముగా స్వామి ప్రార్థనలలో ఒకటి, ఆది వరాహమూర్తి. భాద్రపద బహుళ తదియ రోజు జరుపుకునే వరాహజయంతి వేడుక ఘనంగా జరిపిస్తారు. రాక్షస సంహారం కావించి, భూదేవిని తిరిగి తీసుకొని వచ్చుటకు అవతరించిన శ్రీ మహావిష్ణువు యొక్క దశావతారాలలో మూడవ అవతారం వరాహావతారం. భక్తులు వరాహ స్వామిని మూడు రూపాలలో కొలుస్తారు. ఆది వరాహ స్వామి, ప్రళయవరాహ స్వామి, యజ్ఞ వరాహ స్వామిగా పూజిస్తారు. తిరుమల లో యజ్ఞ వరాహ స్వామిగా దర్శన మిస్తారు.



ఆదివరాహావతారం విష్ణువుయొక్క అవతారాలలో ఒకటి. వరాహనరసింహస్వామి తిరుమల క్షేత్ర పాలకుడు. వరాహ భగవానుడు. గర్భోదక సముద్రంలోకి దూకి, వరాహం రూపంలో ఉండి, తన ముక్కుతో వాసన చూస్తూ భూమిని పైకి తీసుకొచ్చిన అవతారం. విష్ణువు అవతారానికి అనుబంధంగా వైకుంఠ నివాసి పద్మ చిహ్నాలు కలిగి, సుదర్శన చక్రం, కౌమోదకి, పాంచజన్య ఆయుధాలుగా కలిగినవాడై హిరణ్యాక్షుడిని సంహరించుట, మరియు భూమిని రక్షించి, వేదాలను తీసుకొని వచ్చుటకు శ్రీ మహావిష్ణువు వరాహ అవతారమును మూడవ అవతారముగా ధరించి వచ్చెను. వారాహి, భూమి లక్ష్మి, ధర్మపత్ని కాగా, నరకాసుర, మంగళ అను ఇరువురు సంతానం. పూర్వరూపం కూర్మావతారం, నరసింహ వారసుడు.

పురాణాల ప్రకారం ప్రజాపతి- బ్రహ్మ స్వరూపం నుండి నారాయణ - విష్ణువు అవతారానికి వరాహ పూర్తి పరివర్తనను పూర్తి చేస్తాయి. బ్రహ్మాండ పురాణం, వాయు పురాణం, విష్ణు పురాణం, లింగ పురాణం, మార్కండేయ పురాణం, కూర్మ పురాణం, గరుడ పురాణం, పద్మ పురాణం మరియు శివ పురాణాలు విశ్వ పురాణం యొక్క సారూప్య వృత్తాంతాలను కలిగి ఉన్నాయి. ఇందులో బ్రహ్మ నారాయణునితో గుర్తించబడ్డాడు. విష్ణువు ఆదిమ జలాల నుండి భూమిని పైకి లేపడానికి వరాహ రూపాన్ని ధరించాడు.

ఇతిహాసం రామాయణంలో అయోధ్య కాండలో ప్రజాపతి- బ్రహ్మతో తన సంబంధాన్ని నిలుపుకున్న వరాహాన్ని సూచిస్తుంది. ఒక పురాణంలో బ్రహ్మ నీటితో

నిండిన ఆదిమ విశ్వం కనిపిస్తాడు. నీటి నుండి భూమిని వెలికి తీయుటకు వరాహ రూపాన్ని తీసుకున్నాడు. సృష్టి బ్రహ్మ మరియు అతని సంతానంతో ప్రారంభమవుతుంది.

ఒక సమయంలో భూగోళం తన పట్టుతప్పింది. భూభాగం కృంగిపోయింది. అదే సమయంలో అంతరిక్షంలో తన కక్ష్య నుండి ప్రక్కకు జరిగింది. దీనితో తన భూమిని నిత్యం రక్షిస్తూ ఉండే ఇంద్రుడు, అగ్ని, వాయువు, వరుణుడు మొదలైన దేవతలందరూ భయభ్రాంతులకు గురై, శ్రీమహావిష్ణువు వద్దకువెళ్ళి, సత్వరమే భూగోళాన్ని కాపాడమని వేడుకున్నారు.

దేవతల ప్రార్థనలు మన్నించి శ్రీమహా విష్ణువు, తన భార్య అయిన భూదేవిని రక్షించుటకు వరాహ అవతారం ధరించి, తన కోరల మీద భూమిని నిలిపి, అంతరిక్షంలో తన కక్ష్యలో తిరిగి నిలిపారు. అలాగే కృంగిపోయిన భూభాగాన్ని తిరిగి యథాస్థానానికి తీసుకొచ్చారు. ఈ విధంగా చేయడం వలన స్వామిని ఒక హిరణ్యాక్షుడు అనే రాక్షసుడు ఎదిరించాడు. వాడిని హతమార్చి స్వామి తిరిగి అంతర్ధానమయ్యారు. అందుకే వరహామూర్తిని అర్చించాలి. స్వామిని సేవించుకుంటే ప్రశాంత ఐశ్వర్య, ఆరోగ్య అభివృద్ధులను పొందవచ్చు. విశ్వసించి మనస్పూర్తిగా ఒక నమస్కారముతో మన సమస్యలను విన్నవించుకుంటే, శీఘ్రమైన శుభఫలితాలను ఇచ్చే వరాహస్వామి భక్తులకి ఆపద్బాంధవుడు, అనాథ రక్షకుడు.

**సమస్త పరివారాయ సర్వ దివ్య మంగళ**
**విగ్రహాయ శ్రీమతే నారాయణాయ నమః**

శ్రీ వరాహలక్ష్మీనృసింహ పరబ్రహ్మణే నమః

వరాహ అవతారం ఒకే కల్పంలో రెండు వేర్వేరు మన్వంతరాలలో వచ్చింది. ఆ కల్పం ప్రస్తుత శ్వేతవరాహ కల్పం మరియు ఆ రెండు మన్వంతరాలు ఈ కల్పంలో మొదటిదైన స్వయంభువ మన్వంతరం మరియు ఆరవదైన చాక్షుష మన్వంతరం. ప్రస్తుతం మనం ఏడవ మన్వంతరం లో ఉన్నాం, వైవస్వత మన్వంతరమని పేరు. స్వామి రెండుసార్లు భూమిని రక్షించడానికే అవతారం ఎత్తారు. బ్రహ్మ తన శరీరం నుంచి జన్మించిన స్వయంభువ మనువు మరియు శతరూపాలను సృష్టి కార్యంలో పాల్గొని వివిధ జీవరాశులను ఉత్పత్తి చేయమని ఆదేశిస్తాడు. కానీ భూమి ప్రళయ జలాలలో ఉంది. దీనినే గర్భోదక సముద్రం అంటారు. ఆ ప్రళయ జలాలలో అట్టడుగుకు భూమి చేరింది. కావున మా సంతానాన్ని అభివృద్ధి చేసినా ఎక్కడ ఉండాలి అని ప్రశ్నిస్తారు. బ్రహ్మ ఆలోచించు ఈ కాస్త సమయంలోనే స్వామి బొటన వ్రేలి పరిమాణంలో బ్రహ్మ నాటిక రంధ్రం నుంచి ఉద్భవించి చూస్తుండగానే భారీ వరాహ మూర్తిగా దర్శనమిస్తాడు. మనం తెలుసుకోవలసిన విషయం ఏమిటంటే శ్రీమహావిష్ణువు సృష్టిలో అంటే విశ్వం (బ్రహ్మాండంలో) మన



భూమి లేదా భూలోకం ఒకటి. అంటే 14 లోకాలలో ఇది ఒకటి. భూమి పైనే సముద్రం ఉంది కదా మరి భూమి సముద్రంలో మునగడం ఏమిటనే సందేహం రావచ్చు. మొత్తం 14 లోకాలు వీటినే చతుర్దశ భువనాలు అంటారు. మన భూలోకం కాకుండ మిగిలినవి సూక్ష్మ లోకాలుగా లేదా సాధారణ మానవుని చర్మ చక్షువులకి గోచరించని లోకాలు ఉన్నాయి. నేటి తరానికి alien planets, అందు నివసించేవారిని aliens అంటారు. ఈ 14 లోకాలను మూడు రకాలుగా విభజించారు. ఊర్ధ్వ లోకాలు 6, అవి భువర్లోక, మువర్లోక, సువర్లోక, జనోలోక, తపోలోక, సత్యలోకం. ఈ సత్య లోకాన్నే బ్రహ్మ గారి లోకం అంటారు. వీటిని పై లోకాలు అని కూడా చెప్తారు. క్రింది లోకాలు 7, అతల, వితల, సుతల, తలాతల, మహాతల, రసాతల, పాతాళలోకాలు.

అసలు విషయానికి వస్తే భూమి రసాతలంలో అడుగున చేరింది. ఆ రసాతలం కడు చీకటి లోకం. మరియు పంకిలం, అత్యంత చిత్తడితో కూడిన లోకం. వరాహానికి ఒక గొప్ప లక్షణం ఉంది. ఘ్రాణ శక్తి అద్భుతంగా ఉంటుంది. ఇటువంటి లోకంలో దాగిన భూమిని వెతకాలి కనుకనే వరాహ అవతారం స్వీకరించారు విష్ణువు.

ఈ విధంగా వరాహ అవతార ఆవిర్భావం వెనుక విశేషం. నవగ్రహాలను, భూమిని, ప్రకృతిని దైవంగా భావించే సంస్కృతి మనది. నమో వరాహ మూర్తయేనమః.

**నమస్తే దణ్డసింహాయ సత్య సింహాయతే నమః!**
**నమస్తే శ్వేత సింహాయ పీత సింహాయతే నమః!!**




# శ్రీరామ దూతం శిరసా నమామి

– చిల్లర సీతారామారావు

**శ్లో॥ అమల వర్ణం ప్రజల త్పావకాభం – సరసిజ నిభవక్త్రం సర్వదా సుప్రసన్నం**
**పటుతర ఘనగాత్రం భానుకోటి ప్రకాశం – రణజయ కరవాలం రామదూతం నమామి**

నిర్మలమైన కమలము వలె శోభించువాడును, ప్రజ్వలించు అగ్ని వంటి కాంతి గలవాడును, కమలము వలె అందమైన వదనముతో విరాజిల్లువాడును, సదా మహా ప్రసన్నుడుగా ఉండువాడును, దృఢమైన శరీరం గలవాడును, కోటిసూర్య ప్రకాశముతో భాసిల్లు వాడును, యుద్ధము నందు శత్రువులను ఛేదించు ఖడ్గము వంటి వాడును, శ్రీరాముని దూత యగు హనుమంతునకు ప్రణామము.

సమస్త లోకముల చేత ఆరాధింపబడు శ్రీరామచంద్రమూర్తికి దా సుడు హనుమంతుడు. భగవంతుని నామమగు రామ శబ్దమును, తత్సందేశమును, జీవులకు అందించు దూత కావున, హ నుమంతుడు శ్రీరామదూత అని ప్రేమగా పిలుచుకుంటూ ఆసేతు హిమాచలం, అన్ని ప్రాంతముల వారు హనుమంతుడిని భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తారు. భారత దేశములో శ్రీరామ మందిరము గాని, హనుమంతుడి మందిరము గాని లేని తావే లేదు.

హనుమంతుడు అను నామము అత్యంత పావనకర నామము. ఆ యన పేరును స్మరించుకోగానే భూత ప్రేతాదులు ఆమడ దూరం పారిపోతాయి. శ్రీరాముని దూత యగు హనుమంతుడు వీర, విక్రమ, సాహస, పరాక్రమ సముపార్జితుడు. అసాధారణ శక్తి సంపన్నుడు. బుద్ధిమతాం వరిష్ఠుడు. మహాయోగి. ఆ యోగ మహిమ చేతనే హనుమంతుడు దుష్కరమైన మహా కార్యముల నొనర్చ గలిగాడు. తన శరీరముచే శ్రీరాముని పాదసేవను, వాక్కుచే నిరంతరం శ్రీరామ నామ గాన స్మరణమును, మనస్సుచే పరమార్థ స్వరూప ధ్యానమును గావించుచు త్రికరణశుద్ధిగా శ్రీరాముని సేవించుచున్న భక్త శిఖామణి హనుమంతుడు. సుగుణాభిరాముడైన శ్రీరామునకు సేవకుడై, ప్రభువుతో పాటు పూజలందుకుంటున్న హనుమంతుడు చిరంజీవులలో ఒకడు. హనుమంతుడు రుద్రాంశ సంభూతుడు.

శ్లో ॥ దుష్టానాం శిక్షణార్థాయ శిష్టానాం రక్షణాయ చ
రామకార్యార్థ సిద్ధ్యర్థం జాతః శ్రీ హనుమాన్ శివః

దుష్టులను శిక్షించడానికి, శిష్టులను రక్షించడానికి అవతరించిన శ్రీరాముడికి సేవ చేయు నిమిత్తము శివుడు హనుమంతుడిగా జన్మించాడని శ్లోక భావము.

శ్లో ॥ వైశాఖేమాసి కృష్ణాయం దశమీ మంద సంయుతా
పూర్వ ప్రోక్త పదా యుక్తా తథా వై ధృతి సంహితా
తస్యామ్ మధ్యాహ్న వేళాయా మంజనా జనరంజనా
వాయు భక్తి రతా సాధ్వీ జనయా మాస వైసుతమ్

వైశాఖమాసము, కృష్ణపక్షము, దశమి తిథి, శనివారం, పూర్వాభాద్ర నక్షత్రము, ప్రథమపాదం, మిట్ట మధ్యాహ్నం, కర్కాటక లగ్నమున అంజనాదేవి, కేసరి దంపతులకు తనయుడుగా హనుమంతుడు జన్మించాడు. ఇతనిది కౌండిన్యస గోత్రము. హనుమంతుని జన్మదినమును హనుమజ్జయంతి పేరుతో, భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం అనాదినుండి వస్తోంది. ఆ రోజు తమ కోర్కెలు సఫలీకృతము కావలెనని హనుమంతుడికి తమలపాకులతో పూజలు చేస్తారు. హనుమంతుడికి తమలపాకులు చాలా ఇష్టము. నైవేద్యముగా అరటిపండ్లు సమర్పిస్తారు. సిందూరమును సమర్పిస్తారు. హనుమాన్ చాలీసా, హనుమాన్ దండకమును పారాయణము చేస్తారు. హనుమంతుడి జీవితములో ఆయన సాధించిన ఘనకార్యములు అద్భుతము. మహోన్నతము. ఆయన సాధించిన ఘన కార్యములను సంక్షిప్తంగా స్మరించుకుని తరిద్దాం.

## బాల్యము:

అంజనాదేవి ఒకసారి హనుమంతుడిని గుహలో ఉంచి పండ్లు తేవడానికి వనమునకు వెళ్ళింది. గుహలోనుండి బయటకు వచ్చిన హనుమంతుడు తూర్పుదిక్కున ఉదయిస్తున్న సూర్యబింబమును చూచాడు. ఆ సూర్యబింబమును ఫలము అనుకొని దానిని పట్టుకోవడానికి పైకి ఎగిరాడు. ఆ రోజు అమావాస్య. రాహువు సూర్యుడిని గ్రహించడానికి బయలుదేరాడు. దారికి అడ్డుగా వచ్చిన రాహువును దూరముగా నెట్టాడు హనుమంతుడు. దానితో రాహువు వెళ్ళి ఇంద్రుడి కాళ్ళ దగ్గర పడ్డాడు. ఇంద్రుడి హనుమంతుడి వైపుకు ఐరావతమును పంపించాడు. దానిని తెల్లని పండుగా భ్రమించి పట్టుకొనబోయాడు. ఇంద్రుడు ఆగ్రహముతో తన వజ్రాయుధమును హనుమంతుడి వైపుకు విసిరాడు. వజ్రాయుధము తగలగానే హనుమంతుడు క్రిందపడి మూర్ఛిల్లాడు. వజ్రాయుధపు తాకిడికి హనుమంతుడి ఎడమ హనుమ (దవడ)కు దెబ్బ తగిలింది. పుత్రుడికి దెబ్బ తగిలిందన్న బాధతో కొడుకును తీసుకుని వాయుదేవుడు గుహ లోనికి వెళ్ళాడు. త్రిలోకములందును వాయువును స్తంభింపచేశాడు.



వాయు స్తంభనతో దేవతలు దురపిల్లారు. దేవతలందరూ బ్రహ్మ దగ్గరకు వెళ్ళి వాయుదేవుడిని శాంతింపచేసి త్రిలోక వాసులను రక్షింపవలసినదని ప్రార్థించారు. దేవతల తరపున బ్రహ్మ వాయువు దగ్గరకు వెళ్ళి అతనితో మాట్లాడి శాంతింపచేశాడు. దేవతలందరినీ హనుమంతునకు వరములను ఇవ్వమని బ్రహ్మ ఆదేశించాడు. బ్రహ్మ ఆదేశానుసారం దేవతలు హనుమంతునకు వరములను ప్రసాదించారు. వాయుదేవుడు ప్రసన్నుడై వాయు ప్రసరణమును కొనసాగించాడు. హనుమకు దెబ్బ తగలడము చేత హనుమంతుడు అని పిలువబడతాడని ఇంద్రుడు వరమును ప్రసాదించాడు.

## హనుమంతునకు దేవతలు ఇచ్చిన వరములు :

సూర్యుడు తన తోడి తేజమును, వేద శాస్త్ర ప్రాప్తి, వరుణుడు తన పాశము వలన నీటి వలన పది లక్షల ఏండ్ల వరకు చావు నొందనట్లు, యముడు తన కాలదండము వలన మరణము నొందనట్లును, రోగములు లేకుండునట్లును, యుద్ధభూమిలో దుఃఖ విచారము లేకుండునట్లు, విశ్వకర్మ తనచే నిర్మితమైన అస్త్ర శస్త్రాదుల వలన చావు లేకుండుటయే కాక దీర్ఘాయువు కలుగునట్లు, బ్రహ్మ చిరాయువును, శత్రు భీప్రదత్వమును, మిత్ర ముదావహత్వమును, కామచరత్వము, కామరూపము, ఎదురు లేని బలము, శక్తి, రామ సేవను పొందునట్లు, మిగతా దేవతలు దీర్ఘాయువు, బల పరాక్రమములు, ఆరోగ్యము, అజేయత్వము, విద్య, బుద్ధి, తపస్సు, తేజస్సు, వాక్పటుత్వము, ప్రసన్నత, చతురత, ధైర్యము, విష్ణుభక్తి, దయామయత్వము, పర స్త్రీ విముఖత మున్నగు వరములను ప్రసాదించారు.

## విద్యాభ్యాసము:

ఉపనయన సంస్కారము ముగిసిన తర్వాత హనుమంతుడు సూర్యభగవానుడిని తనకు విద్యను ప్రసాదించవలసినదిగా ప్రార్థిస్తాడు. హనుమంతుడికి సమాధానమిస్తూ సూర్యభగవానుడు హనుమంతా నేను అహర్నిశము రథము మీద తిరుగుతూ ఉంటాను. నా రథ వేగము ప్రచండమైనది. రథము నుండి క్రిందికి దిగడము కూడా కష్టమే. నా గమన వేగము వలన త్రోవలో నీకు ఏకాగ్రత కుదరదు. నా వద్ద విద్యాభ్యాసమునకు అవకాశము లేదు అని పలుకుతాడు. హనుమంతుడు దేవా! మీ గమనమునకు ఎటువంటి ఆటంకము కలిగించను. రథ వేగమును బట్టి ముందు వెనుక పయనిస్తూ ఉంటాను అని పలికి సూర్యుని రథమునకు ఎదురుగా నిలబడి, వెనక్కి నడుచుకుంటూ ఇంద్ర వ్యాకరణము నేర్చుకున్నాడు. తరువాత ఒక పాదము ఉదయాద్రిపై, ఇంకొక పాదము పశ్చిమాద్రిపై నుంచి సూర్యునికి ఎదురుగా నిలబడి సాంగోపాంగముగా వేదములను అభ్యసించాడు. సర్వ విద్యా విశారదుడైనాడు. విద్యాభ్యాసానంతరము తల్లి కోరిక మేరకు కిష్కింధ నగరమునకు వెళ్ళి మేనమామలైన వాలి సుగ్రీవుల దగ్గర నివసించసాగాడు.కొన్ని కారణముల చేత వాలి సుగ్రీవుని రాజ్యమునుండి వెళ్ళగొట్టాడు. సుగ్రీవుడు ఋష్యమూక పర్వతం మీద నివసించసాగాడు. హనుమంతుడు సుగ్రీవుని వెంటనే ఉన్నాడు.

## శ్రీరామ హనుమంతుల సమావేశం:

రావణుడు సీతను అపహరించిన తరువాత రామలక్ష్మణులు సీతను అన్వేషిస్తూ ఋష్యమూక పర్వత ప్రాంతమునకు చేరుకుంటారు. వారి వివరములను తెలుసుకుని రమ్మని హనుమంతుడిని పంపిస్తారు. అప్పుడు హనుమంతుడు విప్రవేషధారియై అక్కడికి చేరుకుని వారితో సంభాషిస్తాడు. హనుమంతుడి భాషాశైలిని ప్రశంసిస్తూ శ్రీరాముడు లక్ష్మణునితో ఇలా అంటాడు. ఇతని మాటలలో ఒక అపశబ్దమైననూ కానరాదు. ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము అధ్యయనము చేయనివాడు ఈ విధముగా మాటలాడలేడు. ఇతడు వ్యాకరణమును చాలా చక్కగా అధ్యయనము చేసి యున్నాడు. అతని ముఖము నందు గాని, నేత్రముల యందు గాని, కనుబొమల యందు గాని, మరి యెక్కడా గాని ఎట్టి దోషము కానరాదు. అతని వాక్కు చాలా శ్రోత్ర మధురమై హృదయ హారిణియై ఒప్పుచున్నది. అతడు మధ్యమ స్వరమున చాలా శ్రోత్ర ప్రేయముగా మాటలాడుచున్నాడు. అట్టివాడు దూతగా సమస్త కార్యములు సిద్ధింప చేయగలడు. లక్ష్మణా! ఇతడిని గమనించితివా? ఇతని దేహములో, చెవులలో గుప్తముగా ఉన్న సువర్ణ కుండలములు, దేహానికున్న సువర్ణ కవచమును



గమనించుము అని పలికి శ్రీరాముడు ఆ విప్రుడిని వానరా! అని పిలిచాడు. ఆ సంబోధన వినగానే హనుమంతునకు బ్రహ్మ తనకు చెప్పిన వాక్యములు గుర్తుకు వచ్చాయి. ఆంజనేయా! ఈ నీ కవచ కుండలములను ఇతరులు చూడజాలరు. ఇవి ఎవనికి కనబడునో అతడే శ్రీమహావిష్ణువు అని తెలిసికొనుము. అతనినే నీవు ప్రభువుగా భావింపుము. ఆ మాటలు స్ఫురణకు రాగానే శ్రీరామునితో స్వామీ! నేను నీ దాసుడను. నీవే నా స్వామివి. నేను నీకు భృత్యుడను. నీ ఆజ్ఞానువర్తిని అని పలికి రామలక్ష్మణులను సుగ్రీవుడి దగ్గరికి తీసుకొని వెళ్తాడు. అగ్నిసాక్షిగా రామ సుగ్రీవులకు స్నేహబంధము కల్పిస్తాడు. స్నేహ ధర్మము ననుసరించి శ్రీరాముడు వాలిని సంహరించి, సుగ్రీవుడిని కిష్కింధకు రాజును చేస్తాడు. సుగ్రీవుడు సీతాన్వేషణకు నలు దిక్కులకు తన భటులను పంపిస్తాడు.

## సీతాన్వేషణ :

హనుమంతుడు జాంబవంతుడి ప్రేరణతో శరీరమును పెంచి, సముద్ర లంఘనమునకు ఉద్యుక్తుడవుతాడు. సముద్రమును దాటు తరుణమున నాగమాత సురస కల్పించిన అవరోధములను శక్తి యుక్తులతో దాటి ముందుకు సాగుతుండగా ఛాయాగ్రాహి యగు సింహిక యను రాక్షసి అడ్డు రాగా ఆమెను సంహరించి లంకాపురికి చేరుకొని, తనను ప్రతిఘటించిన రాక్షసిని పిడికిటితో కొట్టి, ఓడించి లంకా పట్టణము లోనికి ప్రవేశిస్తాడు. సీతను కనుగొని, లంకా దహనము గావించి, తిరిగి శ్రీరాముని దగ్గరికి వచ్చి సీతామాత జాడ గురించి తెలియజేస్తాడు. పిదప సేతు నిర్మాణము జరుగుతుంది. శ్రీరాముడు సైన్యముతో లంకలోకి ప్రవేశిస్తాడు. రామ రావణుల మధ్య యుద్ధము మొదలవుతుంది.

## ప్రాణదాత:

రామ రావణ యుద్ధములో వీరాధివీరులు అనేకమంది మరణిస్తారు. ఒకనాటి యుద్ధమున మేఘనాథుడి శక్తి బాణము

తగిలి లక్ష్మణుడు మూర్ఛిల్లుతాడు. హనుమంతుడు సుషేణుడి సలహాతో విశల్యకరణి మున్నగు ఓషధులు ఉన్న పర్వతమునే తెస్తాడు. సుషేణుడు ఆ ఓషధుల ద్వారా లక్ష్మణుడు మున్నగు వారందరినీ బ్రతికిస్తాడు.

## హనుమత్ప్రశంస:

శ్రీరాముడు పట్టాభిషేకానంతరము శ్రీరాముడు అగస్త్యుడు మున్నగు మహర్షులతో సంభాషిస్తూ హనుమంతుడిని ప్రశంసిస్తాడు.

**శ్లో ॥ శౌర్యం దాక్ష్యం బలం ధైర్యం ప్రాజ్ఞతా నయ సాధనమ్**
**విక్రమశ్చ ప్రభావశ్చ హనుమతి కృతాలయాః"**

శౌర్యము, దాక్షిణ్యము, బలము, ధైర్యము, ప్రాజ్ఞత, నీతి, విక్రమము, ప్రతాపము అనునవి హనుమంతుని యందు విశేషముగా గూడుకట్టుకొని యున్నాయి. సముద్రమును చూచి విచారపడుతున్న వానర సైన్యమును ఓదార్చి నూరు యోజనముల పరిమితి గల సముద్రమును దాటి, లంక యను దానిని అతిక్రమించి లంకా పట్టణము నందలి అంతఃపురములను వెదికి సీతాదేవిని జూచి ఆమెతో సంభాషించాడు. ఆమెను ఓదార్చాడు. పిమ్మట రావణుని పుత్రులు, మంత్రులు, కింకరులు మొదలగు వారినందరినీ వధించాడు. రాక్షసుల చేత బద్ధుడై రావణునితో సంభాషించి లంకా పట్టణమును భస్మము గావించాడు. హనుమంతుని బాహు బలము చేతనే లంకకు చేరుకున్నాను. సీతను పొందాను. లక్ష్మణుడిని బ్రతికించుకున్నాను. యుద్ధములో విజయుడైనాను. హనుమంతుడే లేకపోతే సీత జాడ నాకు ఎలా తెలిసేది? శ్రీరాముడి పలకులను ఆలకించిన అగస్త్యుడు హనుమంతుడి జీవిత చరిత్ర వివరించి, హనుమంతుడి గుణములను ప్రశంసిస్తూ ఇలా అంటాడు.

**శ్లో ॥ "పరాక్రమోత్సాహ మతి ప్రతాప,**
**సౌశాల్య మాధుర్య నయా నయైశ్చ**
**గాంభీర్య చాతుర్య సువీర్య ధైర్యే,**
**ర్హనూమతః కోప్యధికోఽస్తిలోకే"**

పరాక్రమము, ఉత్సాహము, బుద్ధి, ప్రతాపము, మంచి స్వభావము, మాటల తియ్యదనము, నీతి, వివేకము, గంభీరత, చతురత, దిట్టతనము మున్నగు గుణములలో హనుమంతుని కంటే మించినవాడు లోకమున నెవ్వడు గలడు? మరియు వేద వేదాంగములందును హనుమంతునకు తుల్యుడగు వాడు ఎవ్వడు గలడు?

## హనుమంతుని అభ్యర్థన :

పట్టాభిషేకానంతరము శ్రీరాముడు అందరికీ వీడ్కోలు పలుకుతున్న తరుణమున హనుమంతుడు ఇలా అభ్యర్థించాడు. శ్రీరామచంద్రా! నీ యందు నాకు అధికమైన ప్రీతి కలదు. ఎడతెగని భక్తియు గలదు. నా మనస్సు మరియొక స్థలమునందు ప్రవేశింపదు.

**శ్లో ॥ "యావద్రామ కథా వీర చరిష్యతి మహీతలే**
**తావచ్ఛరీరే వత్స్యంతి ప్రాణా మమ నసంశయాః"**

శ్రీరామచంద్రా! రామకథ భూలోకము నందు గలవరకును, నా శరీరమునందు ప్రాణములు నిలిచి యుండునటుల అనుగ్రహింపుము. హనుమంతుడి పలుకులను ఆలకించిన శ్రీరాముడు పరమానందముతో సింహాసనము నుండి లేచి, హనుమంతుని ఆలింగనము గావించుకుని ఈ విధముగా పలికాడు. హనుమంతా! నీ ఇష్టము నెరవేరుటకు ఏమియు సందేహము లేదు. సకల లోకములు ఎంతవరకు టాయో, అంతవరకు నా చరిత్రము లోకమునందు నిలిచి యుంటుంది. నా చరిత్రము ఎంతకాలముండునో, అంతవరకు నీ శరీరమునందు ప్రాణములు నిలిచి యుంటాయి.



హనుమంతుడు పరమగు శక్తికి, ఉత్తమమగు ప్రభుభక్తికి ప్రతీక. ఉత్తమ సేవకునిగా, రామదాసుగా, రామదూతగా, రామకింకరుడిగా, రామభక్తునిగా, రాజనీతిజ్ఞునిగా, రాయబారిగా, వీరునిగా, ఆపన్నివారకునిగా, యోగిగా, జీవన్ముక్త ప్రదర్శకునిగా, ఆజన్మ బ్రహ్మచారిగా, అభయప్రదాతగా, నవవ్యాకరణ వేత్తయైన వాచాధ్యక్షునిగా, ఈషణత్రయ దూరునిగా, జ్ఞానిగా, ఆచార్యునిగా, మహాత్మునిగా బహుముఖ వ్యక్తిత్వములను కలిగిన హనుమంతుడిని మనసా స్మరించుకుందాం.

**శ్లో ॥ "గోష్పదీకృత వారాశిం మశకీకృత రాక్షసమ్**
**రామాయణ మహామాలా రత్నం వందేఽనిలాత్మజమ్"**

సముద్రమును సులభముగా దాటినవాడు, దోమల వలె రాక్షసులను అవలీలగా చంపినవాడును, రామాయణము అను గొప్ప మాల యందు రత్నమైనవాడును అగు వాయు పుత్రునకు ప్రణామము.

# పరమాత్మని చేరుకునే మార్గాలు

– శ్రీమాన్ డా|| అద్దంకి శ్రీనివాస్

అనాదిగా లోకంలో భగవంతుడంటే ఎవరు? ఆయన్ని చేరుకునే మార్గాలు ఏవి? అని దార్శనికులైన ఋషులు ఎంతో అన్వేషించారు. అందరికీ యోగ్యమైన మార్గాలను తాము ఆచరించి లోకానికి అందించారు. వాటిలో ముఖ్యమైన మార్గాలు ఏవో తెలుసుకుందాం.



మనసు, మాట, శరీరం ఈ మూడింటినీ త్రికరణాలంటారు. వీటి ద్వారా ఏర్పడే భక్తి మూడు విధాలు.

**మానసిక భక్తి :** ఇది మానసికంగా భగవంతుడి ఎడల భక్తి ప్రపత్తుల్ని కలిగి ఉండే విధానం.

**వాచిక భక్తి :** వేదమంత్రాలతో దేవతల్ని పూజించటం.

**కాయిక భక్తి :** వ్రతాలు, ఉపవాసాలు, నియమాలు ఆచరించటం ద్వారా ఇంద్రియాల్ని అదుపులో ఉంచుకోవటం.

వీటికే మరో మూడు పేర్లున్నాయి. అవి 1. లౌకిక భక్తి. 2. వైదిక భక్తి. 3. ఆధ్యాత్మిక భక్తి.

పరబ్రహ్మ (పరమాత్మ) మీద అనగా పరబ్రహ్మ తత్త్వం మీద అంతులేని ప్రేమ కలిగి ఉండటమే భక్తి. అలాంటి భక్తి అమృతం లాంటిది. అనగా ఎప్పటికీ నశించనిది. మధురమైనది కూడా. ఇలాంటి పరమభక్తిని పొందిన మానవుడే సిద్ధుడవుతాడు. అంటే మోక్షాన్ని పొందుతాడు. జనన మరణ రహితుడై ఎంతో తృప్తిని పొందుతాడు. ఈ భక్తిని సంపూర్ణంగా పొందిన మనిషికి ఇక ఎలాంటి కోరికలూ ఉండవు. అతడికి ఎలాంటి దుఃఖమూ ఉండదు. ఏ ప్రాణినీ ద్వేషించడు. విషయ సుఖాల మీద ఎలాంటి వ్యామోహాన్ని పొందడు.

కేవలం పరమాత్మని (తన ఇష్టదైవం) తప్ప మరెవ్వరినీ ఆశ్రయించకుండా ఉండటాన్నే ''అనన్య భక్తి'' అంటారు.

సూ || పూజాది ష్వనురాగ ఇతి పారాశర్యః (16) కథాదిష్వితి గర్గః (17) ఆత్మరత్య విరోధేనేతి శాండిల్యః (18) నారదస్తు తదర్పితాఖిలాచారతా తద్విస్మరణే పరమ వాక్యులతేతి (19) అస్త్యేవమేవం (20) యథావ్రజ గోపీకానాం (21) (నా.భ సూత్రాలు)

భక్తి అంటే పూజ మొదలైన వాటిపై ఇష్టం ఉండటం. భగవంతుడి కథల పట్ల ఆసక్తి కలిగి ఉండటం. భగవంతుడికి సేవ చేయకపోతే ఉండలేకపోవడం. లోకంలో భక్తిస్థితి ఇలాగే ఉంటుంది. బృందావన ధామంలో ఉండే గోపికలకి, శ్రీకృష్ణుడి మీద ఇలాంటి అనన్య భక్తే ఉంది. అసలు నిజమైన భక్తి అంటే ఇదే.

ప్రేమ స్వరూపం. అది అనిర్వచనీయమైంది. ఒక మూగవాడు మధురమైన పదార్థాన్ని తిని, దాని మాధుర్యాన్ని అనుభవించగలడే కానీ, నోటితో చెప్పలేడు కదా! అలాగే ప్రేమతత్త్వం కూడా అనుభవించటమే కానీ, ఏ రకంగానూ వ్యక్తపరచలేరు. ఇలాంటి ప్రేమతత్త్వం వేలమందిలో ఏ ఒక్కడిలో మాత్రమే ప్రకాశిస్తుంది.

ఈ భక్తి సత్త్వ రజ స్తమో గుణాలకి అతీతంగా ఉంటుంది. ప్రతిక్షణం వృద్ధి చెందుతుంది. అవిచ్ఛిన్నంగా, సూక్ష్మతరంగా ఉంటుంది. కేవలం అనుభవంతో మాత్రమే ఎవరికి వారు దీన్ని తెలుసుకోగలరు. ఇలాంటి ప్రేమాత్మిక భక్తిని పొందినవాడు పరమాత్మని నిత్యం దర్శిస్తాడు. ఆయన గురించే వింటాడు. ఆయన గురించే మాట్లాడుతాడు. ఆయన గురించే నిరంతరం ఆలోచిస్తాడు.

ఇతరులని హింసించి, తనకు తానే గొప్ప ధర్మాత్ముడనని, భక్తుడనని, అహంకారంతో విర్రవీగే వాడు, ఇతరుల గొప్పతనాన్ని చూడలేనివాడు భక్తిని కలిగి ఉంటే అలాంటి వాణ్ణి తామస భక్తుడు అంటారు.

కొందరు పరమాత్మకి తనకి భేదం ఉందని, ఆయన, తాను వేరని భావిస్తూ సుఖభోగాలు, కీర్తి ప్రతిష్ఠలు పొందాలనే కోరికతో, విగ్రహరూపంలో ఉన్న పరమాత్మని ఆరాధిస్తుంటారు. ఇలాంటి వాళ్ళని రాజస భక్తులు అంటారు.

తన పాపాల్ని క్షయం చేసుకోవటం కోసం, తాను చేసే ప్రతి కర్మనీ పరమాత్మకే సమర్పించేవాడు, శాస్త్రం విధించిన కర్మలని నిష్కామంగా ఆచరించేవాడు సాత్త్విక భక్తుడు.

పరమాత్మ సంపూర్ణ అనుగ్రహాన్ని పొందాలనుకునేవాడు సాటి మనుషుల్లో, జంతువుల్లో, పరమాత్మని దర్శించి వాళ్ళని కూడా పరమాత్మ స్వరూపాల్లాగానే భావించి వారి మీద తన భక్తి ప్రపత్తులు చూపించాలి. ఆకలితో ఉన్న యాచకుణ్ణి తిరస్కరించి గుళ్ళో ఉన్న దేవుడికి నైవేద్యం పెడితే ఎలాంటి ఫలితం ఉండదని సాక్షాత్తు కపిల ముని అవతారం ధరించిన శ్రీమహావిష్ణువు ప్రబోధించాడు.

మానవులు ఏ మార్గాన్ని అనుసరించినా ఆ మార్గాలన్నీ మెల్ల మెల్లగా వారిని పరమేశ్వరుడివైపుకి నడిపించాలి.


భగవంతుణ్ణి పూజించడానికి రెండు విధానాలు ఉన్నాయి. 1. సగుణారాధన 2. నిర్గుణారాధన. ఈ రెండూ వేరు వేరుగా అన్పిస్తున్నా ఒకరకంగా చెప్పాలంటే ఈ రెండూ పరస్పరం పూరకాలే. ఏ మార్గాన్ననుసరించినా భగవంతుడిపై ఏకాగ్రత ముఖ్యం.

## నవవిధ భక్తి మార్గాలు

అలా పరమాత్మను చేరుకోవాలని సంకల్పించిన వారికి తొమ్మిది రకాలైన మార్గాలను భాగవతం చూపిస్తోంది.

**శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం, పాదసేవనమ్,**
**అర్చనం వందనం దాస్యం సఖ్యం ఆత్మనివేదనమ్.**

- **శ్రవణం :**
  పరమాత్మకి (తన ఇష్టదైవం) చెందిన విషయాలని ఎవరైనా ప్రవచనం చేస్తుంటే వినటం, అలాగే పరమాత్మ గుణగణాలని స్తుతిస్తూ ఎవరైనా మధురంగా గానం చేస్తుంటే, ఆ గీతాలని శ్రద్ధగా ఆలకించటం శ్రవణ భక్తి.
- **కీర్తనం :**
  భగవంతుడి లీలా విలాసాలని, గుణగణాలని శ్రవణపేయంగా భక్తిభావంతో కీర్తించటం అనగా పాడటం.
- **స్మరణం :**
  పరమాత్మ నామాన్ని, రూపాన్ని, గుణగణాల్ని, లీలావిలాసాల్ని గ్రంథాల ద్వారా, మహాత్ముల ప్రసంగాల ద్వారా తెలుసుకుని, వాటని పదే పదే స్మరించటం. దీన్నే స్మరణ భక్తి అంటారు.
- **పాదసేవనం :**
  పరమాత్మ దివ్య పాదలని త్రికరణ శుద్ధిగా భక్తిభావంతో అర్చించటం.
- **అర్చనం :**
  భగవంతుణ్ణి వివిధ రకాలుగా పూజించటం.
- **వందనం :**
  నమస్కారం చేయటం. ప్రతిరోజూ నియమంగా తన ఇష్టదైవానికి భక్తితో నమస్కారం చేయాలి. ఆలయాలలోనైతే స్వామి ముందర సాష్టాంగ నమస్కారం చేసి ''అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ'' – స్వామీ నేను ఎవర్నీ శరణు వేడుకోలేను. నాకు నువ్వే శరణం అని వేడుకోవాలి. దీన్నే నమస్కార భక్తి అంటారు.
- **దాస్యం :**
  పరమాత్మకి దాసుడుగా సేవకుడుగా మారి పోవటం.



రామాయణంలో శ్రీరాముడికి హనుమంతుడు సేవ చేసినట్లుగా, తాను పూజించే ఇష్టదైవాన్ని ప్రతి ఒక్కరిలో చూస్తూ, వారికి తాను చేయదగిన సేవల్ని ఆ పరమాత్మకే చేస్తున్నానని భావిస్తూ చేయాలి.

- **సఖ్యం :**
  పరమాత్మతో సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉండటమే సఖ్యభక్తి.
- **ఆత్మనివేదనం :**
  ఇది తొమ్మిది రకాల భక్తిమార్గాలలో ఎంతో గొప్పది. తనను తాను పరమాత్మ సేవకి అర్పించుకోవటం. నాది ఏదీ లేదు. అంతా నీవే. అన్నీ నీవే. నీవు తప్ప మరేదీ ఈ లోకంలో లేదు అనే అనన్య భావన కలిగి ఉండటం ఆత్మ నివేదన. పరమాత్మ అనుగ్రహాన్ని పొందాలనుకునేవాళ్ళు ఈ తొమ్మిది రకాల భక్తి మార్గాల్లో దేన్నైనా అనుసరించవచ్చు.

**మన్మనాభవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు,**
**మామే వైష్యసి యుక్త్వైనమ్ ఆత్మానం మత్పరాయణః**
(భగవద్గీత 9-34)


అర్జునా! నువ్వు కూడా నా మీదే మనస్సుని లగ్నం చెయ్యి. నా భక్తుడివికా. నన్నే పూజించు. నాకు నమస్కరించు. ఈ విధంగా నీ ఆత్మని నాలోనే ఉంచి మత్పరాయణుడివైతేనే నన్ను చేరుకుంటావు (మోక్షాన్ని పొందగలవు).

దివ్యమైన నా చతుర్భుజ రూపాన్ని ప్రత్యక్షంగా చూడటానికి, తత్త్వజ్ఞానాన్ని పొందటానికి, వాటితో ఏకీభావ స్థితిని పొందటానికి కేవలం అనన్యభక్తి మాత్రమే సాధనం. తాను చేసే కర్తవ్య కర్మల్ని అన్నిటినీ నాకే సమర్పించినవాడు, మత్పరాయణుడు. నా మీద భక్తి ప్రపత్తులు కలిగినవాడు, ప్రాపంచిక విషయాల మీద ఏమాత్రం ఆసక్తి లేనివాడు, ఏ ప్రాణి మీదా వైరభావం లేనివాడు అయిన అనన్య భక్తుడు మాత్రమే నన్ను పొందగలడు (11-55). పరమాత్మనైన నామీదే ఏకాగ్రచిత్తంతో ఉంటూ, నా భజన, ధ్యానాలలో నిమగ్నులైనవారు, గొప్ప శ్రద్ధాభక్తులతో సగుణ రూపంలో (సాకారంగా) నన్ను ఆరాధించేవారు నిజమైన భక్తులు. ఈ భక్తులే శ్రేష్ఠమైన యోగులు (12-2).

పరమాత్మ మీద ఏకాగ్రమైన మనస్సు నిలిపి, ప్రసన్నుడైన యోగి, దేనికోసమూ బాధపడడు. దేన్నీ కావాలని కోరుకోడు. సమస్త ప్రాణుల్నీ సమభావంతో చూస్తాడు. అలాంటి యోగి మాత్రమే నా పరాభక్తిని పొందుతాడు.

నాకు ఇష్టం కలిగే పుణ్యకర్మల్ని ఆచరిస్తూ ఉండే వాడికన్నా మించిన భక్తుడు ఎవరూ ఉండరు. అనన్య భక్తితో నన్ను సేవించేవాడి కన్నా ప్రియమైనవాడు, నాకు భూమండలంలో ఎవడూ లేడు. భవిష్యత్తులో ఉండబోడు అని శ్రీకృష్ణుడి హితబోధ.



**గత సంచిక తరువాయి**

మహాభారతంలోని అరణ్యపర్వంలో, అగస్త్యుడు చేసిన మరొక పని గురించి ఉంది. యమునాతీరంలోఅగస్త్యుడు ఊర్ధ్వబాహుడై తలపై రెండు చేతులు దోసిలి ఆకారంలో నిలువుగా ఉంచుకుని తపస్సు చేసుకుంటున్నాడు. ఆ సమయంలో గంధర్వరాజైన కుబేరుడు, తన మిత్రుడైన మణిమంతుడనే వాడితో కలిసి ఆకాశమార్గాన విమానంలో వెళుతున్న సమయంలో, మణిమంతుడు తాంబూలాన్ని ఉమ్మివేశాడు. అది అగస్త్యుడి మీద పడింది. అగస్త్యుడు ఆగ్రహంతో కుబేరుడిని పిలిచి, ''నీ మిత్రుడైన మణిమంతుడు గంధర్వుడననే గర్వంతో ముందూ వెనకూ చూడకుండా ఉమ్మి వేస్తే అది నాపై పడింది. ఒక మామూలు మానవుడి చేతిలో వాడు చచ్చిపోతాడు. వాడికదే శిక్ష'' అని శపించాడు. ఆయన శాపం అమోఘం. సృష్టిలో త్రిమూర్తులు కూడా ఏమీ చెయ్యలేరు.

మహాభారతకాలంలో, పాండవులు అరణ్యవాసం చేస్తున్న కాలంలో భీముడు, ద్రౌపది అరణ్యంలో తిరుగుతూ ఉంటే, ఆకాశం నుంచి ఒక సువాసనాభరితమైన పువ్వు పడింది వీళ్ళమీద. ఆ పుష్పం పేరు సౌగంధికము. చాలా విశేషమైన పరిమళం కలిగి ఉందది. చాలా చిత్ర విచిత్రంగా ఉంది. ద్రౌపదీదేవి భీముడితో, ''ఈ పుష్పం చిత్రంగా ఉంది. ఇలాంటిది మనం ఎక్కడా చూడలేదు. ఈ చెట్టు ఎక్కడ ఉంటుందో!'' అన్నది. ''నేను వెళ్ళి తెస్తాను'' అని భీముడు బయలుదేరాడు.

హిమవత్పర్వతాలలో చాలా ఉన్నతమైన

ప్రదేశంలో గంధర్వులు పరిపాలించే దేశం అది. అక్కడ ఒక సరస్సు ఉంది. దానిచుట్టూ అనేకమైన పుష్పాలు అలాంటివే ఉన్నాయి. చుట్టూ గంధర్వులు కాపలా కాస్తున్నారు. ఈ ప్రదేశం అంతా కుబేరుడిది అన్నారు భీముడితో అక్కడ ఉన్నవాళ్ళు. అక్కడ మణిమంతుడు కాపలాగా ఉన్నాడు. ఆ పుష్పం కోసం ఇద్దరికీ యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో భీముడి చేతిలో మణిమంతుడు చచ్చిపోయాడు. అగస్త్యుడి యొక్క శాపశక్తి అట్లాంటిది.

మహాభారతం శాంతిపర్వంలో, ఒక గీతను ఉపదేశం చేశాడు అగస్త్యుడు. అది ''అగస్త్యగీత'' అని జగత్ప్రసిద్ధమయింది. అయితే ఒకప్పుడు – నేటికీ దాదాపు రెండు వందల సంవత్సరాలకు పూర్వం – దానిని ''అగస్త్యగీత'' అనే పేరుతో పారాయణం చేసి, దానిని ప్రవచనం చేసేవాళ్ళు. అయితే ఆంధ్ర మహాభారతంలో, కేవలం అగస్త్యుడు ''అగస్త్యగీత''ను బోధించాడు అనే ఉంది కాని గీత అంతా లేదు. తరువాత వచ్చిన ప్రతుల్లో ఎక్కడా లేదు కాని, సంస్కృత గ్రంథమూలంలో ఉంది. పూనాలోని భండార్కర్ ఇనిస్టిట్యూట్ వాళ్ళు ప్రచురించిన సంస్కృతాంగ్ల మహాభారత గ్రంథంలో అగస్త్యగీత ఉంది. ప్రత్యేకంగా తెలుగులో తర్జుమా చేయకపోవడం చేత అగస్త్యగీత మరుగున పడిపోయింది. దాన్ని సంక్షిప్తం చేయటం మొదలుపెట్టారు.

శ్రీరాముడు, మహావిష్ణువు, వామనుడు – ఇట్లాంటి అవతారములను ఏ విధంగా పూజ చెయ్యాలో, ఎలాగ ఆరాధన చెయ్యాలో ఆ నామావళితో సహా పూజా విధానాన్ని లోకానికి ఇచ్చినవాడు అగస్త్యుడు. అగస్త్యకృత స్తోత్రం అని చెప్పి అనేకచోట్ల ఉంటూ ఉంటుంది. అగస్త్యుడే పూజా పద్ధతులను గురించి చెప్పాడు. ఆయన పేరు ప్రతిచోటా ఉంటుంది. అవతార పూజావిధానాలు అనేకములను ఒకచోట కూర్చి ''అగస్త్య సంహిత'' అని పండితులు పేరు పెట్టారు.

అగస్త్యుడు గొప్ప శివాద్వైతి. ''శివోహం'' అని అనుభవంలో తెలుసుకుని అతడు చెప్పినమాట, వరాహపురాణంలో తెలుగుపద్యంలో ఎక్కడో ఒకచోట ఉన్నది. శివుడు సాక్షాత్తు ఆయనకు చెప్పిన మాటలు.

**"శివుడే దాత శివుండె భోక్త శివుడే చేయున్ మఖాది క్రియల్**
**శివుడే విశ్వము నే శివుండ.........."**

అన్నాడు. యజ్ఞములన్నీ ఈశ్వరుడే చేస్తాడు.

అగస్త్యుడు తీర్థయాత్రలు చేస్తూ, అనేక నదులలో స్నానాలు చేస్తూ, ఆయా క్షేత్రాలన్నీ దర్శనం చేస్తుంటే, ఒకచోట ఆయన భార్య, ''ఏమండీ! ఇలా తీర్థాలన్నీ సేవిస్తూ ఉన్నాం. దీనివలన మనకు ముక్తి లభిస్తుందా!'' అని అడిగిందట.

లోపాముద్రాదేవికి కూడా ముక్తిని గురించిన భయం ఉంది. అంటే, మనుష్య జన్మకు ఆ భయం ఎప్పుడూ ఉండాలి అని దాని సిద్ధాంతం. ''నాకేమీ ఫరవాలేదు, నా తపస్సయిపోయింది. ఇప్పుడు నేను ఊరికే అన్ని పనులు చేయటానికి ఉన్నాను. లోకోద్ధరణ కోసం చేస్తున్నాను. నా తపస్సు ఎప్పుడో అయిపోయింది'' అనలేదు ఆయన. అట్లాంటి మూర్ఖపు మాటలు బుద్ధి ఉన్నవారు ఎవరూ అనరు. ఎవరు జ్ఞాని అంటే, ''అయ్యా! నాకు దేహమున్నది. ఇంకా భయంగానే ఉన్నది'' అన్నవాడు. దీనిని బట్టి, జీవన్ముక్తుడు కూడా ఆ భయంతో ఉండటమే ధర్మమని ఆయన బోధగా అర్థమవుతోంది.

**"తీర్థములు మానససములు ముక్తిప్రదములు**
**బాహ్యతీర్థావళులు ముక్తిఫలమునీవు"**

మానస తీర్థములే ముక్తిహేతువులు. బాహ్య తీర్థముల కంటే ఇవి మేలు. సత్యము, ఇంద్రియ నిగ్రహము, అనసూయ, దానము, దయ, సంతోషము, బ్రహ్మచర్యము, ధైర్యము, యమము, సమత్వము, విజ్ఞానము వీటన్నిటినీ మానస తీర్థములు అంటారు. వీటిని పాటించకుండా, కేవల బాహ్య తీర్థముల వలన ప్రయోజనం లేదు. అంటే మానసిక తీర్థములు అలవరచుకొంటేనే గాని బాహ్య తీర్థముల వలన ప్రయోజనము ఉండదు. ఎవరు ఏమి ఇచ్చినా తీసుకొనక పోవటము, అహంకారం లేకపోవటం, కోపం చంపుకోవటం, ఆలస్యం చేయకపోవటం, సత్యనిష్ఠ మొదలైనవన్నీ సత్ఫలితాలనిస్తాయి. ఎన్ని తీర్థములైనా కాశీ ప్రాప్తినే ఇస్తాయి. కాశీ తీర్థంలో స్నానం చేయనివాడు లక్ష తీర్థాలను దర్శించినా మోక్షం రాదు. ఈ ధర్మాలన్నీ చెప్పబడ్డాయి.

రాముడికి ఆదిత్య కవచము, ఆదిత్య హృదయము ఇచ్చాడు ఆయన. ఆదిత్య స్తోత్రం చేశాడు. ఇవన్నీ ఎందుకు చేశాడు? ఆయనకవసరమై కాదు. మనకు ప్రసాదించాలి. మనకు ఒక మార్గం చూపించాలి కదా అని ఈ స్తోత్రాలు. ఇవన్నీ కష్టకాలంలో చదువుకోమని మనకు మహర్షులు ఇచ్చారు.

సాక్షాత్తూ శ్రీరాముడే ఆగమన్నా మబ్బు ఆగదు. అది ప్రకృతి. రావణుడితో యుద్ధానికి పోవటానికి ముందు సముద్రాన్ని దాటవలసి వచ్చినప్పుడు, ఆయనకు సముద్రుడు ప్రసన్నం కాకపోతే, బాణం తీసి సంధించి, ''నీమీద ప్రయోగిస్తాను'' అన్నాడు సముద్రుడితో రాముడు. ''సముద్రమంతా ఇంకించి వేస్తాను'' అన్నాడు ఆగ్రహంలో.

అప్పుడు సముద్రుడు ప్రత్యక్షంగా వచ్చి రాముడికి ధర్మబోధ చేస్తాడు. ''రామా! నీవేనా ఇలా ధర్మాన్ని వదిలిపెట్టేది? ఇక సృష్టిలో ధర్మం అనేది ఎక్కడ ఉంటుంది? నీకు అజ్ఞానం ఆవరించటం ఏమిటి?'' అని రాముణ్ణి అంత మాట అన్నాడు సముద్రుడు ప్రకృతి ధర్మం తప్పించబోయినందుకు. ''నీ శక్తి సామర్థ్యాలు నాకు తెలియక కాదు, సముద్రాన్ని ఇంకించగలవు. నీకు అంత శక్తి ఉంది. అయితే ప్రకృతి ధర్మం అనేది ఒకటి ఉంది.

సముద్రం అలలతో నిరంతరం భయంకరంగా గంభీరంగా ఇలా ఉండటం, అందులో ఎంత బరువైన వస్తువైనా మునిగిపోవటము, ఎంత పెద్ద వస్తువైనా సముద్రగర్భంలో దాగిపోవటం ప్రకృతి ధర్మం. ఈ ప్రకృతిని శాసించేది కేవలం ఈశ్వరుడు మాత్రమే. మరి నీవు ఈశ్వరాంశ సంభూతుడివి. అట్టి నీవే ప్రకృతి ధర్మాన్ని మరిచిపోయి, నీ భార్యాన్వేషణలో నీ మనస్సు చాలా క్లేశం పొంది ఉండటం చేత, సముద్రాన్ని దాటి వెళ్ళటం కోసమని సముద్రాన్ని ఇంకింప చేస్తాననటం ఎంత అధర్మం? ఈ విషయాన్ని నీవు మరచిపోయినావా?'' అన్నాడు సముద్రుడు రాముడితో.

తనకు జ్ఞానబోధ చేసినందుకు రాముడు సముద్రుణ్ణి స్తోత్రం చేశాడు. తన కర్తవ్యం ఏమిటి అని సముద్రుడిని అడిగాడు. అప్పుడు సముద్రుడు ''ఓ రామా! ఈశ్వరుడిని తలచుకుని ప్రకృతిని ప్రార్థించు. వినయంతో ప్రార్థించాలి. ఓ వరుణ దేవుడా! ఓ సముద్రదేవతా! ఓ జలాధి దేవతలార! నేను ఈ కార్యార్థినై వెళుతున్నాను. దయచేసి నాకు మార్గాన్ని చూపించండి. వంతెన నిర్మించటం కోసం నేను రాళ్ళు వేస్తాను. సముద్రంపైన వాటిని తేల్చి పట్టుకో నువ్వు. దానిపై నుంచి నా సైన్యం వెళుతుంది'' అని అడగమని ప్రబోధం చేసినట్లు ఉంది. ఒక రామాయణ గ్రంథంలో ఈ మాటలు కూడా ఒకరు వ్రాశారు.

సముద్రుని, అంటే ప్రకృతిని ఎవరూ శాసించలేరు. ఒకవేళ ప్రార్థిస్తే ప్రసన్నం కావచ్చు. ప్రార్థిస్తే ప్రసన్నమయ్యే లక్షణం ప్రకృతిలో ఉండబట్టే, 'శన్నోవాతః..' అంటూ ప్రార్థన వచ్చింది. మనం ప్రార్థిస్తే అది ప్రసన్నమవుతుంది. ఇవాళ పుట్టి రేపొద్దున్న వెళ్ళిపోయే మనిషి ఎవడికీ కూడా, ఈ ప్రకృతి మీద అధికారం లేదు. ఈ ప్రపంచంలో మనం ఉండేది కేవలం అతి స్వల్పకాలం. ఒకరకంగా చెప్పాలంటే, మనకు దానిమీద ఈనాడు అధికారం అంతకుముందు ఏమయింది? స్వతంత్రంగా ఉందా? మనం వచ్చాకే అది మనకు లొంగిందా? అజ్ఞానం వల్ల అలా మనుష్యుల్లో కొందరికి అహంకారం వస్తుంది. ఎప్పుడూ అలా రాకూడదు.

అగస్త్యుడు ఇచ్చినటువంటి ఆదిత్య కవచము ఈ ప్రకారంగా ఉంది.

## ఆదిత్య కవచము

**జపాకుసుమ సంకాశం ద్విభుజం పద్మహస్తకం ।**
**సిందూరాంబర మాల్యంచ రక్తగంధానులేపనం ।**
**మాణిక్యరత్నఖచిత సర్వాభరణ భూషితం ।**
**సప్తాశ్వ రథావాహంతు మేరుంచైవ ప్రదక్షిణం ।**
**దేవాసురవరైర్వంద్యం ఘృణిభిః పరిసేవితం ।**
**ధ్యాయేత్పఠేత్సువర్ణాభం సూర్యస్య కవచం ముదా ।**
**ఘృణిః పాతు శిరోదేశే సూర్యః పాతు లలాటకం ।**
**ఆదిత్యో లోచనే పాతు శృతీ పాతు దివాకరః ।**
**ఘ్రాణం పాతు సదా భానుర్ముఖం పాతు సదా రవిః ।**
**జిహ్వాం పాతు జగన్నేత్రః కంఠే పాతు విభావసుః ।**
**స్కంధౌగ్రహపతిః పాతు భుజౌ పాతు ప్రభాకరః ।**
**కరావబ్జకరః పాతు హృదయం పాతు నభోమణిః ।**
**ద్వాదశాత్మ కటిం పాతు సవితా పాతు సక్థినీ ।**
**ఊరూ పాతు సురశ్రేష్ఠో జానునీ పాతు భాస్కరః ।**
**జంఘే మే పాతు మార్తాండో గుల్ఫౌ పాతు త్విషాంపతిః ।**
**పాదౌ దినమణిః పాతు పాతు మిత్రోఖిలం వపుః ।**
**ఆదిత్యకవచం పుణ్యమభేద్యం వజ్రసన్నిభం ।**
**సర్వరోగ భయాదిభ్యో ముచ్యతే నాత్ర సంశయః ।**
**సంవత్సరముపాసిత్వా సామ్రాజ్యపదవీం లభేత్ ॥**
**ధ్యానమ్ – అనేక రత్న సంయుక్తం స్వర్ణమాణిక్యభూషణం ।**
**కల్పవృక్ష సమాకీర్ణం కదంబకుసుమప్రియం ॥**
**అశేష రోగశాంతర్థ్యం ధ్యాయే దాదిత్యమండలం ।**
**తప్తకాంచనసంకాశం సహస్రకిరణావృతమ్ ॥**
**సిందూరవర్ణాయ సుమండలాయ**
**సువర్ణ రత్నాభరణాయ తుభ్యం ।**
**పద్మాదినేత్రేచ సుపంకజాయ**
**బ్రహ్మేంద్ర నారాయణ శంకరాయ ॥**
**సంరక్తచూర్ణం ససువర్ణతోయం**
**సకుంకుమాభం సుకుశం సపుష్పం ।**
**ప్రదత్తమాదాయచ హేమపాత్రే**
**ప్రశస్తనాదం భగవంతమీడే ॥**

''అనేక రూపములు, అనేక రూపములతో ఉండేటటువంటి సూర్యుడు అనేక అంగములను, నన్ను రక్షించు గాక'' అనే అర్థం వచ్చే ప్రార్థన ఇది.

అలా ఆదిత్య కవచం గురించి చెబుతూ, ఒక సంవత్సరం పాటు పారాయణం చేస్తే సామ్రాజ్య పదవి వస్తుందని ఫలశ్రుతి చెప్పారు. అలాంటిదేదయినా ఆశపెడితేనే ప్రజలు చేస్తారు.

అదీ ఆయన ప్రసాదించిన ఆదిత్య కవచం. శరీరాన్ని రక్షించే అంగములన్నీ దేవతల రక్షణ పొందటాన్ని 'కవచం' అని అంటారు. మనోబలం, ఆత్మబలం అని మనం అంటూ ఉండే ధైర్య స్థైర్యాలను ఈ కవచం ఇస్తుంది. శరీరంలో రోగబాధలు వచ్చినప్పుడు ఆదిత్య కవచం చదువుకోవాలి. దేవతలందరికీ కూడా స్తోత్రం ఉంటుంది. తరువాత కవచం, తరువాత హృదయం, తరువాత మంత్రము ఉంటాయి. అవి అన్నీ ఆయా ప్రయోజనాల కోసం ఏర్పడ్డాయి. అందుకనే, శరీరబాధలు వచ్చినపుడు కవచం, దర్శనసిద్ధి కోసం మంత్రం చదువుకోవాలి.

నక్షత్ర రూపంలో ఉన్న అగస్త్య మహర్షిని భాద్రపద మాసంలో దర్శించుకోవాలని చెప్పారు. భాద్రపదమాసం అంటే సుమారు సెప్టెంబర్. ఆ కాలంలో రాత్రి సమయంలో సూర్యుడు

కన్యారాశిలో ఉండటం చేత, కన్య అస్తమించిన తరువాత ఉదయించేటటువంటి ధనూరాశి, పైకి వెళ్ళినప్పుడు అగస్త్య మహర్షి దర్శనం సరిగ్గా ధనూరాశి పక్కనే అవుతోంది. అలా పురాణం చెబుతుంది. అంటే మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ నక్షత్రాలకు ప్రక్కనే అర్థరాత్రి సమయంలో మిణుకు మిణుకు మంటూ కొంచెం దూరంగా ఉంటుంది. Ecliptic (భచక్రం – అంటే సూర్యుడు ప్రయాణించే మార్గం) అనే పథముంది కదా. దానికి దక్షిణభాగంలో, ధనూరాశికి ప్రక్కన అర్థరాత్రి సమయంలో బాగా చీకటి ఉన్నప్పుడు మాత్రమే అగస్త్య నక్షత్రం భాద్రపద మాసంలో కనబడుతుంది. ఎందుకంటే, పాతాళంలో సూర్యుడుండాలి. ధనుస్సు పైన ఉండాలి. ఆ చివరన, పీలికల వలె ఉన్న నక్షత్రాలుగా అగస్త్యమహర్షి దర్శనం అవుతుంది. భాద్రపద మాసంలోనే కనబడుతుంది. అప్పుడు చూసిన తరువాత దానికి నమస్కరించి, నదీస్నానం చేసి అర్ఘ్యములు ఇవ్వాలి.

'ధర్మసింధు'లో, ధర్మశాస్త్ర గ్రంథాలలో అగస్త్యుడికి అర్ఘ్యప్రదానం చేసే విషయం చెప్పారు. మహర్షులు దేవతలకంటే శాశ్వతులు. స్వర్గంలోని దేవతలు వస్తూ పోతూ ఉంటారు. కాని అగస్త్యుడు మాత్రం శాశ్వతుడు. ఆయన అనేకమంది ఇంద్రులను చూచారు. ఎప్పుడూ ఉండే ఆయనను దర్శించటం చేత సమస్తమైన ఈతిబాధలూ తొలగుటే కాక జ్ఞానోదయ మవుతుంది అని చెప్తారు.

అగస్త్య మహర్షి దర్శనం చేసిన తరువాత అగస్త్య ప్రతిమ ఒకటి చిన్నగా చేసి, దానికి పూజ చేసి దాన్ని బ్రాహ్మణులకు దానమిస్తారు. సప్తర్షిపూజ అనేది ఒకటుంది. 'ఋషి పంచమి' నాడు ఋషిపంచమి అనే వ్రతం చేస్తారు. భాద్రపద మాసంలో ఈ శ్లోకాలతో ఆయనకు నమస్కరిస్తారు.

**కాశపుష్ప ప్రతీకాశ వహ్నిమారుత సంభవ ।**
**మిత్రావరుణయోఃపుత్ర కుంభయోనే నమోస్తుతే ॥**
**వింధ్యవృద్ధిక్షయకర మేఘతోయవిషాపహా ।**
**రత్నవల్లభదేవేశ లంకావాస నమోస్తుతే ॥**
**వాతాపిర్భక్షితోయేన సముద్ర శోషితః పురా ।**
**లోపాముద్రాపతిశ్శ్రీమాన్ యో సః తస్మై నమో నమః ॥**
**యేనోదితేన పాపాని విలయం యాంతి వ్యాధయః ।**
**తస్మై నమోస్త్వగస్త్యాయ సశిష్యాయచ పుత్రిణే ॥**

మనసులో అగస్త్యుడిని ధ్యానించి పై శ్లోకాలు చదివి అర్ఘ్యం విడవాలి. మనుష్యులు చేసిన పాపం చేత, విషవృష్టి కురిస్తే దాన్నుంచి లోకాన్ని ఆయన ఆనాడు కాపాడాడు.

రామాయణ కాలం తరువాత ఆయన మళ్ళీ ఉత్తరదేశం వెళ్ళలేదు. నిష్కంటకమై విభీషణుడిచేత పరిపాలించబడేటటువంటి రావణుని యొక్క లంకలోనే ఆశ్రమం ఏర్పాటు చేసుకున్నాడు. తరువాత ఎక్కడున్నాడో భారతంలో




చెప్పబడలేదు. స్తోత్రంలో మాత్రం, 'లంకావాస నమోస్తుతే' అని ఉంది.

భార్యలకు అనేకమంది అనేక స్థానాలిచ్చారు. ఒకరు హృదయమిచ్చారు. మరొకరు శరీరాన్నే ఇచ్చారు. కావేరీనదిని కమండలంలో పెట్టుకుని తిరిగాడాయన. అగస్త్యుని పేరు మీద దక్షిణాన చాలా క్షేత్రాలున్నాయి.

లోపాముద్రాదేవిని కూడా ఈ శ్లోకంలో స్మరించుకుంటూ –

**రాజపుత్రి మహాభాగే ఋషిపత్ని వరాననే ।**
**లోపాముద్రే నమస్తుభ్యమర్ఘ్యం మే ప్రతిగృహ్యతాం ॥**

అని అర్ఘ్యం విడవాలి.

**అగస్త్యాయ నమస్తేస్తు అగస్త్యేస్మిన్ ఘటేస్థితః ।**
**అగస్త్యో ద్విజరూపేణ ప్రతిగృహ్ణాతు సత్కృతః ॥**
**అగస్త్య స్సప్తజన్మాఘం నాశయిత్వా వయోరయం ।**
**అపత్యం విమలం సౌఖ్యం ప్రయచ్ఛతు మహామునిః ॥**

సంస్కృత వాచస్పత్యంలో ఈ శ్లోకం ఉంది. ఈ స్తోత్రం చేస్తూ ఆయనకు నమస్కరిస్తారు. పురాణాల్లో అగస్త్య స్తోత్రం చేసిన అనేక వ్రతాలున్నాయి. ఇతర ఋషుల వలె కాక ఆయన దేవతల కంటె ఎక్కువగా పూజింపబడ్డారు. ఎవరయితే ఇలా లోపాముద్రా సహిత అగస్త్యుడికి నమస్కరిస్తారో, వాళ్ళకు భుక్తిని, ముక్తిని కూడా వారు ఇవ్వగలరని ఒక మాట చెప్పారు. ఇంద్రద్యుమ్నుడికి ముక్తిమార్గాన్ని చూపించినవాడు ఆయనే కదా! అలా మార్గదర్శకుడుగా ఆయన ఉన్నాడని చెప్పి ఆ మహాత్ముడిని పురాణాలలో కీర్తించారు.

**'అగస్త్యాయ నమో నమః'**

**-శివానంద సువిధ ఫౌండేషన్ సౌజన్యంతో**

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

## 408. ధానా భక్షణ సంప్రీతాయ నమః

- సుదాముడు (కుచేలుడు) ఇచ్చిన అటుకులు భక్షించుటచే సంతృప్తి నొందినవాడు – కృష్ణుడు.

ధానా భక్షణ సంప్రీతుడైన కృష్ణునికి అభేద రూపము కలిగిన వేంకటేశునకు నమస్కారము.

## 409. కుచేలాభీష్ట దాయకాయ నమః

- బాల్యమిత్రుడు కుచేలుడు ఇచ్చిన అటుకులు తిని కుచేలుని కోరికలు సంపూర్ణముగా నెరవేర్చినవాడు – కృష్ణుడు.

కుచేలుడు (సుదాముడు) కృష్ణుని సాందీపని గురుకుల వాసములో మిత్రుడు. కుచేలుడు అధిక సంతానముతో దారిద్ర్య జీవితం గడుపుచున్నాడు. కృష్ణుడు ద్వారకాధిపతి యైనాడు.

ఒకనాడు భార్య ప్రోత్సహించగా సుదాముడు ద్వారకా నగరానికి వచ్చి కృష్ణుని దర్శించినాడు. కుచేలుడు వస్తూ కొద్ది అటుకులను మూట కట్టుకుని వచ్చి కృష్ణునికి కానుకగా ఇచ్చినాడు. బాల్యమిత్రుని స్థాయి తెలిసిన కృష్ణుడు ఆ అటుకులను తిని ప్రీతిగా కుచేలునకు అష్టైశ్వర్యములను ఇచ్చినాడు. కుచేలునితో కృష్ణుడు కొంతకాలము గడిపినాడు. కుచేలుడు మిత్రునికి వీడ్కోలు చెప్పి తన ఊరికి వెళ్ళుచూ కృష్ణుడు తనకు ఏ విధమైన సహాయము చేయలేదని తలంచినాడు. కాని కుచేలుడు ఇంటికి చేరి చూడగా అతని ఇల్లు అందాల భవనంగా మారి, తన పిల్లలు సుఖసంతోషాలతో గడుపుచున్నారు. కుచేలుడు కూడా కృష్ణుని సహాయము కోరలేదు. ఇట్లుండగా కుచేలుని అవసరమును, అభీష్టమును తెలుసుకుని కృష్ణుడే స్వయముగా కుచేలునికి చేయదగిన సహాయము చేసినాడు. ఇదీ మంచి మిత్రధర్మము.

కుచేలాభీష్టదాయకుడైన కృష్ణునితో అభేదము గల్గిన కలియుగ దైవం వేంకటేశునకు నమస్కారము.

## 410. సత్త్వాది గుణ గంభీరాయ నమః

- సత్త్వాది గుణములు కలిగి సాధారణ వ్యక్తులు ఎరుగలేని హృదయము గల గంభీరుడు – కృష్ణుడు.

సత్త్వ, రజస్సు, తమో గుణములలో సత్త్వ గుణ సంపన్నుడై, గంభీరమైన హృదయము కలిగిన కృష్ణుని అవతారమే అయిన వేంకటేశునకు నమస్కారము.


## 411. ద్రౌపదీ మాన రక్షకాయ నమః

- కౌరవ సభలో ద్రౌపదికి జరిగిన అవమాన సంఘటనలో, అనంత వస్త్రము లొసంగి ఆమె మాన సంరక్షణ చేసిన పురుషోత్తముడు – కృష్ణుడు.

ద్రౌపదికి తల్లి తండ్రులు పెట్టిన పేరు కృష్ణ. ద్రుపదుని కుమార్తె కావున ద్రౌపది అనియు, ఈమె యజ్ఞ కుండమున జన్మించుటచే యాజ్ఞసేని అనియు, పాంచాలుని కుమార్తె కావున పాంచాలి అను పేర్లు కలవు. ద్రుపదుడు పాంచాల దేశపు రాజు. ద్రౌపది పాండవుల పత్ని. ధర్మరాజు మాయా జూదంలో ద్రౌపదిని ఒడ్డి ఓడిపోయాడు. అపుడు దుశ్శాసనుడు ద్రౌపదిని సభలో వివస్త్రను చేయబోగా కృష్ణుడు ఆమెకు అనంత వస్త్రములను ఇచ్చి ద్రౌపది మానమును సంరక్షించినాడు.

పాండవులు అరణ్యవాస కాలములో వారు గంగానదికి సమీపములో నివసించుచున్నారు.

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

ఒకనాడు దూర్వాస మహర్షి తన శిష్యులతో దుర్యోధనుని కోరిక మేరకు అపరాహ్ణమున పాండవుల వద్దకు వచ్చాడు. ధర్మరాజు వారికి అతిథి మర్యాదలు చేసి, భుజించుటకు ముందుగా గంగా స్నానము చేసి రండు అని చెప్పగా దూర్వాసుడు శిష్యులతో స్నానము చేయుటకై గంగానదికి వెళ్ళినాడు.

ఆ సమయమునకు ద్రౌపది కూడా భుజించినది. ఆమెకు సూర్యుడు ప్రసాదించిన అక్షయ పాత్ర ఆ రోజుకు ద్రౌపది భోజనానంతరం ఆహారమివ్వదు. ద్రౌపది రాగల విపత్తును ఊహించి, దూర్వాసుడు శిష్యులతో స్నానం చేసి భోజనార్థము ఆశ్రమమునకు వచ్చినచో వారందరికీ ఆహారము పెట్టకపోతే దూర్వాసుడు కోపించి శపిస్తాడు – అందుకు ద్రౌపది కృష్ణుని ప్రార్థించింది. కృష్ణుడు ప్రత్యక్షమై అక్షయపాత్రలో అంచున అంటుకొని ఉన్న మెతుకును తిని సంతృప్తుడైనాడు. దానితో దూర్వాసునికి, శిష్యులకు విందు భోజనము చేసినట్లు కడుపు నిండిపోయింది. అప్పుడు దూర్వాసుడు పాండవుల ఆశ్రమమునకు వెళ్ళి ఆతిథ్యము స్వీకరించుటకు వీలు లేనందున అక్కడ నుండియే మరో చోటికి వెళ్ళినాడు. ఇట్లు కృష్ణుడు దూర్వాసుని శాపము నుండి ద్రౌపదిని, పాండవులను రక్షించినాడు.

ద్రౌపదీ మాన సంరక్షకుడైన కృష్ణుని అవతారమే అయిన వేంకటేశునకు నమస్కారము.

## 412. భీష్మ ధ్యేయాయ నమః

- భీష్మాచార్యుల ధ్యానమునకు విషయమైన వాడు కృష్ణుడు.

ధర్మారాజు చేసిన రాజసూయ యాగమున భీష్ముడు కృష్ణునికి అగ్రపూజ చేయమని ధర్మరాజుకు సలహా ఇచ్చినాడు.భారత యుద్ధానంతరము భీష్ముడు అంపశయ్యపై నుండగా కృష్ణ పాండవులు భీష్ముని వద్దకు వచ్చినారు. అప్పుడు భీష్ముడు కృష్ణుని ప్రభావమును బాగుగా తెలిసినవాడు కనుక నిరంతరము తన హృదయము నందే అంతర్యామిగా నివసించి యుండెడి దేవునకు మాయా మానుష విగ్రహుడైన కృష్ణుడు ప్రత్యక్షముగా సుఖాశీనుడై తన చెంత నుండగా కృష్ణునికి భీష్ముడు మానస పూజ చేసినాడు. కృష్ణుడు సమదృష్టి గలవాడే అయినను తన అనన్య భక్తుల యెడ మిక్కిలి కృపను కలిగి యుండును. ఆ కారణముగనే నేను ప్రాణత్యాగము చేయు సమయమున పురుషోత్తముడైన కృష్ణుడు స్వయముగా వచ్చి తన దర్శనమును నాకు అనుగ్రహించినాడు. నేను ఈ పరమాత్ముని – కృష్ణుని – యొక్క ప్రసన్నమైన, దరహాస శోభితమగు అరుణ నేత్రములతో ఒప్పారుచున్న ముఖారవిందమును, చతుర్భుజ మూర్తిని దర్శించుచు ప్రాణములను విడిచెదను అని భీష్ముడు ధర్మజునకు చెప్పినాడు.

భీష్ముడు ఉత్తరాయణ పుణ్యకాలము రాగా పరమ భక్తితో కృష్ణుని ఇట్లు స్తుతించినాడు.

నేను నా బుద్ధిని మృత్యు సమయమున యదువంశ శిరోమణి, అనంతుడు అయిన కృష్ణుని చరణ కమలములందే సమర్పించుచున్నాను. సుందరమైన ఈ పరమ పురుషుని మూర్తి యందు ఎట్టి ఫలాభిసంధి లేని నిర్హేతుకమైన అనింద్యమైన భక్తి కుదురుకొని యుండు గాక! యుద్ధ సమయమున పార్థసారథియైన కృష్ణ భగవానుని యందు నా శరీరమును, అంతఃకరణమును, ఆత్మను సమర్పించుచు శరణు వేడుచున్నాను. యుద్ధ రంగమునకు అర్జునునకు గీతోపదేశము ద్వారా ఆత్మవిద్యను బోధించిన కృష్ణుని పాదపద్మములందు నాకు ప్రీతి కల్గుగాక! యుద్ధమున ఆయుధము పూననని ప్రతిన చేసిన కృష్ణుని చేత ఆయుధమును పట్టించిన నన్ను అనుగ్రహించిన భక్తవత్సలుడే నాకు ఆశ్రయుడగును గాక! పరమాత్మ నా ఎదుట ఉండగానే నేను ప్రాణములను విడుచుచున్నాను అని.

భీష్మ ధ్యేయముడైన కృష్ణుని అవతారమే అయిన వేంకటేశునకు నమస్కారము.




**గత సంచిక తరువాయి**

రాముడు మహారథుడు. పరమ ధార్మికుడు. ఇక్ష్వాకు వంశ సంజాతుడు. మహా సమర్థుడు. జన రంజకుడు. యుద్ధంలో దేవతలు సహితం రాముని ముందు శక్తి హీనులే. ప్రహస్తా! రామబాణాలు తీక్షణాలు. వాటిని నిరోధించలేం. అవి నిన్ను తాకి – నీ శరీరాన్ని చీల్చేదాకా నిన్ను నీవు పొగుడుకో. మా అన్న రావణుడు ఉగ్ర స్వభావుడు. స్త్రీ వ్యసనపరుడు. రాక్షసులందరూ నాశనమయ్యే పనికి పురికొల్పుతున్నారు మీరు. మీరు మంత్రులే కాదు. మిత్రుల్లా నడిచే శత్రువులు. మన రాజు ఆలోచించకుండా పని చేశాడు. అలాంటి వాడిని సన్మార్గంలో నడిపించాలి. మీరేం చెప్పినా ఏది చేసినా అనుసరిస్తున్నాడతడు.

రాముడంటే ఎవరనుకున్నావు? వెయ్యి తలల మహాసర్పం. అది అతి భయంకరమైంది. బలంగా రావణుణ్ణి చుట్టేసుకుంది. ఆ పాము నుంచి రక్షించాలి రావణుణ్ణి. భూతానికి చిక్కినవాణ్ణి రక్షించినట్లు రావణుని రక్షించాలి. జుట్టుపట్టి ఈడ్చి రావణుని అవమానించకముందే మీరంతా ఒక్కటి కావాలి. రావణుని రక్షించాలి. రామపత్నిని రామునికి ఇప్పించండి. అది సముచితం. అలా చేస్తే మనకు, మన నగరానికి, మన ప్రజలకి, మంత్రి మండలికి శ్రేయస్కరం. బాగా ఆలోచించండి. సీతాదేవిని రామునికి అప్పగించండి. బలాబలాలు పరీక్షించండి. శత్రువు స్థాయి – వృద్ధి క్షయాలు పరిశీలించండి. మన రాజుకి హితం చేకూర్చండి. అది మంత్రుల కర్తవ్యం.

మహారథి అంటే తనని, సారథిని, రథాశ్వాల్ని రక్షించుకుంటూ పదివేల మందిని ఎదుర్కొని జయించే సమర్థుడు.

సప్తవ్యసనాలు – 1. స్త్రీ 2. జూదం 3. మద్యపానం 4. వేట 5. పరుషంగా మాట్లాడటం 6. వృథాగా ధనాన్ని ఖర్చు పెట్టడం 7. కఠినంగా దండించడం.

## ఇంద్రజిత్తు – విభీషణుడు

బుద్ధికి బృహస్పతి లాంటివాడు విభీషణుడు. అతని మాటలు విన్నాడు ఇంద్రజిత్తు. అతడు రాక్షస యోధుల్లో ప్రముఖుడు. మహా ధైర్యవంతుడు. చూశాడు రావణుణ్ణి. ‘‘నాన్నా! విన్నావా? నీ తమ్ముడు విభీషణుడి మాటలు. పిరికివాడు. పనికిమాలిన మాటలు చెప్పాడు. ధైర్యం, సాహసం, అభిమానం, రోషం లేని వాడు నీ తమ్ముడు. ఇతడొక్కడే మన పౌలస్త్య వంశంలో పుట్టాడు. ఇంకెవరూ ఇలా మాట్లాడరు అన్నాడు. విభీషణుణ్ణి చూశాడు. అంటున్నాడు.

మానవ మాత్రులు రాజకుమారులు. రాక్షసుడవై వాళ్ళని



పొగుడుతావెందుకు? మనలో ఒక సామాన్య సైనికుడు వాళ్ళని చంపేస్తాడు. పిరికివాడా! నీవు భయపడ్డావు సరే. మమ్మల్ని భయపెడతావా? త్రిలోకనాథుడు దేవేంద్రుడు. అతణ్ణి లాక్కొచ్చాను. ఇక్కడ చెరసాలలో బంధించాను. వికృతంగా అరిచింది ఐరావతం. దాని రెండు దంతాలు ఊడబెరికాను. ఆ ఏనుగును పట్టాను. భూతలానికి విసిరివేశాను. అది చూశారు దేవతలు. భయపడ్డారు. పారిపోయారు. ఆ దేవతల దర్పాన్ని అణచాను. దైత్యవీరుల్ని దుఃఖాల పాలు చేశాను. మానవ మాత్రులైన రామ లక్ష్మణుల్ని జయించలేనా నేను?

విన్నాడు విభీషణుడు. అతడు దేవేంద్ర తుల్యుడు. దురాసదుడు. మహాతేజోవంతుడు. ధనుర్ధారుల్లో శ్రేష్ఠుడు. అంటున్నాడు. నాయనా ఇంద్రజిత్తూ! నీవు ఇంకా బాలుడవు. రాజకార్యాల్లో అవగాహన తక్కువ. నీ బుద్ధి ఇంకా పరిణతి చెందలేదు. నీ మాటలు అర్థరహితాలు. ఆత్మ వినాశన హేతువులు. అజ్ఞానంలో ఉన్నావు. భ్రమలో ఉన్నావు. రావణునికి జయం కాదు. నాశనాన్ని నీవే కోరుతున్నావు. నీవు పుత్రరూపంలోని శత్రువు. పిల్లవాడివి. సాహసివి. దుర్మతివి. మూఢుడవు. వినయహీనుడవు. అల్పబుద్ధివి. గర్విష్ఠివి. దురాత్ముడవు. బాల్య చాపల్యంతో మాట్లాడుతున్నావు. నీవు వధార్హుడవు. ఈ మంత్రాంగానికి నిన్ను పిలిచినవాడిని చంపాలి. రాముని బాణాలు యమ దండాలు. బ్రహ్మ దండాలు. ప్రజ్వలిస్తూ మృత్యురూపంలో వస్తాయి. ఎవ్వరు వాటిని ఓర్వగలరు? అని – మళ్ళీ రావణునితో చెబుతున్నాడు. రాజా! మనం సీతాదేవిని రామ సన్నిధికి పంపాలి. ధనం, రత్నాలు, ఆభరణాలు, దివ్యమైన వస్త్రాలు, చిత్రమైన మణులు సమర్పించాలి. అపుడే మనం నిర్భయంగా ఉంటాం. సుఖంగా ఉంటాం.

## లంకా పరిత్యాగం

విభీషణుడు హితం పలికాడు. విన్నాడు రావణుడు. అతనికి మృత్యువు ఆసన్నమైంది. ఆ ప్రేరణతో పరుషంగా అంటున్నాడు.

విభీషణా! భయంకర విష సర్పాలతో నివసించవచ్చు. శత్రువులతో స్నేహం చేయవచ్చు. కాని స్నేహితునిలా ఉంటూ శత్రు పక్షపాత బుద్ధితో ఉండరాదు. అలాంటి వాడితో నివసించరాదు. దాయాదుల స్వభావం తెల్సు నాకు. వాళ్ళకి కష్టం వస్తే జ్ఞాతులు సంతోషిస్తారు. తమకంటే ఉన్నతస్థాయికి చేరినవాణ్ణి, కార్యసాధకుణ్ణి, విద్వాంసుణ్ణి, ధార్మికుణ్ణి, శూరుణ్ణి అవమానిస్తారు. తిరస్కరిస్తారు. పైకి ఒకరకంగా లోపల మరోరకంగా ప్రవర్తిస్తారు. కష్టకాలాల్లో చేయూత నివ్వరు. ద్రోహం చేస్తారు. జ్ఞాతులు సహజ శత్రువులు. అలాంటి శత్రువుల కన్నా, పాములకన్నా ప్రమాదకరులు – భయంకరులు వారు.

విభీషణా! పద్మవనంలో ఏనుగులుంటాయి. వేటగాళ్ళు వెళ్తారు. వాటిని బంధించాలనుకుంటారు. వాళ్ళని చూసి ఏనుగులు కొన్ని శ్లోకాలు చెప్పాయి. అవి విను. బాధించే అగ్నికి కాని, చంపే శస్త్రాలకి కాని, హింసించే పాశాలకి కాని భయపడ పనిలేదు. స్వార్థపరులుగా, నిర్దయులుగా ఉండే జ్ఞాతుల్ని చూసి భయపడాలి. మనల్ని బాధించే ఉపాయాలు వాళ్ళే చెబుతారు. లోకంలో అన్నింటి కన్నా జ్ఞాతి భయం అత్యంత ప్రమాదకరం. ఆవుల్లో సంపద ఉంది. ఇంద్రియ నిగ్రహం బ్రాహ్మణుల్లో ఉంది. చాపల్యం స్త్రీలలో ఉంది. అపకారం అంతా జ్ఞాతుల్లో ఉంది అని ఏనుగులన్నాయి.

విభీషణా! నిన్ను సౌమ్యుడనుకున్నాను. నన్ను అందరూ పూజిస్తుంటారు. సమస్త ఐశ్వర్యాలు ఉన్నాయి నాకు. అది నీకు ఇష్టం లేదు. తామరాకు మీద నీటి చుక్కలు పడతాయి. ఆ బిందువులు ఒకదానితో ఒకటి కలవవు. అలా ఎంత స్నేహం చేసినా జ్ఞాతి దుష్టుడే. అయిన వాళ్ళతో కలిసి ఉండడు. పూలనుంచి తేనెలు తాగుతాయి తుమ్మెదలు. తర్వాత పూల దగ్గరికి పోవు. అలా నా నుంచి సమస్త సౌఖ్యాలు అనుభవించావు. ఇపుడు తుమ్మెదలా ప్రవర్తిస్తున్నావు.

ఏనుగు స్నానం చేస్తుంది. తర్వాత తొండంతో ఒళ్ళంతా దుమ్ము చేసుకుంటుంది. దుష్టుడు ముందుగా స్నేహం చేస్తాడు. ఆ స్నేహాన్ని వాడే పాడు చేసుకుంటాడు. శరత్కాలంలో మేఘాలు ఉరుముతాయి. చినుకులు పడతాయి. నేల మీద తేమ ఉండదు. దుష్టుడు ఉపకారం చేసేట్లు గర్జిస్తాడు. కాని ఉపకారం చేయడు. నిశాచరా! నీవు నాకు తమ్ముడవు కాబట్టి సరిపోయింది. మరొకరు ఇలా మాట్లాడి ఉంటే వాడి ప్రాణాలు ఎగిరిపోయేవి. కుల పాంసుడవు నీవు. తమ్ముడవైనందుకు బతికిపోయావు.

అలా తమ్ముణ్ణి తూలనాడాడు రావణుడు. రావణుడు అంటే

ఇతరుల్ని హింసించేవాడు. ఏడిపించేవాడు అన్నారు పెద్దలు. అలాంటివాడు అన్న అయినా మేలు కోరాడు విభీషణుడు. మంచి చెప్పాడు. పోగాలం దాపురించినవాడు వినడు. అదే స్థితి రావణునిది. ఇక అన్న వద్ద ఉండరాదు – అది విభీషణుని నిశ్చయం.

న్యాయవాది విభీషణుడు గద చేత పట్టాడు. ఆకాశం లోకి ఎగిరాడు. నలుగురు సచివులు అతణ్ణి అనుసరించారు. ఆకాశ మధ్యంలో నిలిచాడు. అంటున్నాడు. రాజా! నీవు ఇంకా ఏం చెబుతావో చెప్పెయ్. నీకు ఎదురు చెప్పను. నీవు నాకు జ్యేష్ఠుడవు. తండ్రితో సమానుడవు. మాన్యుడవు. కాని నీవు ధర్మమార్గం తప్పావు. నీవు అనార్యుడవు. కుల పాంసనుడవు. నీవు అన్నీ అబద్ధాలే చెప్పావు. నీ మాటలను మన్నించలేను. అయినా నీమీద నాకు ప్రేమ ఉంది. అది తగ్గలేదు. దశాననా! మృత్యు వశంగతులు హితవచనాలు వినరు.

**సులభాః పురుష రాజన్ సతతం ప్రియవాదినః ।**

**అప్రియస్య తు పథ్యస్య వక్తా శ్రోతాచ దుర్లభః ॥**

రాజా! మనసుకి నచ్చేట్లు చెప్పేవారు, వినేవారు కోకొల్లలుగా ఉంటారు. వాళ్ళు ఎక్కడైనా దొరుకుతారు. అప్రియమైనా మంచి చెప్పేవారు, వినేవారు దొరకటం దుర్లభం. కాల పాశ బద్ధుడవు నీవు. నాశనమైపోతావని బాధ. తగలబడిపోయే ఇంట్లో ఉన్నట్లున్నావు. మృత్యుముఖంలో ఉన్నావు. (పై శ్లోకం మారీచుడు చెబుతాడు రావణునికి).

రామబాణాలు సువర్ణ భూషితాలు. అగ్ని జ్వాలల్లా ప్రజ్వరిల్లుతూ ఉంటాయి. ఆ బాణాలకి భస్మమైపోతుంటే నిన్ను చూడలేను. అందుకే మంచి చెప్పాను. శూరులు, బలశాలురు, అస్త్రవిద్యా నిపుణులు కూడా మృత్యువు ఆసన్నమైతే తప్పించుకోలేరు. ఇసుకలో కట్టిన ఆనకట్టల్లా నశిస్తారు. పెద్దవాడివని నీ మీద గౌరవంతో చెప్పాను. నన్ను క్షమించు. అధర్మం నుంచి నిన్నెంతో నివారించాలనుకున్నాను. నా మాటలు నీకు నచ్చలేదు. చచ్చిపోయేవాళ్ళు హితులు చెప్పే మాటలు వినరు.

**ఆత్మానం సర్వథా రక్షపురీం చేమాం న రాక్షసామ్**

నిన్ను నీవు రక్షించుకో. రాక్షసుల్ని కాపాడుకో. లంకాపురిని కాపాడుకో.

**స్వస్తి తేస్తు గమిష్యామి సుఖీభవ మయా వినా**

నేను వెళ్ళిపోతున్నాను. నీకు మేలు కలుగుగాక. నేను ఉండను కనుక ఇక నీవు సుఖంగా ఉండు.

కాలం దాపురించిన వాళ్ళు మంచివాళ్ళు చెప్పే మాటలు వినరు. ఆయువు తీరినవారు గ్రహించరు. నా మాటలు నీకు నచ్చలేదు. నీకు మృత్యువు సమీపిస్తోంది – అవి విభీషణుని పలుకులు.

సంస్కృతంలో ఒక శ్లోకం ఉంది. దాని భావం ఇది – వంద విధాలు చెప్పినా, ప్రయత్నించినా దుష్టుని మార్చలేం. అదెలా అంటే – కస్తూరితో ఎంత రుద్దినా వెల్లుల్లికి – దాని వాసన పోదు. కస్తూరి పరిమళం రాదు. చేరి మూర్ఖుని రంజింపలేమని నీతి పద్య పాదం.

## విభీషణుని రాక

సముద్ర ఉత్తర తీరం చేరాడు విభీషణుడు. ఆకాశం లోనే నిలిచాడు. సుగ్రీవాదుల్ని చూశాడు. గట్టిగా అంటున్నాడు.

**రావణో నామ దుర్ వృత్తో రాక్షసో రాక్షసేశ్వరః ।**

**తస్యాహమ్ అనుజో భ్రాతా విభీషణ ఇతి శ్రుతః ॥**

రాక్షస రాజు రావణుడు. వాడు దురాచారుడు. నేను వాడి తమ్ముణ్ణి. నా పేరు విభీషణుడు. ఆ రావణుడు సీతాదేవిని బలవంతాన ఎత్తుకు వచ్చాడు. అడ్డుపడ్డ జటాయువుని చంపాడు. ఆ సాధ్విని, ఆ దీనురాలిని రాక్షస స్త్రీల రక్షణలో ఉంచాడు. అలా ఆమెను నిర్బంధించకు. రామునికి ఇచ్చేయమన్నాను. ఎన్నో కారణాలు చెప్పాను. ఎన్నో విధాల చెప్పాను. నానా విధాల బతిమలాడాను. చావు మూడిన వాడికి మందులు పని చేయవు. నా మాటలు వాడికి నచ్చలేదు. నన్ను నానా మాటలన్నాడు. నన్నొక బానిసలా చూశాడు. నలుగురిలో అవమానించాడు.

**త్యక్త్వా పుత్రాంశ్చ దారాశ్చ రాఘవం శరణం గతః**

నా భార్యా బిడ్డల్ని విడిచి వచ్చాను. రాముణ్ణి శరణు వేడాలని వచ్చాను. సర్వలోక శరణ్యుడైన ఆ మహాత్ముణ్ణి శరణు వేడాలని వచ్చాను. రాఘవునికి నా మనవి నివేదించండి.

విన్నాడు సుగ్రీవుడు. గబ గబా నడిచాడు. రాముణ్ణి చేరాడు. అంటున్నాడు. రావణుని తమ్ముడు విభీషణుడు. తన సహచరులు నలుగురితో వచ్చాడు. నిన్ను శరణు వేడుతున్నాడు. ఆకాశ మధ్యంలో ఉన్నాడు. పరంతపా! అతడు శరణార్థి కావచ్చు. శత్రుపక్షం లోనివాడు. నీవు కార్యా కార్య నిపుణుడవు. వ్యూహ రచనా కోవిదుడవు. రాజనీతి విశారదుడవు. గూఢచర్యా కుశలుడవు. సదా జాగరూకుడవు. సావధానుడవై ఆలోచించు. రాక్షసులు కామరూపులు. మహా మాయావులు. శూరులు. కపటోపాయ నిపుణులు. వాళ్ళని నమ్మరాదు. అతడు రావణుని గూఢచారియై ఉంటాడు. అదే నిజమైతే మనలో చేరాక – కలిసి మెలిసి తిరుగుతాడు. మన రహస్యాలు తెలుసుకుంటాడు. అదను చూస్తాడు. దెబ్బ తీస్తాడు. అందుకే వచ్చాడనిపిస్తోంది.

ప్రభూ! మిత్రుల్ని, అడవిజాతి వారిని, పరంపరగా వచ్చే సైనికుల్ని, జీతాలు తీసుకునేవారిని మనం చేర్చుకోవచ్చు. కాని శత్రుపక్షం లోనివాణ్ణి మనం దరి చేరనీయరాదు. రావణుడు నీకు శత్రువు. ఇతడు వాడికి స్వయానా తమ్ముడు. ఇతణ్ణి మనమెలా నమ్మాలి. రామా! నీవు క్షమావంతుల్లో శ్రేష్ఠుడవు. అందుకే



చెబుతున్నాను. వీడు వేగులవాడు. వీణ్ణి బంధించాలి. చంపాలి. ఇది నా అభిప్రాయం.

అంతేకాదు రామా! వీడు శరణార్థి ముసుగు వేశాడు. నిన్ను నమ్మిస్తాడు. మన లోటు పాట్లు చూస్తాడు. దెబ్బ తీస్తాడు. గుడ్లగూబ కాకుల్ని చంపినట్లు మనల్ని హతమారుస్తాడు. వీడు క్రూరుడు. రావణుని తమ్ముడు. వీణ్ణి, వీడి అనుచరుల్ని చంపాలి. అదే మన కర్తవ్యం.

విన్నాడు రాముడు. హనుమంతుడు, తక్కిన వానర ప్రముఖుల్ని చూశాడు. అంటున్నాడు. సుగ్రీవుని మాటలు విన్నారు. ఇది కార్య సంకట స్థితి. బుద్ధిమంతుడు, సత్పురుషుడు, సమర్థుడు, శ్రేయస్కాముడు సుగ్రీవుడు చెప్పాడు. మీరు మౌనంగా ఉండరాదు. మీ అభిప్రాయాలు చెప్పండి.

## అభిప్రాయ సేకరణ

విన్నారు అందరూ. ముల్లోకాల్లో నీకు తెలియంది లేదు. మాపై గౌరవం చూపుతున్నావు. నీ ఆత్మీయతని పెంచుతున్నావు. నీవు సత్యవ్రతుడవు. ధార్మికుడవు. సర్వజ్ఞుడవు. పరాక్రమశాలివి. ప్రతి కార్యాన్ని నిశితంగా ఆలోచిస్తావు. అమలు పరుస్తావు. అయినా మమ్మల్ని అడిగావు. సంతోషం. బుద్ధిమంతులు ఒక్కొక్కరే తమ అభిప్రాయాలు చెప్పాలి – అన్నారు వానర వృద్ధులు. మొదట్లో అంగదుడు లేచాడు.

అంగదుడు – ఈ విభీషణుడు శత్రువు. వీణ్ణి అన్ని రకాలా అనుమానించాలి. ఎంతమాత్రం నమ్మరాదు. కపట చిత్తులు తమ మనసులోని మాట బయట పెట్టరు. కలిసి మెలిసి ఉంటారు. మనల్ని దెబ్బ తీస్తారు. గుణవంతులు కాదా విశ్లేషించాలి. గుణాలు ఎక్కువ ఉంటే గ్రహించాలి. గుణహీనుడైతే దోషాలుంటే వదిలివేయాలి. మంచి గుణాలుంటే చేర్చుకుంటాం. లేదంటే వదిలేద్దాం. ముందుగా చేర్చుకుందాం. తర్వాత పరీక్షిద్దాం.

శరభుడు – వీణ్ణి చేర్చుకుందాం. పరీక్షిద్దాం. అంతకంటే మరో ఉపాయం ఉంది. ఒక గూఢచారిని పంపుదాం. వాడు సూక్ష్మబుద్ధితో పరీక్షిస్తాడు. మనలో చేర్చుకోవడమా వద్దా అని నిర్ణయిద్దాం.

జాంబవంతుడు – విచక్షణా జ్ఞాని. వృద్ధుడు. శాస్త్ర దృష్టితో ఆలోచిస్తాడు. రామా! వీడు మనకి బద్ధవైరి. రావణుణ్ణి వదిలి వచ్చాడు. ఎందుకు వచ్చాడో కారణం చెప్పలేదు. అన్నగారు నిందించాడట. వదిలి వచ్చాడట. అది అంత గొప్ప కారణంగా లేదు. ఆపత్కాలంలో అన్నని విడిచి రావడం నమ్మశక్యంగా లేదు. ఇది రాకూడని సమయం. రాకూడని చోటు. వీణ్ణి నమ్మవద్దు. మనలో చేర్చుకోవద్దు.

మైందుడు – మనం గూఢచారిని పంపుదాం. మాటల్లో ఏమార్చుతాడు. వాడి అభిప్రాయం తెలుస్తుంది. దుష్టుడో కాడో తేలుతుంది. అప్పుడు నిర్ణయిద్దాం.

హనుమంతుడు – రామా! నీవు సర్వజ్ఞుడవు. నీకు చెప్పేటంతటి వాణ్ణి కాను. అయినా నాకు తోచింది చెబుతాను. అంగదాదులు సూచనలు చేశారు. అవి సరికావు. మనం గూఢచారుల్ని పంపక్కర్లేదు. రావణుడు నీచుడు. అతణ్ణి విడిచాడు విభీషణుడు. రావణుని దుర్మార్గం ఇతనికి తెలుసు. నీ పరాక్రమ వైభవం తెలుసు. రావణుని దోషాలు చూశాడు. నీ గుణాలు విన్నాడు. వీడు నీ కడకు వచ్చాడు. ఇది వీడి బుద్ధి కుశలతకి నిదర్శనం.

గూఢచారుల్ని పంపితే – వాడి ప్రశ్నలకు సత్పురుషుల మనస్సులు చివుక్కుమంటాయి. అది పొసగదు. మనకు సాయపడాలని వచ్చాడు. అతణ్ణి దూరం చేసుకున్నట్లు అవుతుంది. అన్నదమ్ములకి భేదాభిప్రాయాలు వచ్చాయి. పోట్లాడుకున్నారు. ఇతడు తనంతట తానే వచ్చాడు. అలాంటివాణ్ణి ఏవేవో ప్రశ్నలు వేయటం తెలివి తక్కువ. మిత్రలాభం చెడిపోవచ్చు. నీతిశాస్త్రం చెప్పింది అదే. మనం మనసు విప్పి మాట్లాడుతాం. ఎదుటివారు అలాగే మాట్లాడుతారు. ఇంగిత జ్ఞానం, ఆకారం, చేష్టలు, భాష – ఈ నాల్గు గమనించాలి. ఎదుటి వారి మనశ్శుద్ధి తెలుసుకోవచ్చు. నాకు చూడగా విభీషణునిలో దుష్ట భావం కనిపించలేదు. వీడి ముఖంలో ఏ వికారాలు లేవు. ముఖం ప్రసన్నంగా ఉంది. అంటే అది వీడి ఆకారం శుద్ధం. మోసగాడైతే ఇంత దూరం రాడు. నిర్భయంగా మాట్లాడడు. వీడి చేష్టల్లో ఏ లోపమూ లేదు. సందిగ్ధం లేదు. వీడి భాషలో శుద్ధి ఉంది. లోపం లేదు. కుటిలుడైతే దాచినా దాగదు మనసు. అది బయట పడుతుంది.

నీవు వాలిని చంపావు. సుగ్రీవుణ్ణి వానర రాజుని చేశావు. అది విని ఉంటాడు. ఇపుడు వీడు రాజ్యం కావాలని వచ్చాడు. అందుకే శరణాగతి చేశాడు. నాకు తెలిసినంతలో వీడు నిర్దోషి. ఇక మిగిలింది నీ నిశ్చయం – అని చెప్పాడు హనుమంతుడు.

**(సశేషం)**



# జయదేవుని గీత గోవిందము

– డా॥ మారేపల్లి భువనేశ్వరి, 9550241921

గత సంచిక తరువాయి

## అష్టపది - 1

॥ ప్రబంధః - 1 ॥

(దశావతారకీర్తి ధవళమ్) - (మాళవ రాగం – రూపక తాళం)

దశావతార వర్ణనం - మాలవగౌడ రాగేణ రూపక తాళేన గీయతే।

ప్రళయ పయోధిజలే ధృతవా నసి వేదం
విహిత వహిత్ర చరిత్రమఖేదం ।
కేశవ! ధృత మీనశరీర! జయ జగదీశ! హరే! ॥ (ధ్రువమ్)
క్షితిరతివిపులతరే తవ తిష్ఠతి పృష్ఠే
ధరణీ ధరణ కిణ చక్ర గరిష్ఠే ।
కేశవ! ధృత కచ్ఛపరూప! జయ జగదీశ! హరే! ॥
వసతి దశన శిఖరే ధరణీ తవ లగ్నా
శశిని కళంక కలేవ నిమగ్నా ।
కేశవ! ధృత సూకరరూప! జయ జగదీశ! హరే! ॥
తవ కరకమల వరే నఖమద్భుత శృంగం
దళిత హిరణ్యకశిపు తను భృంగం ।
కేశవ! ధృత నరహరిరూప! జయ జగదీశ! హరే! ॥
ఛలయసి విక్రమణే బలిమద్భుత వామన!
పదనఖ నీర జనిత జన పావన ।
కేశవ! ధృత వామనరూప! జయ జగదీశ! హరే! ॥
క్షత్రియ రుధిర మయే జగదపగత పాపం
స్నపయసి పయసి శమిత భవ తాపం ।
కేశవ! ధృత భృగుపతిరూప! జయ జగదీశ! హరే! ॥
వితరసి దిక్షు రణే దిక్పతి కమనీయం
దశముఖ మౌళి బలిం రమణీయం ।
కేశవ! ధృత రామశరీర! జయ జగదీశ! హరే! ॥
వహసి వపుషి విశదే వసనం జలదాభం
హల హతి భీతి మిళిత యమునాభం ।
కేశవ! ధృత హలధరరూప! జయ జగదీశ! హరే! ॥
నిందసి యజ్ఞవిధే రహహ శ్రుతిజాతం
సదయ హృదయ దర్శిత పశు ఘాతం ।
కేశవ! ధృత బుద్ధశరీర! జయ జగదీశ! హరే! ॥
మ్లేచ్ఛనివహ నిధనే కలయసి కరవాలం
ధూమకేతుమివ కిమపి కరాలం ।
కేశవ! ధృత కల్కిశరీర! జయ జగదీశ! హరే! ॥
శ్రీ జయదేవకవే రిదముదిత ముదారం
శృణు సుఖదం శుభదం భవసారం ।
కేశవ! ధృత దశవిధరూప! జయ జగదీశ! హరే! ॥
వేదానుద్ధరతే జగంతి వహతే భూగోలముద్బిభ్రతే
దైత్యం దారయతే బలిం ఛలయతే క్షత్రక్షయం కుర్వతే ।
పౌలస్త్యం జయతే హలం కలయతే కారుణ్యమాతన్వతే
మ్లేచ్ఛాన్మూర్ఛయతే దశాకృతి కృతే కృష్ణాయ తుభ్యం నమః ॥

## గీతగోవిందం - కథాప్రారంభము

నందగోపుడు ఆవులమందలను మేపడానికి అడవికి తోలుకుని పోయేటప్పుడు రాధా కృష్ణులూ వెంటబడ్డారు. ఉన్నట్లుండి ఆకాశం మేఘావృతమై జడివాన కురిసే లక్షణాలు కనబడతాయి. అప్పుడు నందగోపుడు రాధను చూచి “అమ్మాయీ! శ్రీకృష్ణుడు పసివాడు. ఉరుములకు మెరుపులకు జడుసుకుంటాడేమో, భద్రంగా ఇంటికి పిలుచుకునిపో” అని రాధకు కృష్ణుణ్ణి అప్పగిస్తాడు. రాధాకృష్ణులు ఇంటికి పోకుండా యమునా నదీ తీరంలో ఉన్న ఒక మనోహర స్థలాన్ని చేరుకుని క్రీడలో పాల్గొంటారు.

రాధాకృష్ణుల ప్రేమ తత్త్వం జీవ పరమాత్మల అవినాభావ సంబంధానికి ప్రతీక. ‘భక్తిః శృంగార వృత్యా పరిణమతి.’ (భక్తియే శృంగార రూపంగా పరిణమిస్తుంది) అన్నట్లు భగవంతునెడ జీవునకు గల అచంచలభక్తి భగవంతుని ఎడబాటువల్ల విరహంగా పరిణమిస్తుంది. నాయనార్లు ఆళ్వార్లు మున్నగు పరమ భక్తులు కూడా ‘స్త్రీ ప్రాయమితరం జగత్’



అన్నట్లు సకల జీవరాసులకు ప్రాణాధారమైన పరబ్రహ్మాన్ని పురుషుడుగా తమ్ము స్త్రీగా భావించుకుని భక్తిని వ్యంగంగా గల విరహ గీతాల, ప్రణయ గీతాలకు సదృశమైన రచనలు గావించారు. ఆ మార్గాన్ని అనుసరించి జయదేవకవి ఆ రాధాకృష్ణుల ప్రణయ వృత్తాంతాన్ని ఈ అష్టపదులలో కావ్య మర్యాద ననుసరించిన వర్ణనలతో కూర్చాడు.

**అష్టపది – 1**

మొదటి అష్టపది (భావప్రకాశిక) [ఇందు శ్రీకృష్ణుని దశావతారాలు ప్రశంసింపబడినవి]

తన భక్తుల్ని అనుగ్రహించి, దుష్టుల్ని శిక్షించి ధర్మాన్ని నిలపడం కోసం ప్రతీ యుగంలోనూ అవతరిస్తానని భగవంతుడు చెప్పిన విధంగానే, అలాంటి దివ్య అవతారాలను ధ్యానం చేస్తే తన కావ్యం నిర్విఘ్నంగా పరిసమాప్తి పొందుతుందనీ, చదివేవారి మనసు ఉల్లాసం అవుతుందనీ, జగత్ప్రసిద్ధమైన పది అవతారాలను స్తుతిస్తున్నాడు ఈ మొదటి అష్టపదిలో.

1. ప్రళయకాలంలో సముద్రాలు వుప్పొంగి భూమండలాన్ని ముంచివేసినపుడు, ఓడ వలే ఆ సముద్రజలాల్లో ఒక పెద్ద చేపవై వేదాలను ధరించి విచిత్ర లీల జరిపావు. శ్రీకృష్ణా! నీకు జయమగు గాక. మీనావతారమైన శ్రీహరికి, జగదీశ్వరునికి జయము జయము.

   **కేశవా! ధృత దశవిధ రూప! జయ జగదీశ! హరే! ॥**

   "కః" అంటే బ్రహ్మదేవుడంటారు. "ఈశః" అంటే ఈశ్వరుడు. బ్రహ్మ మహేశ్వరులిద్దరూ భగవంతుని శరీరంలో పుట్టారు కాబట్టి, "కేశవుడు" అయ్యాడు అంటారు.

   భక్తుల కష్టాలను హరించేవాడు కాబట్టి, "హరే...." అని సంబోధిస్తారు. అందుకోసం నీళ్ళలో చేపలాగా కూడా పుట్టేందుకు వెనుకాడని ధీరలలితుడు. ఆ శ్రీకృష్ణునకు నమస్కరిస్తున్నాడు కవి!"

2. తాబేలు రూపాన్ని ధరించిన స్వామీ! మందర పర్వతాన్ని విశాలమైన వీపులో ధరించినపుడు దాని రాపిడివల్ల గాయాలు గాచిన నీ వీపున భూమి ఉన్నది కదా! మహా కచ్ఛప రూపంతో భగవానుడు భూమిని ధరించి ఉన్నాడన్నది పురాణ ప్రసిద్ధం. కూర్మావతారమైన శ్రీహరికి, జగదీశ్వరునికి జయము జయము.

   విశాలమైన ఈ భూమి భారాన్ని మోస్తున్నప్పుడు ఆ వీపున ఎన్ని గాయాలయ్యాయో, ఎన్ని కాయలు కాసాయో, ఎల్లకాలం అలా మోస్తూనే ఉన్నావు కదా! శ్రీకృష్ణా! ఆది కూర్మవతారా! నీకు నమస్సులు."

3. మరోసారి, ఆదివరాహ రూపం ఎత్తి, భూమిని రెండు కోరల మధ్య బిగించి, పైకిలేపి ఉద్ధరించి నప్పుడు, భూమి మీంచి నీకోరల కొనలు చంద్రుడిలో కళంక రేఖల్లా మెరుస్తున్నాయి. అనగా, స్వామీ! వరాహావతారమందు తెల్లగా చంద్రరేఖవలె ప్రకాశించే కోరలతో నీవు భూమండలాన్ని ఎత్తిపట్టినప్పుడు అది చంద్రునిలో కళంకంలా కొనవచ్చింది కదా! ఖడ్గమృగా వతారమైన శ్రీహరికి, జగదీశ్వరునకు జయము జయము.

4. స్వామీ! నృసింహావతారంలో తామరల లాంటి నీ చేతులలోని వేళ్ళ గోళ్ళ కొనలతో నీచే చీల్చబడిన హిరణ్యకశిపుని శరీరం తామరల మీద వాలిన తుమ్మెదలలా ఉండినది. నృసింహ అవతారమైన శ్రీహరికి, జగదీశ్వరునకు జయము జయము. తామరపువ్వు మీద తుమ్మెదలు దాడి చేస్తాయి. కానీ, తామరపూల వంటి చేతులు ఈ తుమ్మెద లాంటి హిరణ్యకశ్యపుణ్ణి చీల్చడమే నృసింహరూప వైచిత్రి. ఆయన గోటి కొనకు సరిపోని హిరణ్యకశ్యపుడు హరిని ఎదిరించ గలవాడా?

5. వామనావతారంలో బలిని యాచించి త్రివిక్రముడవై అతణ్ణి స్థానభ్రష్టుణ్ణి చేశావు. ఆ సమయంలో నీ పాదాల వేళ్ళ గోళ్ళ కొనల నుండి జారిన నీటి ధారచే మూడు లోకాల్లో వసించే వారిని పవిత్రుల్ని చేశావు. త్రివిక్రమావతారంలో ఆకాశాన్ని ఆక్రమించిన విష్ణు పాదాన్ని బ్రహ్మ భక్తితో కడగగా ఆ నీళ్ళు పవిత్ర గంగానదిగా ప్రవహించిందన్న విషయం పురాణ ప్రసిద్ధం. బడుగు బాపని రూపమైన ఆ వామనావతార రూప శ్రీహరికి, జగదీశ్వరునకు జయము జయము.

   విష్ణువు రూపాలన్నీ అద్భుతాలే!

వామన అవతారం ఎంత అద్భుతంగా ఉంటుందీ! చిట్టిపొట్టి బ్రహ్మచారిలా బలిచక్రవర్తి దగ్గరకు వెళ్ళి, మూడడుగుల నేలను దానం అడిగి, నేలను కొలిచేటప్పుడు త్రివిక్రముడిగా ఎదిగి, మూడు లోకాలూ ఆక్రమించిన కథ ఎంత గొప్పగా ఉంటుందీ!!

ఒక పాదం భూమండలం అంతా వ్యాపిస్తే, రెండో పాదాన్ని ఆకాశంలోకి ఎత్తినప్పుడు ఆ పాదం సత్యలోకం దాకా చేరిందట. అక్కడ బ్రహ్మ ఆ పాదానికి అభిషేకం చేసినప్పుడు ఆ కాలువెంట జాలు వారిన జలాలే ఈ భూమిపైన గంగానదిగా అవతరించాయట!! బ్రహ్మ కడిగిన ఆ పాదానికి నమస్కారం.

విస్తారమైన గంగా జలాలతో బ్రహ్మ, వామనుడి అరికాలుకు అభిషేకం చేసినప్పుడు అంతటి గంగ ఆయన కాలు గోరులో ఇమిడి పోయిందట.

అదీ అద్భుత వామనుని విశ్వరూపం!

యుగయుగంలోనూ ఒక గర్విష్ఠుడైన బలిచక్రవర్తి పుడుతూనే ఉంటాడు. వాడిని పాతాళానికి తొక్కివేసే వామనుడిగా ప్రతీసారి శ్రీకృష్ణుడు కూడా అవతరిస్తూనే ఉంటాడు.

6. పరశురాముడవై గర్వించిన రాజులపై కోపించి ఇరవయ్యొక్క సార్లు క్షత్రియ కులముపై ప్రతీకార దాడిచేశావు, పాప బంధాలు తొలగిపోయేలా చేశావు. పరశురాముడు రాజులను చంపగా వచ్చిన రక్తం మడుగులయ్యిందని ఆ మడుగులే శమంత పంచక మనబడే గొప్ప తీర్థ స్థానాలైనవని పురాణ కథనం. పరశురామావతారమైన శ్రీ హరికి, జగదీశ్వరునకు జయము జయము.

   గర్విష్ఠులైన ప్రభువుల మదమణచడానికి శ్రీహరి ఎన్నో అవతారాలు ఎత్తాడు. వీటిలో ప్రసిద్ధి చెందిన, జన సామాన్యానికి తెలిసిన పది అవతారాలనే జయదేవ కవి వర్ణిస్తున్నాడు.

   పరశురాముడు మొత్తం 21 సార్లు క్షత్రియ వీరులనందరినీ ఓడించి, వారి రక్తంతో (కురుక్షేత్రంలో) 'శమంతక పంచకాలు' అనే ఐదు నెత్తుటి చెరువులను తవ్వించాడు. ఆ చెరువులలో స్నానం చేస్తే పాపాలు, సంసార తాపాలు పోతాయని భక్తులు నమ్ముతారు. పరశురామ అవతారం ధరించిన జగద్రక్షకుడైన హరికి నమస్కారం.

7. శ్రీరాముడవై రఘువంశంలో అవతరించి దశదిశలలో రణవిక్రమాన్ని ప్రకటించి ఇంద్రాది దేవత ప్రార్థననుసరించి రావణుని పది తలలు ఖండించావు. రావణుని తలలు దేవుడి పాదాల వద్ద బలి ఇవ్వబడినట్లు రాలిపడినవి. దశ దిక్కులకు రావణుని పది తలలను బహుకరించిన రామావతారమైన శ్రీహరికి, జగదీశ్వరునకు జయము జయము.

   రణరంగంలో కూడా రమణీయత, కమనీయత ఉంటాయని నిరూపించిన శ్రీకృష్ణా! నీ రామావతారంలో రావణాసురుడి పదితలల్నీ తెగనరికి కమనీయమైన పదిమంది దిక్పాలకులకీ రమణీయంగా బలియిచ్చి వారిని సంప్రీతులు చేశావు గదా! కేశవ! జగదీశ హరీ! నీకు ఎల్లకాలం జయమే అగుగాక!

8. బలరాముడవై తెల్లగా ప్రకాశిస్తున్న శరీరము మీద నీల మేఘంలా మెరుస్తున్న నీలి పట్టు వస్త్రాన్ని, నీ హలాయుధం వల్ల కలత పొంది భయపడుతున్న యమునా నది జలాల వంటి కాంతి గల దానిని కప్పుకున్నావు గదా. ఒకప్పుడు కౌరవుల మీద కోపపడి బలరాముడు హస్తినాపురాన్ని పెకలించడానికి తన హలాయుధంతో లాగాడనీ, యమున నది గట్టు ఒరగిల్లిందని అంతలో మునుల, పెద్దల ప్రార్థనతో శాంతించి వదిలాడని పురాణ కథ. బలరామావతారమైన శ్రీ హరికి, జగదీశ్వరునకు జయము జయము.

   దుష్టజన శిక్షణ ఒక్కటే కాదు, శిష్టజన రక్షణ కూడా బాధ్యతేనని భావించిన కేశవా! నాగేటి దెబ్బతో నేలను చీల్చి యమునా నదిని పంట పొలాల వైపు మళ్ళించిన బలరామావతారం గొప్పది.

   దివ్యమైన నీ నాగలి దెబ్బకి భయపడి యమునా జలాలు ఆ రోజున నీ వెంటే నడిచాయట! నీవెటు నడిపిస్తే అటు ప్రవహించాయట!

   తెల్లని నీ శరీరాన్ని చుట్టుకొని వున్న వస్త్రం గాలికి కదులుతుంటే మేఘపు వన్నె గల నాగలిని చూసి భయపడుతున్న యమునా నదేననిపిస్తోంది.

   కేశవ! లోకరక్షణ కోసం అవతరించిన జగదీశ! శ్రీ కృష్ణా! నీకు నమస్కారం!

9. బుద్ధుడవై అవతరించి భూతదయ ముఖ్య ధర్మమని యజ్ఞాలలో పశువధ కావించే వేదకర్మలను నిరసించావు. దయారూపమైన, బుద్ధ అవతారమైన శ్రీ హరికి, జగదీశ్వరునకు జయము జయము.

   శ్రీకృష్ణా! పరమ ఉగ్రరూపాలతో లోకకంటకుల్ని నివారించినట్లే, సదయ హృదయమైన శాంత రూపంతో లోకంలో అనేక అనాచారాల్ని రూపుమాపించిన నీ బుద్ధావతారం గొప్పది.

   పూర్వయుగాలలో రాక్షస గణాల సంగతి అలా ఉంచుదాం! కలియుగంలో రాక్షసులు మాత్రం యజ్ఞయాగాలు చేస్తూ జంతువుల్ని బలి ఇచ్చే వంకతో దారుణమైన పశుహింస కావిస్తుంటే, జీవకారుణ్యంతో నువ్వు బుద్ధుని అవతారం ఎత్తావు.

   "జంతుహింసే పరమావధి అనుకుంటే, దానిని ప్రోత్సహించే వేదాలు ఏ మాత్రం ప్రమాణం కావు! నిరపరాధులైన పశువుల్ని మనకు పుణ్యం కోసమో, మోక్షం కోసమో చంపడంకన్నా అన్యాయం ఇంకొకటి ఉంటుందా! అయ్యో! నోరు లేని మూగ జీవుల్ని చంపకండి! అహింసని పాటించండి! అహింసే పరమధర్మం. అంతకు మించిన ధర్మం ఇంకొకటి లేదు" అని శాసించిన కేశవా! బుద్ధావతార రూపా! జగదీశా! హరీ! నీకు నా నమస్సులు!

10. కల్కి అవతారంతో మ్లేచ్ఛ జన వినాశనానికి ధూమకేతువు వలె భయంకరంగా మెరుస్తున్న ఖడ్గాన్ని చేతితో ధరించి దుష్ట నిగ్రహం శిష్ట జన రక్షణ చేస్తావు. కల్కి అవతారమైన శ్రీ హరికి, జగదీశ్వరునకు జయము జయము.

   మళ్ళీ దుష్టశక్తులు చెలరేగుతున్నాయి. మారణహోమం

సృష్టిస్తున్నాయి. ఈ భూమండలాన్ని అనేకసార్లు విధ్వంసం చేయగల మారణాయుధాల్ని సృష్టించుకొని, ఒకరినొకరు భయపెట్టు కుంటున్నారు. మళ్ళీ యుగాంతం ఆసన్నమయింది.

అవతరించిన నీ ప్రతీ అవతారమూ ఎన్నో ప్రయోజనాలను నెరవేర్చింది! లోకంలో సుఖమూ, శాంతి వర్ధిల్లజేయడం కోసం ఎన్నిసార్లు నడుం కట్టుకోలేదు, నువ్వు కృష్ణా!

మ్లేచ్ఛుల కారణంగా ఏర్పడనున్న మారణహోమం లోంచి లోకాన్ని సంరక్షించడానికి మరొకసారి అవతరించనున్న కేశవా! జగదీశా! హరీ! మ్లేచ్ఛుల్ని, ఇంకా మిగిలిన నీచుల్ని పరిమార్చడానికి తోకచుక్క అంతటి మహాఖడ్గాన్ని ధరించి, కల్కిరూపంలో నువ్వు ఈ సారి అవతరిస్తావని ఎదురుచూస్తున్నాము.

ధూమకేతువుని చూస్తేనే ఆపదలు ముడుతాయని లోకం భయపడుతుంది. ధూమకేతువు లాంటి ఖడ్గాన్ని చూస్తే మ్లేచ్ఛులు వణికిపోతారు.

'పొగ'ని గుర్తుగా, అంటే జెండాగా కల్గింది ధూమకేతువు! నిప్పు ఉంటేనే కదా పొగ వస్తుంది! మండుతున్న అగ్నిగోళమే ధూమకేతువు. అది మనుషులు తయారు చేసిన శస్త్రాస్త్రాలను మించిన మహా దారుణాస్త్రం! రగులుతున్న దాని రూపం వీరఖడ్గానికి బంగారు పిడిలా ఉంటుంది. పదునైన ఆ వీరఖడ్గం అనేక అణుబాంబులు పేలినప్పుడు నింగికెగిసిన నల్లని పొగలా విస్తరించి వుంటుంది! అదీ ధూమకేతు ఆయుధ స్వరూపం. తోకచుక్క ఆయుధంతో లోకకంటక మ్లేచ్ఛావహం సాగించే కల్కిస్వరూపా! నీకు స్వాగతం.

11. ఈ లోకంలో సారతమమైన లీలతో ఇలా దశావతారాలతో లోకాన్ని రక్షించిన కృష్ణా! భక్తిని వ్యంగ్యంగా కలిగి ఉన్న శృంగార సమయ గీతాలను, గంభీరము, శుభకరము ఐన వాటిని వినుము. ఈ జయదేవ విరచిత దశావతార స్తుతిని వినినంత శుభము, సుఖము కలిగించే శ్రీ హరికి, జగదీశ్వరునకు జయము జయము.

శ్రీ కృష్ణా! దశావతారాలను ధరించిన శ్రీకేశవా! లోకోత్తరమై, సంసార బంధాల్ని వదలించి సమస్త సౌఖ్యాలనీ ఇచ్చే ఈ జయదేవుని గీతాన్ని అవధరించు.

అవతార సంగ్రహ స్తుతి

**శ్లో ။ వేదానుద్ధరతే, జగన్నివహతే, భూగోల ముద్బిభ్రత్,**
**దైత్యానార్దరయత్, బలిం ఛలయతే, క్షత్రక్షయం కుర్వతే ।**
**పౌలస్త్యం జయతే, హలం కలయతే, కారుణ్య మాతన్వత్,**
**మ్లేచ్ఛాన్ మూర్ఛయతే దశాకృతికృత్, కృష్ణాయ తుభ్యంనమః ॥**

వేదాల్ని ఉద్ధరించిన మత్స్యావతార, లోకాన్ని మోస్తున్న ఆదికూర్మావతారం, భూమండలాన్ని పైకెత్తి రక్షించిన



ఆదివరాహావతారం, రాక్షసుల్ని నిలువుగా చీల్చి చెండాడిన నృసింహావతారం, బలవంతుడైన బలిచక్రవర్తిని మించి, త్రివిక్రమ రూపం ప్రదర్శించిన వామనావతారం, అధికార మదాంధులైన పాలకుల మదమణచిన పరశురామావతారం, నేలను చీల్చి, నీటిని మళ్ళించి దివ్యనాగలిని ధరించిన బలరామావతారం, భూత దయను ప్రేరేపించిన బుద్ధావతారం, మ్లేచ్ఛుల్ని మూర్ఛనొందించే కల్క్యవతారం... ఇన్ని అవతారాలు ధరించిన శ్రీకృష్ణా..... నీకు నమస్కారం!!

**(సశేషం)**

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## శ్రీ వామన పురాణాంతర్గతం

**గత సంచిక తరువాయి**

ఇంద్రాది దిక్పాలకులు భగవంతుని స్తుతించుట

మహాత్ములైన సనకసనందనాది యోగీంద్రులు ఆ జగన్నాథుని ఈ విధంగా స్తుతించిన తరువాత ఇంద్రాది లోకపాలకులు ఆశ్చర్యంతో నేత్రములు విప్పారగా తమ శిరస్సులపై చేతులు జోడించి సకల జగత్తును పోషించి రక్షించే ఆ మధుసూదనునికి నమస్కరిస్తూ ఈ విధంగా స్తుతించ సాగాడు.

**నమోస్తు విశ్వరూపాయ పీతాంబరధరాయ తే ।**

**నమస్తేస్తు జగద్ధాత్రే శార్‌ఙ్గ చాపాసి ధారిణే ॥**

– వామనపురాణం, అధ్యాయం 35, శ్లోకం 99

విశ్వరూపుడవు, పీతాంబరధారివి, జగత్తుకు ఆధారమైన వాడవు శార్‌ఙ్గమనే ధనుస్సును, నందకమనే ఖడ్గాన్ని ధరించిన నీకు నమస్కారం. మధుకైటభులనే రాక్షసులను సంహరించిన నీకు నిత్యం నమస్కారం. ప్రళయ కాలాగ్నితో సమానమైన సుదర్శన చక్రంతో రాక్షసులను సంహరించిన నీకు నమస్కారం.

సకల కల్యాణములను, శుభములను కలిగించేవాడవు, వరములను కోరే వారికి వరములను ప్రసాదించేవాడవు, యోగులకు కూడా కనబడని వాడవు, భక్తులకు దర్శన మిచ్చే నీకు వందనం. పరబ్రహ్మ స్వరూపుడవు, యజ్ఞరూపుడవు, సదాశుభాలను చేకూర్చేవాడవు, వక్షస్థలంలో శ్రీవత్సమనే పుట్టుమచ్చగల నీకు నిత్య నమస్కారం.

బలవంతులైన రాక్షస రాజులకు భయమును కలిగించే వాడవు, దేవతలమైన మాకు స్వర్గభోగములను ప్రసాదించే నీకు నమస్కరిస్తున్నాము. సర్వశ్రేష్ఠుడవు, చలింపనివాడవు, నాశరహితుడవు, శరణుపొందదగినవాడవు, క్షీరసాగరమునందు శయనించే నీకు నిత్యం నమస్కరిస్తున్నాము.

యోగస్వరూపుడవు, దామోదరుడవు, వృద్ధిక్షయములు లేనివాడవు, గుణరహితుడవు అయిన నీకు నమస్కారం. నీ దివ్యధామం శాశ్వతమైనది. పరమోత్కృష్టమైనది. ఇటువంటిదని చెప్పనలవికానిది. ఊహింపనలవి కానిది. పుట్టుక లేనిది. నాశరహితమైనది. నీవు జరామరణములు లేని వాడవు, రూపరహితుడవు, నిర్మలుడవు, పరబ్రహ్మవు, పరంధాముడవు నీవే. నీకంటే గొప్పవాడు మరొకడు లేదు.

పురాతనమైన నీ పరరూపాన్ని ఎరుగజాలము. అలాగే ఇప్పుడు నీవు మాకు దర్శింపజేస్తున్న దివ్యస్వరూపాన్ని కూడా తెలుసుకోలేకపోతున్నాము. ఓ జగదీశ్వరా! విశ్వరూపా! సృష్టి

స్థితి సంహార కారకా! జగద్రూపా! విశ్వమూర్తీ! విశ్వకారణా! ఓ భగవంతుడా! నీవు మా యెడల ప్రసన్నుడవుకా! అనుగ్రహించు.

**ప్రసీద విశ్వేశ్వర! విశ్వతోముఖ! ప్రసీద విశ్వక్షయ పాలనేశ!**
**ప్రసీద విశ్వాలయ! విశ్వమూర్తే! విశ్వస్య యోనే! భగవన్! ప్రసీద ॥**

**– వామనపురాణం, అధ్యాయం 35, శ్లోకం 107.**

## శ్వేతద్వీపవాసులైన సిద్ధులు భగవంతుని స్తుతించుట

జనకమహారాజా! ఇంద్రాది లోకపాలకులు ఈ విధంగా స్తుతించిన అనంతరం శ్వేతద్వీప నివాసులైన సిద్ధులు ఆ దేవదేవునికి నమస్కరించి ఈ విధంగా స్తుతించ నారంభించారు -

**యం విష్ణు మాద్యం పురుషం పురాణం**
**దేవానమస్యన్తి శుభోరుబాహుమ్ ।**
**నతాః స్మ తం దేవ మజం సురేశం**
**విశ్వస్య కర్తార మనాది మూర్తిమ్ ॥**

**– వామనపురాణం, అధ్యాయం 35, శ్లోకం 109.**

సర్వవ్యాపకుడు, ఆదిపురుషుడు, పురాణపురుషుడు, సనాతనుడు, శుభప్రదమైన ఊరువులు, బాహువులు కలవాడు, పుట్టుక లేనివాడు, దేవతలకు కూడా ప్రభువు, సకల జగత్తును సృష్టించినవాడు - అనాదియైన ఏ దేవదేవునికి దేవతలంతా నమస్కరిస్తున్నారో అట్టి పరాత్పరునికి మేము శిరస్సు వంచి వందనం చేస్తున్నాము. తన దంష్ట్రాగ్రములతో భూమిని ఉద్ధరించి నిలిపినవాడు, దేవతలు రాక్షసులతో కూడిన ఈ విశ్వమంతటిని భరించి పోషిస్తున్నవాడు, సర్వాంతర్యామి, సకలైశ్వర్య ప్రదాత అయిన పరమపురుషునికి నమస్కరిస్తున్నా.

రాక్షసులను సంహరించిన మహాత్ముడవైన నీ ఒక్కని చేతనే ఈ జగత్తంతా నిండి ఉంది. ఓ అచ్యుతా! సకల లోకములకు ఐశ్వర్యమును ప్రసాదించే ప్రభువైన నిన్ను మేము స్తుతిస్తూ నీకు నమస్కరిస్తున్నాము. అనంతశక్తి యుక్తుడవైన నీచే ప్రళయకాలంలో జగత్తంతా మ్రింగివేయ బడింది. నీవు యథార్థంగా జ్ఞానం చేత మాత్రమే తెలియదగినవాడవు, వటపత్రశాయివై బాలుని రూపంలో ఉండే నీకు నిత్యం నమస్కరిస్తున్నాము.

సృష్ట్యాదికాలంలో మహాత్ముడవు, సర్వవ్యాపివి అయిన నీవు నీ నాభి కమలం నుండి బ్రహ్మాండాన్ని సృష్టించావు. ఓ అమరలోకనాథా! దానిని నీవు లీలగా నీటిలో వదిలావు. అటువంటి నీకు నమస్కారం. ఈ విశ్వమంతా దుష్టరాక్షసులు, భయంకరులు ఆక్రమించగా, వెంటనే ఘోరమైన యుద్ధంలో వారందరినీ సంహరించి ఈ జగత్తును కాపాడిన నీకు నిత్యం నమస్కరిస్తున్నాము.

బ్రహ్మాది దేవతలు కాని, ఇతరులు కానీ నీ పరమపదాన్ని తెలుసుకోలేరు. మేము కూడా ఎరుగము. ఆ పరమపదం వృద్ధి క్షయము లేనిది, నాశరహితమైనది. కావున ఓ దేవదేవా! మమ్ములను కాపాడి మా యందు ప్రసన్నుడవు కమ్ము - మమ్మనుగ్రహించు.

**జానన్తి యస్నైవ పితామహాద్యాః**
**పరం పరదం నైవ వయం చ నాన్యే ।**
**త్వం తత్పదం వృద్ధి వినాశ హీనం**
**రక్షస్వ చాస్మాన్ భగవన్ ప్రసీద ॥**

**– వామనపురాణం, అధ్యాయం 35, శ్లోకం 115.**

## బ్రహ్మాదులకు విశ్వరూప దర్శనం

మహారాజా! బ్రహ్మాది దేవతాగణాలు నిర్మల చిత్తులైన అగస్త్యాది మహర్షులు, శ్వేత ద్వీపవాసులైన సిద్ధులు, బృహస్పతి, వసుమహారాజు, శుక్రాచార్యులు, దూర్వాసమహాముని, సప్తమహర్షులు, సనకసనందనాది యోగులు. ఇంకా అక్కడకు వచ్చినటువంటి ఇతరులందరు శత్రుసంహారకుడైన శ్రీమన్నారాయణుని ఈ విధంగా స్తుతించి ఆ జగత్ప్రభువుకు మరల మరల నమస్కరించి అంజలిబద్ధులై ఆయన చుట్టూ నిలబడ్డారు.

అంతట పద్మదళనేత్రుడు, మహాబాహువు, గరుడారూఢుడు దేవాధిదేవుడు అయిన భగవానుడు వారందరి మధ్యలో తన తేజస్సుతో సూర్యునివలె ప్రకాశిస్తు మందస్మిత వదనారవిందుడై వారందరిని తన కరుణామృత దృక్కులతో వీక్షిస్తూ ఉన్నాడు.

రాజా! ఇంతలో నాగకన్యలు దివ్యాభరణభూషితులై నాట్యం చేస్తూ ఆరాధించారు. గంధర్వులు కొందరు రావణవధను గానం చేశారు. మరికొందరు కంస కేశ జరాసంధ సాల్వాది రాక్షసుల వధను కీర్తించారు. ఇంకొందరు మహాద్భుతమైన బాణాసుర, దుర్యోధనాదుల వధను కొనియాడారు. మరికొందరు గంధర్వులు హిరణ్యకశిపుని వధను గానం చేశారు.

ఇంకొందరు ఆ పరాత్పరుడు ఇతర అవతారాలలో చేసిన జగత్సృష్టి, బ్రహ్మనుండి స్థావరముల వరకు జరిగిన జగన్నిర్మాణ కార్యాన్ని కీర్తించారు. ఆ శ్రీహరి దివ్యసన్నిధానంలో గంధర్వపతులు సుస్వరంగా గానం చేశారు.

మహారాజా! వందల కొలది అప్సరసలు అక్కడ నాట్యం చేశారు. వారంతా ఈ విధంగా భగవంతుని కీర్తిస్తూ ఆడుతూ పాడుతూ దశదిశలు మారుమ్రోగేటట్లు వాద్యాలు వాయిస్తూ ఆ దేవాధిదేవుని ఆరాధించారు.

అగస్త్య ప్రముఖులైన మునీంద్రులు వేలమంది బ్రహ్మాది దేవతా గణములు. ఆశ్చర్యచకితులై నిరామయుడు. దేవదేవుడైన నారాయణుని మహాద్భుతమైన దివ్యరూపాన్ని దర్శిస్తూ ఉన్నారు. మహారాజా! పద్మదళనేత్రుడైన ఆ భగవంతుని మహత్తరమైన

విశ్వరూపంలో ఈ బ్రహ్మాండమంతా దర్శనమిచ్చింది.

దానిలో పర్వతాలు, గ్రామాలు, నదులు, అడవులు, పాతాళలోకం, దేవతలు, రాక్షసులు, మానవులు, సప్తలోకాలు, సప్తద్వీపాలు, యక్షులు, నాగులు, అసురులు, అమరావతి, స్థావర జంగమాత్మకమైన సకల చరాచరజగత్తు, పశుపక్ష్యాదులు, వృక్షాలు, శిలలు, అడవులు, మహానాగులు మొదలగు వాటితో కూడిన ఆ దివ్యస్వరూపం మహాద్భుతంగా గోచరించింది.

ఇంతకు ముందెన్నడూ చూడనిది. మహైశ్వర్యకరమైన ఆ దివ్యస్వరూపాన్ని దర్శించి వారంతా చాలా ఆనందించారు. మహారాజా! ఆ విశ్వరూపాన్ని దర్శించిన వారంతా ఆశ్చర్యానందాలలో మునిగిపోయారు వాళ్ళ నేత్రాలు చలించినాయి. వాళ్ళ హృదయాలు సంభ్రమంతో ఉప్పొంగినాయి. వాళ్ళ అవయవాలన్నీ వణికినాయి. వారంతా భయభ్రాంతు లయ్యారు.

మహారాజా! అంతట భగవానుడు వారందరినీ నిర్మలములు, ప్రసన్నములు, మంగళప్రదములు, పద్మదళములవంటి నేత్రములతో వీక్షించాడు. అప్పుడు బ్రహ్మాది దేవతలపై ప్రసన్నములు, దివ్యములు అయిన కరుణామృత దృక్కులను ప్రసరింపచేశాడు.

వారంతా భయమోహాదులు పోయి ప్రశాంత చిత్తులైనారు. అప్పుడు భగవానుడు ఆ మునీంద్రులందరిని చూచి జనకమహారాజు సర్వలోకేశ్వరుడు, విశ్వరూపధారి అయిన శ్రీహరి సనాతనుడు, దేవతలందరు వింటూండగా మేఘ గంభీరమైన వాక్కుతో వీనులు విందగునట్లు ప్రియంగా జగత్తంతా ప్రతిధ్వనించేటట్లు ఇలా అన్నాడు.

## మహర్షులతో భగవంతుని సంభాషణ

'ఓ మహర్షులారా! మహాతేజశ్శాలురైన మీరంతా నా నుండి ఏమి కోరదలచుకున్నారో వాటన్నిటిని నిస్సంకోచంగా కోరుకోండి. సందేహించ వద్దు.

భూలోకంలో మానవులు నన్ను దర్శించి తమ తమ అభీష్టాలను పొందుతారు. అచిర కాలంలోనే చాలా దుర్లభమైన మోక్షాన్ని కూడా పొందుతారు. ఓ మునీంద్రులారా! నా దర్శనమైన తరువాత కోరికలు తీరకుండా తిరిగి వెళ్ళరు. నన్ను దర్శించిన వెంటనే వారభీష్టాలన్నీ నెరవేరుతాయి. కాబట్టి మీరు ఉత్తమమైన వరాలు కోరుకోండి. మీకేం కావాలో అడగండి' అని భగవంతుడు ఆనతీయగా మహర్షులు పరమానందంతో ఆ దేవదేవుని యిలా ప్రార్థించారు.

పురాణ పురుషుడవైన ఓ దేవదేవా! నీ దర్శన మాత్రం చేతనే మేమంతా కృతార్థులమయ్యాము. ఓ జగన్నాథా! నీ అనుగ్రహం లేకుండా నిన్ను దర్శించటం సాధ్యము కాదు కదా! గోవిందా! ప్రభూ! మేమందరం నిన్ను దర్శించాలనే కోరికతో నీ పాదస్పర్శచే పవిత్రమైన ఈ నారాయణగిరిలో సంచరిస్తూ నీ దర్శనభాగ్యం చేత ఉద్విగ్న మనస్కులయ్యాము.

ఓ పురుషోత్తమా! మేము ఈ సంసారసాగరం నుండి విముక్తిని కోరి మీ పాదపద్మాలను ఆశ్రయించాం. దేవదేవా! భయమును పెంపొందించే ఈ సంసారసాగరం నుండి మాకు ముక్తిని ప్రసాదించుము!

రాజా! అంతట పురుషోత్తముడు, సర్వశ్రేష్ఠుడు, భూత భవిష్యత్ కాల నియామకుడు అయిన గోవిందుడు వారి ప్రార్థనలను విని ఈ విధంగా వరప్రదానం చేశాడు. ఎవరెవరు నన్ను ఏమేమి ప్రార్థించారో వాటన్నిటిని ప్రసాదించాను. ఇందుకేమాత్రం సందేహం లేదు.

నా అనుగ్రహం కలిగిన వారికి ముక్తి సులభంగా లభిస్తుంది. మీరంతా నా అనుగ్రహం వల్ల కల్పాంతంలో ముక్తిని పొందుతారు. ఓ మునిశ్రేష్ఠులారా! అప్పటివరకు ఈ లోకంలో మీరు తపస్సునందు మనస్సు లగ్నం చేసి నా కథలను వింటూ, వినిపిస్తూ మహాభయంకరమైన తపస్సు చేస్తూ ఉండండి.

**యేవ యత్ప్రార్థితం మత్తో దత్త తద్ధి న సంశయః ।**
**ముక్తిర్న చైషా భవతాం ప్రసన్నే మయి దుర్లభా ।**
**కల్పాన్తే మత్ప్రసాదేన ముక్తిం ప్రాప్స్యథ సత్తమాః ॥**

– వామనపురాణం, అ.36, శ్లో.34,35

మహారాజా! ఇంతలో లోకపితామహుడైన బ్రహ్మదేవుడు శిరస్సుపై అంజలి ఘటించి అమిత తేజశ్శాలి, దేవదేవుడు, జగత్ప్రభువు, జగన్నాథుడు అయిన భగవంతునికి ఈ విధంగా విన్నవించుకున్నాడు.

సర్వలోకేశ్వరా! అఖిల యజ్ఞ స్వరూపా! అచ్యుతా రాక్షసులు ఇంద్రాది దేవతలందరిని తరిమేశారు. దేవతల యజ్ఞభాగాలను కూడా రాక్షసులే అనుభవిస్తున్నారు. దేవతలకు ఏమీ లభించడం లేదు. యుద్ధంలో ఆ రాక్షసులను సంహరించడానికి దేవతలకు సాధ్యం కావడం లేదు.

కావున బాగా విజృంభించిన ఆ రాక్షస శ్రేష్ఠుల నందరినీ నీవిప్పుడు సంహరించు అని బ్రహ్మదేవుడు ప్రార్థించగా భగవానుడు చిరునవ్వు నవ్వుచు ఇలా అన్నాడు –

## బ్రహ్మాదులకు వరప్రదానం

అంతట భగవానుడు మహాపరాక్రమశాలియైన విష్వక్సేనుని పిలిచి ఇలా ఆదేశించాడు – 'విష్వక్సేనా! ఈ భయంకర రాక్షసులు దేవతా సమూహాలను బాధిస్తున్నారు. వీరంతా మహాపరాక్రమవంతులు, మహామాయావులు, భయంకరాకారులు, గొప్ప తేజశ్శాలురు, మంచి యుద్ధ కౌశలం కలవారు, వారిని జయించడం గాని, నిలువరించటం కాని

సులభ సాధ్యం కాదు.

కావున నీవిప్పుడు వెళ్ళి ఆ రాక్షసేంద్రులను బంధుపరివార సహితంగా సంహరించు' అని ఆజ్ఞాపించాడు. అనంతరం సర్వజీవాంతర్యామియైన నారాయణుడు చేది రాజైన ఉపరిచరవసువును చూచి ఇలా అన్నాడు -

'చేదిరాజా!నృపశ్రేష్ఠా!మహావీరా!సంసారసాగరంనుండినీకు మోక్షాన్ని ప్రసాదిస్తున్నాను. త్వరలోనే నీవు మోక్షసామ్రాజ్యాన్ని పొందుతావు. ప్రహ్లాదుడు తప్ప ముల్లోకాలలోను నా భక్తులలో నీతో సమానమైన వాడు లేడు. పూర్వం నేను రాక్షస శ్రేష్ఠుడు, హిరణ్యకశిపుని పుత్రుడు అయిన ప్రహ్లాదుని అన్ని ప్రాణుల నుండి, పంచభూతాల నుండి రక్షించాను' అని చేదిరాజు అయిన వసువుతో పలికి ఆ జగత్ప్రభువు ఆనందబాష్పాలతో కన్నులు నిండిన అగస్త్యమహర్షిని చూచి పరమభక్తితో కూడిన ఆయనతో ఇలా అన్నాడు.

'ఓ మహామునీ! నేను నీ యందు ప్రసన్నుడనయ్యాను. నీ అభీష్టాన్ని కోరుకో. నేను ఎంత దుర్లభమైనదైనా ప్రసాదిస్తాను. ఇందుకు సందేహం లేదు' అని దేవదేవుడు ఆనతీయగా అగస్త్యమహర్షి ఆనందంతో శరీరం పులకించగా శిరసుపై చేతులు జోడించి పరబ్రహ్మయైన ఆ శ్రీహరిని ఇలా ప్రార్థించాడు.

కేశవా! మహాబాహూ! నేను ఈ నారాయణగిరిలో వందల కొలది సంవత్సరాలు సంచరించాను. చాలాకాలం ఇక్కడే ఇటు అటు తిరిగినప్పటికీ విశాలాక్షుడవు, ఆదిపురుషుడవు, పుట్టుక, నాశం లేనివాడవు అయిన నిన్ను ఇన్నాళ్ళుగా దర్శించలేకపోయాను. అందువల్ల నేను చాలా వ్యాకులతను, విషాదాన్ని పొందాను. ఓ పురుషోత్తమా! నా భాగ్యవిశేషం చేత జగత్ప్రభువైన మీ దర్శనం ఇప్పుడు లభించింది. నా అభీష్టాన్ని మీ అనుగ్రహం వలన పొందగోరుచున్నాను. భూతకాలంలో భవిష్యద్వర్తమాన కాలాల్లో సర్వప్రాణులకు తెలియదగిన ఉత్తమగతిని గురించి బాగుగా తెలుసుకోగోరుచున్నాను. శ్రీహరీ! దేవతలు కూడా వేలసార్లు విన్నప్పటికీ తెలుసుకోలేని ఆ ఉత్తమగతిని గురించి నాకు తెలియజేయి. నీ యందు నాకు నిశ్చలము. నిర్మలమునైన పరాభక్తి ఉండుగాక.

మహారాజా! అగస్త్యమహర్షి ఈ విధంగా ప్రార్థించగా జగద్భర్తయైన భగవానుడు మందహాసంతో మేఘ గంభీరధ్వానంతో స్పష్టంగా ప్రీతితో ఇలా అన్నాడు -

'అగస్త్యా! నీవడిగినదంతా ప్రసాదించాను. ఈ పర్వతంపై నీవు చేసిన పూజవల్ల నేను సంతుష్టుడనయ్యాను' అని భగవానుడు వరప్రదానం చేయగా అగస్త్యమహర్షి మరల ఇలా ప్రార్థించాడు -

**'త్వం చ దృశ్యో వసేహేశ !సర్వేషాం ప్రాణినామపి'**

– వామనపురాణం, అ.36, శ్లో.59.

'ప్రభూ! మీరు ప్రాణులందరికి దర్శనమిస్తూ ఈ పర్వతంపైనే నివసించండి' అని కోరాడు.

భగవంతుడు ఆయన ప్రార్థనను ఆలకించి 'ఓ పుణ్యాత్మా! నేను ఈ పర్వతంపైనే శ్రీదేవి, భూదేవులతో పాటు అందరికీ దర్శనమిస్తాను. అనేక రత్నఖచితమైనది, ఆకాశంలో సంచరించేది, అపూర్వమైనది, దివ్యమైన నా విమానం మాత్రం నిగూఢంగా ఉండి ముక్తిదాయకమౌతుంది.

**అహంద్దృశ్యో వసామీహ శ్రీభూమి సహితోనఘ ।**

**విమానం మమదివ్యంతు గూఢం ముక్తి పరం భవేత్ ।।**

**ఆకాశగమచింత్యం చ నానారత్న సమన్వితమ్ ।**

– వామనపురాణం, అధ్యాయం 36, శ్లోకాలు 60,61

ఈ నారాయణగిరిలో ఉన్న మునీంద్రులు, ఇతర మానవులందరు నిర్మలమైన, శుభప్రదమైన స్వామి పుష్కరిణి చేరి పవిత్రమైన ఆ పుణ్యతీర్థాన్ని దర్శించి, స్వీకరించి, దానిలో స్నానం చేసి, దాని ఒడ్డున ఉన్న, నా కత్యంత ప్రీతికరమైన, మహాపుణ్యప్రదమైన, సర్వపాపహరం అయిన, శుభప్రదమైన నేను అధిష్ఠించి ఉన్న దివ్యవిమానంలో (ఆలయంలో) నాయందు మనస్సుంచి భక్తితో నన్నారాధించే వారికి మిక్కిలి దుర్లభాలైన అభీష్టాలను కూడా ప్రసాదిస్తాను.

వందల యోజనాల దూరంలో ఉన్నప్పటికీ ఈ పర్వతము నందు భక్తితో ఈ దిక్కుకు నమస్కరించే మానవులు నా అనుగ్రహం వలన పాపరాశిని పోగొట్టుకొని దుర్మార్గులు పొందలేని, దుష్టులు ప్రవేశించలేని పుణ్యనిలయమైన పరమపదాన్ని పొందుతారు. ప్రతి నిత్యం శుభప్రదమైన ఈ స్వామి పుష్కరిణిని సేవించేవారు నిస్సందేహంగా భుక్తిని, ముక్తిని కూడా పొందుతారు.

**అస్యాస్తీరే మహత్యస్మిన్ విమానే మదధిష్ఠితే ।**

**మమ ప్రీతికరే పుణేయ సర్వపాపహరే శుభే ।।**

**భక్తా మామర్చయిష్యన్తి మయి సన్న్యస్తమానసాః ।**

**దదాబీష్టతమాన్ కామాంస్తేషామపి సుదుర్లభాన్ ।।**

**యేనరాః కుర్వతీ విప్ర । యోజనానాం శతేష్వపి ।**

**ప్రణామం దిశముద్దిశ్య భక్త్యా మత్పర్వతోత్తమ్ ।।**

**తేనరా మత్ప్రసాదేన పాపరాశిం వ్యపోహ్యవై ।**

**ప్రాప్నువన్తి పదం పుణ్యం అప్రవిష్టం దురాత్మభిః ।।**

– వామనపురాణం, అధ్యాయం 36, శ్లోకాలు 63-66.

## దివ్య విమాన సందర్శనం

జనకమహారాజా! భగవంతుడు ఈ విధంగా వరప్రదానం చేయగా అభయమివ్వగా ఆ అమృతవాక్కులు విన్న మహర్షులు ఆ తరువాత లోకంలో ప్రసిద్ధిచెందిన స్వామి పుష్కరిణికి దక్షిణ తీరంలో స్వచ్ఛమై, దివ్యమై సూర్యునివలె ప్రకాశిస్తున్న విమానాన్ని దర్శించారు. దానిలో సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు అధివసించి ఉన్నాడు. అది మహాద్భుతంగా ఉంది. తెల్ల



నిమేషములవలె ఉంది. అనేక శిఖరాలతో శోభిస్తున్నది.

ఆ దివ్యవిమానం బహురత్నఖచితమై, ముత్యాల సరాలతో అలంకరించడి దివ్యకాంతితో విరాజిల్లుతున్నది. అది చాలా ఎత్తుగా ఉంది. చూడటానికి అశక్యంగా ఉంది. చూసేవారికి ఆనందాన్ని పెంపొందిస్తున్నది. ఆ దివ్యపర్వతంపై ఇటు అటు సంచరిస్తున్న మునీంద్రులు కాని, దేవతలు కాని, ఇంద్రాది దేవతా శ్రేష్ఠులుకాని ఇంతకు ముందెన్నడు అటువంటి దివ్యవిమానాన్ని దర్శించలేదు.

మహారాజా! ఆ మునీంద్రులందరు మహాశ్చర్యకరము, పరమాద్భుతము అయిన ఆ దివ్యవిమానాన్ని దర్శించి ఆశ్చర్య చకితులయ్యారు. వారందరు ఆ పర్వతమంతా ఇటు, అటు కలియతిరుగుతున్నప్పటికి ఇంతకుముందు ఎన్నడూ ఆ దివ్యవిమానం కనబడలేదు. 'మనమంతా ఈ పర్వతం మీదే సంచరిస్తున్నప్పటికీ మనం దీనిని ఎప్పుడూ చూడలేదే! ఇప్పుడెలా కనబడుతున్నది? ఇదేమి ఆశ్చర్యం!

అద్భుతమైన ఆకారంలో ఉన్న ఆ దివ్యవిమానాన్ని, పురుషోత్తముడైన శ్రీనివాసుని దర్శించి ఆ మహర్షులందరూ ఆనందాశ్చర్యాలతో విప్పారిన నేత్రాలు కలవారై ఇలా అనుకున్నారు - 'ఆహా! ఇది మహాశ్చర్యంగా ఉంది. ఈ దివ్యవిమానాన్ని నిశ్చయంగా శ్రీహరియే దాచి ఉంచాడు. అందువల్లనే అది ఇంతకుముందు మనకు కనబడలేదు. మనమంతా పరమపవిత్రమైన ఈ పుష్కరిణీ తీరంలో ఉన్నప్పటికీ ఆ మహాత్ముడైన శ్రీహరి మాయవలన మహాపుణ్యప్రదమైన మహాశ్చర్యకరమైన, సూర్యసమాన కాంతితో వెలుగొందుతున్న ఈ దివ్యవిమానాన్ని దర్శించలేకపోయాము. మనతోపాటు ఉన్న సత్పురుషులందరు కూడ దానిని దర్శించలేక పోయారు. సిద్ధపురుషులు సేవించే ఈ దివ్యవిమానాన్ని తప్పకుండా ఆ శ్రీహరియే తన మాయతో కనబడకుండా దాచి ఉంటాడని ఈ విధంగా ఆ మునులందరు దేవదేవుని దివ్యసన్నిధానంలో పరస్పరం మాట్లాడుకుంటున్నారు. ఇంతలో భగవానుడు మహాత్ముడైన హైహయ మహారాజు శ్రుతుని కుమారుడైన శంఖరాజుతో ఇలా అన్నాడు - 'రాజా! నీ తపస్సు చేత నేను సంతుష్టుడనయ్యాను. నీ మనస్సులో ఉన్న (కోరిక) వరం కోరుకో నేను ప్రసాదిస్తాను. నీకు వరమిచ్చుటకై నేను వచ్చి ఉన్నాను' అని భగవంతుడు ఆజ్ఞాపించగా జగత్ప్రభువు, అనంతుడు, జగత్కారణుడు, మహాత్ముడు, జగత్కర్త అయిన శ్రీమహావిష్ణువుయొక్క అమృతవాక్కులు విని శంఖమహారాజు పరమ సంతోషాన్ని పొందాడు. ఆనందంతో అతని శరీరం పులకరించింది.

అంతట దేవాధిదేవుడు, పరబ్రహ్మ స్వరూపుడు, పుట్టుక తెలియని వాడు అయిన శ్రీహరితో శంఖమహారాజు ఇలా విన్నవించుకున్నాడు - "అథోక్షజా! నీ దివ్యానుగ్రహం వలన నీ లోకాన్ని పొందాలనుకుంటున్నాను. నీ పరమ పదమైన వైకుంఠంలో నివసించుట కొరకై తీవ్ర తపస్సు చేస్తున్నాను. విష్ణుమూర్తీ! పుండరీకాక్షా! నీవు నాకు వెంటనే దానిని ప్రసాదించు. దేవదేవా! సురేశ్వరా! నేను నీ నుండి ఇంతకంటె

వేరేమి కోరడం లేదు'' అని ప్రార్థించాడు.

శంఖ మహారాజు ఈ విధంగా వరం కోరగా జనార్దనుడు చిరునవ్వుతో ప్రాణులన్నిటినీ సంతోషపరుస్తూ తన మధుర వాక్కులతో ఇలా వరప్రదానం చేశారు - 'ఓ సత్పురుషా! నీవు కల్పాంతం వరకు స్వర్గలోకంలో ఉంటూ, ఇంద్రలోకంలోని దేవతలందరిచేత చక్కగా పూజింపబడతావు' అని వరమిచ్చి భగవంతుడు అదృశ్యమయ్యాడు

## దేవతల పరితాపం

బ్రహ్మాది దేవతలకు కూడా ప్రభువు. పరాత్పరుడు, శాశ్వతుడు, పరబ్రహ్మ, ప్రజాపతి. భక్తులకు సర్వము తానేయైనవాడు, సకల లోకములను పరిపాలించేవాడు జగత్తును ధరించేవాడు. సకల లోక సృష్టికర్త అయిన కేశవుడు, శ్రీమన్నారాయణుడు, సకల జగత్తుకు ఆధారమైనవాడు, పురుషోత్తముడు, దేవతలకు సర్వస్వమైనవాడు, సర్వేశ్వరుడు, పరమాత్మ, తేజోరాశితో కూడియున్నవాడు, శ్రీకృష్ణుడు పద్మపత్ర నేత్రుడు అయిన భగవంతుడైన శ్రీమహావిష్ణువు వారందరు చూస్తుండగానే అదృశ్యమయ్యాడు.

అంతట దేవతలు, బ్రహ్మర్షులు, తపోధనులైన మునీంద్రులు, సిద్ధులు, నిర్మల చిత్తులైన మహర్షులు, బృహస్పతి, వసువు, శుక్రాచార్యుడు మొదలైన వారు, సనకసనందనాది యోగిపుంగవులు, సప్తమహర్షులు, శ్వేతద్వీపవాసు లైన సిద్ధులు, ఇంకా భగవంతుని దర్శించటానికి అక్కడ చేరిన ఇతరులు అందరూ కూడా ఆశ్చర్యచకితులై విప్పారిన నేత్రములతో అంతర్ధానము చెందిన సనాతనుడైన ఆ దేవదేవునికి మరల మరల నమస్కరించారు.

మహారాజా! వారంతా దైన్యంతో వికలమనస్కులై పలుదిక్కుల కలయజూస్తున్నారు. అక్కడున్న మహర్షులందరూ భగవంతుని వియోగ దుఃఖంతో విలపించారు. బ్రహ్మాది దేవతలు అంతర్ధానం చెందిన దేవదేవుడైన ఆ శ్రీహరికి నమస్కరించి ఇలా అన్నారు -

ఆహా! ఆ భగవంతుని మాహాత్మ్యం ఎంత ఆశ్చర్యకరమైనది! అమిత తేజశ్శాలియైన ఆయన దివ్యతేజస్సు ఈ బ్రహ్మాండమంతా వ్యాపించింది. ఆయన ధరించిన సుదర్శన చక్రం మొదలైన దివ్యాయుధాలు ఈ జగత్తునంతటిని దహింపచేసేట్లు సముద్రాలన్నింటిని ఎండింపచేసేటట్లు ప్రజ్వలిస్తున్న ఆయన ప్రసన్నమైన కటాక్షవీక్షణములు పది దిక్కుల ప్రకాశింపచేస్తున్నాయి. ఆయనతనదివ్యకాంతులువందలకొలది దివ్య కాంతులతో దిక్కులన్నింటిని ప్రకాశింపచేశాడు. ఆ శ్రీహరి యొక్క వందల కొలది బాహువులు ఏనుగుల తొండాలవలె ఉండి పరస్పరం పోటీపడు తున్నట్టు దివ్యతేజస్సుతో ప్రకాశించినాయి. పూర్ణచంద్రునివలె నున్న ఆయన ముఖపద్మాలు నిర్మలములై, దివ్యములై రత్నకుండలాలతో శోభించినాయి.

ఆ శ్రీహరి పాదపద్మాలు చంద్రమండలంవలె నున్న తెల్లని కాంతి గల గోళ్ళతో స్వచ్ఛమైన కాంతితో ప్రకాశిస్తున్నాయి. ఆహా! అచ్యుతుడు మహా తేజోరూపమైన ఈ శ్రేష్ఠమైన పర్వతంపై నివసిస్తున్నాడంటే ఇక దీని మాహాత్మ్యమేమని చెప్పాలి?

మనందరమూ కలిసి కూడా నిర్మలమైన తేజస్సుతో వందల సంవత్సరాలకు కూడా ఈ పర్వతమాహాత్మ్యాన్ని వర్ణించలేము. వేంకటాద్రితో సమానమైన పుణ్యక్షేత్రం బ్రహ్మాండంలో మరెక్కడా లేదు. అలాగే వేంకటేశ్వరుని సాటిదైవం మున్ను లేదు. ఇకముందు ఉండబోదు.

**వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన ।**
**వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥**

– వామనపురాణం, అ.37, శ్లో.41

స్వామి పుష్కరిణితో సమానమైన పుణ్యతీర్థం మరొకటి లేదు. అలా ఉందని చెప్పినవాడు మహాపాపాత్ముడు. మోక్షప్రదాలని చెప్పే సప్త మహాపట్టణాలు వేంకటాద్రి ప్రక్కనున్న ఒక గ్రామంలోని కోటి అంశతో సమానం అని ఈ విధంగా బ్రహ్మాండదేవతలందరు సంతుష్టాంతరంగులై ఆ దేవదేవుని గురించి అనేక విధాల మాట్లాడుకుంటూ స్వామి పుష్కరిణీ తీర్థంలో స్నానం చేసి ఆ తీర్థాన్ని స్వీకరించి మరల మహాశ్చర్యకరమైన పరమాద్భుతమైన దివ్యవిమానాన్ని దర్శించాడు.

బ్రహ్మాది దేవతలు కూడా ఇంతకు ముందెప్పుడు చూడని భగవంతుని దివ్యవిమానంలో ఆ మహాత్ములందరూ పరమానందంతో దేవాధిదేవుడైన శ్రీహరిని సందర్శించారు. ఆయన నిర్మలమైన సూర్యకాంతితో శోభిస్తున్నాడు. సర్వజగత్ప్రభువైన ఆ శ్రీహరి చతుర్భుజుడై, దివ్యమైన కుండలాలు ధరించాడు. ఆ అచ్యుతుడు నానావిధ ఆభరణాలు ధరించి ఉన్నాడు. అనేక రత్నఖచితమైన కిరీటంతో విరాజిల్లుతున్నాడు.

సర్వప్రాణులందరికి వరప్రదాతయైన ఆ దేవదేవుడు పంచాయుధాలను ధరించి ఉన్నాడు దివ్యరత్నాలు పొదిగిన కంకణాలతో శోభిస్తున్నాడు. దివ్యమైన పీతాంబరాన్ని ధరించాడు. ఆ శాంతమూర్తి, నమస్కరించిన వారి పాపాలను పోగొట్టే శ్రీమహావిష్ణువు సర్వవ్యాపి, ముల్లోకాలకు అలంకారమైన పరాత్పరుడు దివ్యరత్నాలచే అలంకరించబడ్డాడు.

ఆయన మెడలోని మణిహారాలు బహుసుందరములై, రత్నాల కాంతులతో మెరుస్తున్నాయి. ఆయన పాదాలు కాలి అందెలతో ప్రకాశిస్తున్నాయి. ఆ పుండరీకాక్షుని ప్రక్కనున్న లక్ష్మీదేవి సేవిస్తున్నది. మరొక భార్యయైన, సౌశీలవతియైన భూదేవి కూడా ఆయన్ను సేవిస్తున్నది.

**(సశేషం)**

# తిరుమల సర్వస్వం

ధారావాహికం

– పల్లపోతు వాణిశ్రీ



**గత సంచిక తరువాయి**

## అచ్యుతరాయలు

శ్రీకృష్ణదేవరాయల అనంతరం అతని సోదరుడైన అచ్యుతరాయలు శ్రీవేంకటేశ్వరుని సమక్షంలో ఆలయం శంఖంతో సంప్రోక్షణ గావించుకుని విజయనగర సామ్రాజ్యాన్ని చేపట్టాడు. రాజ్యాభిషిక్తుడైన వెంటనే, జీర్ణదశలో ఉన్న, మనందరికీ సుపరిచితమైన ''కపిలతీర్థం'' ఆలయాన్ని పునరుద్ధరించి, తీర్థానికి ఇరుప్రక్కలా (కోనేటి చుట్టూ) సంధ్యావందన మండపాలు నిర్మించాడు. ఈ తీర్థానికి పూర్వకాలంలో చక్రతీర్థమనే పేరుండడం వల్ల, ఆలయానికి నాలుగు దిక్కులా చక్రచిహ్నాలను చెక్కించాడు. తిరుపతి పట్టణం నందు తిరుమల ఘాట్ రోడ్డు ప్రారంభంలో, నంది సర్కిల్ వద్ద ఆ కపిల తీర్థాన్ని, పొడవాటి మండపాలను నేడూ మనం చూడవచ్చు. ఆ సువిశాలమైన మంటపాలన్నీ నేటికీ, మరీ ముఖ్యంగా కార్తీకమాసంలో, కపిలేశ్వరుని దర్శనార్థం వచ్చి తీర్థస్నాన మాచరించే భక్తులతో క్రిక్కిరిసి ఉంటాయి.

మూడు పర్యాయాలు తిరుమలను దర్శించుకున్న అచ్యుతరాయలు మొదటిసారి 1533 సంవత్సరంలో కపిలగోవులతో బాటుగా మరెన్నో ఆభరణాలు, దుస్తులు స్వామివారికి దానం చేసి, స్వామివారికి కనకాభిషేకం కావించాడు. అర్చకులు సహస్రనామాలు చదువుతుంటే, స్వామికి స్వయంగా అర్చన చేసేవాడు.

అలాగే 1535 లో రెండవసారి, 1537 లో మూడవసారి తిరుమలకు విచ్చేసినపుడు అనేక ధార్మిక కార్యక్రమాలు చేపట్టి ఆలయ చరిత్రలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు.

తిరుమల క్షేత్రంలో అనేక ఉత్సవాలు, ఊరేగింపులు ప్రవేశపెట్టి, వాటికి తగినంత ప్రచారం కల్పించి, భక్తులు ఎక్కువగా తిరుమలను దర్శించుకునేట్లు చేయగలిగాడు. రాజధాని పట్టణమైన హంపి – విజయనగరం నుండి నర్తకీమణుల్ని రప్పించి తిరుమల ఉత్సవాల్లో నాట్యాలను కూడా ప్రవేశపెట్టాడు. నిత్యపూజానంతరం మనం చేసే ''షోడశోపచారాల్లో'' నాట్యోపచారం కూడా ఒకటి. ''నృత్యం దర్శయామి'' అని కూడా చదువుతాం కదా.

శ్రీకృష్ణదేవరాయల కాలంలో విజయనగర సామ్రాజ్యానికి మంత్రియైన ''మహామంత్రి తిమ్మరుసు'' కూడా, వేంకటేశ్వరుడికి వీరభక్తుడే. భార్యా సమేతంగా తిరుమలను సందర్శించుకుని, అనేక కానుకలతో పాటు ''పరాంతలూరు'' అనే గ్రామాన్ని దేవదేయంగా సమర్పించుకున్నాడు. అలాగే విజయనగర రాజులకు మంత్రిగా, సేనాపతిగా పని చేసిన సాళువనరసింహుడు, విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన సదాశివరాయలు, అళియరామరాజు మొదలగు చక్రవర్తులు కూడా ఆలయాభివృద్ధికి విశేష కృషి చేశారు. కొండ మీదకు వచ్చిన భక్తులకు కాణీ ఖర్చు లేకుండా భోజన, వసతి, దర్శనం లాంటి సదుపాయాలన్నీ విజయనగర సామ్రాజ్య పాలనలోనే ప్రారంభమై నేటికీ కొనసాగుతున్నాయి.

ఆ విధంగా తిరుమల ఆలయంతో విజయనగర రాజులకున్న అనుబంధం 1365 సంవత్సరంలో మొదటి బుక్కరాయలుతో ప్రారంభమై, 300 సంవత్సరాలు అప్రతిహతంగా కొనసాగి, 1665 సంవత్సరంలో శ్రీరంగరాయల తిరుమల దర్శనంతో ముగిసింది. తరువాత ఆలయ నిర్వహణ అనేక చేతులు మారి, చివరిగా 1933 సంవత్సరంలో తి.తి.దే చేతికి వచ్చింది.

విజయనగర చక్రవర్తుల పాలన అంతమైనా, తిరుమలపై ఆధిపత్యం ఎన్ని చేతులు మారినా, వారు ఆలయంలో ప్రవేశపెట్టిన అనేక సేవలు, సాంప్రదాయాలు, భక్తులకు వారు ఏర్పాటు చేసిన సౌకర్యాలు నేటికీ కొనసాగుతూ, వారు దేవాలయాభివృద్ధికి చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోయింది.

## వ్యాసరాయలు వారు

విజయనగర చక్రవర్తులైన వీరనరసింహరాయలు, శ్రీకృష్ణదేవరాయలు, అచ్యుతరాయలు ఈ ముగ్గురికీ గురువుగా ప్రసిద్ధికెక్కిన వ్యాసరాయలు, ద్వైత సాంప్రదాయ పీఠాధిపతులు. వీరిని ''వ్యాసతీర్థులు''గా కూడా పిలుస్తారు. తపః సంపన్నుడైన ఈ పండితోత్తముడు, సూత్రభాష్యం, ఋగ్వేదభాష్యం, గీతాతాత్పర్యం లాంటి 37 సర్వమూల గ్రంథాలు రచించాడు. వ్యాసతీర్థులవారు, భగవద్రామానుజాచార్యుల వలనే, తిరుమలక్షేత్రాన్ని ఓ దివ్యసాలగ్రామంగా భావించి, తిరుమల మెట్లను కాళ్ళతో ఎక్కి అపవిత్రం చేయరాదని తలంచి, మోకాళ్ళతో అధిరోహించినట్లు చెబుతారు. ఆనందనిలయ విమానంలో వాయువ్యమూలన ఉన్న ఓ చిన్న శ్రీనివాసుని విగ్రహానికి ''విమాన వేంకటేశ్వరునిగా'' ప్రాణప్రతిష్ఠ జరిపించడం ద్వారా ''ఏ కారణం చేతనైనా, స్వామివారి దర్శనం చేసుకోలేక పోయినట్లైతే, విమాన వేంకటేశ్వరుణ్ణి దర్శించుకుంటే స్వామివారిని దర్శించుకున్నట్లే'' అన్న సాంప్రదాయానికి వ్యాసతీర్థులవారే శ్రీకారం చుట్టారు. వారు 108 పెద్ద సాలగ్రామాలకు బంగారు తొడుగులు చేయించి, ''సాలగ్రామమాల''గా తయారు చేసి స్వామివారికి అలంకరింప చేశారు.

కన్నడ దేశాన విజయనగర సామ్రాజ్యకాలంలో వైష్ణవాన్ని, వేంకటేశ్వరస్వామినీ పెద్దయెత్తున ప్రచారం చేసింది వ్యాసరాయలవారే.

వీరు ప్రతిష్ఠ చేసిన 1,008 ఆంజనేయ విగ్రహాలలో ఒకటైన ''కోనేటి గట్టు ఆంజనేయుణ్ణి'' ఇప్పుడు కూడా మనం స్వామి పుష్కరిణికి ఉత్తరం దిక్కున దర్శించుకోవచ్చు. ఆ దేవాలయానికి ప్రక్కనే ''వ్యాసరాయ ఆహ్నిక మండపం''గా పిలువబడే ఓ కాషాయ రంగులో ఉన్న మండపాన్ని నేడు కూడా చూడవచ్చు. వ్యాసరాయల వారు అర్చకత్వం వహించిన రోజుల్లో, వారు ఆ మండపంలోనే నివాసం ఉన్నట్లుగా కొందరు చెబుతారు.

వారు హిందూధర్మాన్ని పరిరక్షించి అప్పటివరకూ అగ్రవర్ణాల వారికి మాత్రమే అందుబాటులో ఉన్న పురాణేతిహాసాలను, వైష్ణవ ప్రబంధాలను, స్వామివారి కీర్తనలను జనబాహుళ్యంలోకి తెచ్చారు. నిమ్నకులస్థుడైన ''కనకదాసు'' అనే భక్తుణ్ణి చేరదీసి, ఆయనను శిష్యునిగా స్వీకరించారు. తరువాతి కాలంలో కనకదాసు కన్నడ వాగ్గేయకారునిగా ప్రసిద్ధికెక్కి, స్వామివారిపై అనేక కీర్తనలు రచించి గానం చేశాడు. కనకదాసు, పురందరదాసు మరికొందరు దాసభక్తులు రచించిన కీర్తనలను తి.తి.దే వారు సేకరించి, కన్నడిగులకు ''దాసప్రాజెక్టు''గా వెలుగులోకి తెచ్చారు. అలాగే జాతి, వర్ణ, వర్గాలకు అతీతంగా, భక్తి ఉద్యమం వేళ్ళూనుకుని సర్వ వ్యాపితమవ్వాలనే ఉద్దేశ్యంతో తెలుగువారికి ''అన్నమాచార్య'' ప్రాజెక్టు, తమిళులకు ''దివ్య ప్రబంధ ఆళ్వార్'' ప్రాజెక్టులను తి.తి.దే చేపట్టింది.

తిరుమలలో బ్రహ్మోత్సవాల నిర్వహణ నిమిత్తం 14000 నర్రణాలను, పౌర్ణమి నాటి నైవేద్యానికి ''బద్దంపెట్ట'' అనే గ్రామాన్ని వ్యాసరాయలవారు దేవదేయంగా ఇచ్చారు.

శ్రీకృష్ణదేవరాయలు ఒకానొకప్పుడు ''కుహూ'' యోగమనే కాలసర్ప దోషగ్రస్తులయ్యారు. అప్పుడు వ్యాసతీర్థులవారు కొన్ని ఘడియలపాటు విజయనగర సామ్రాజ్య సింహాసనాన్ని అధిష్ఠించి, శ్రీకృష్ణదేవరాయల వారిని తాత్కాలికంగా సింహాసనాన్నుంచి తప్పించి, తన తపః శక్తితో రాయలవారికి జాతకరీత్యా కలిగిన సర్పదోషాన్ని తొలగించారు. సింహాసనాన్ని అధిష్ఠించడంతో, ఆయన విజయనగర చక్రవర్తుల వంశనామమైన ''రాయలు'' బిరుదాంకితులై, ''వ్యాసరాయలు''గా పిలువబడ్డారు.

అదే సమయంలో అప్పటి వైఖానస అర్చకుడు స్వామివారి నగలు అపహరించాడనే నేరం మీద దేశబహిష్కరణకు గురై, అర్చకత్వానికి అనర్హుడయ్యాడు. అతని వారసుడు అప్పటికింకా పసిబాలుడు కావడంతో, వ్యాసరాయలు వారు 12 సంవత్సరాలు శ్రీవారికి అర్చకత్వం వహించారు. దానితో బాటుగా ఆ బాలుణ్ణి సంరక్షించి, ఆగమశాస్త్ర ప్రకారంగా అర్చనావిధానాలను నేర్పించి, యుక్తవయసులో అతనికి అర్చకత్వ బాధ్యతలు తిరిగి అప్పగించారు. శ్రీవారి అర్చన సాంప్రదాయం పరహస్తగతం కాకుండా కాపాడి, వైఖానస అర్చక పరంపర కొనసాగేట్లు చేశారు.

ఆ విధంగా, తిరుమల ఆలయానికి, వ్యాసరాయలు వారికి, విడదీయరాని అనుబంధం ఉంది. శ్రీకృష్ణదేవరాయలను సర్పదోషం నుంచి రక్షించడం, ఆలయంలో స్వయంగా అర్చకత్వం వహించడం, వైఖానస అర్చక సాంప్రదాయం పర హస్తగతం కాకుండా చూడటం, స్వామివారి కీర్తనలను జనబాహుళ్యం లోకి తీసుకెళ్ళడం వంటి మహత్తరమైన

పుణ్యకార్యాల ద్వారా, ఆయన స్వామివారి భక్తులందరికీ పూజనీయుడయ్యాడు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాలు

**"తిరువీధుల మెరసీ దేవదేవుడు**
**గరిమల మించిన సింగారముల తోడను"**

లక్షలాది మంది భక్తుల గోవిందనామ స్మరణతో దిక్కులు పిక్కటిల్లుతుండగా, అడుగడుగు దండాలతో ఆబాలగోపాలం హారతి పడుతుండగా, సర్వాలంకార శోభితుడైన శ్రీవారు వివిధ వాహనారూఢుడై మాడవీధుల్లో ఊరేగే మహత్తర ఘట్టాల సమాహారమే ''శ్రీవారి బ్రహ్మోత్సవాలు''. వాటి పూర్తి వివరాలు ఇపుడు తెలుసుకుందాం.



## పౌరాణిక నేపథ్యం

ఈ బ్రహ్మోత్సవాలను తొలిసారిగా సాక్షాత్తు బ్రహ్మదేవుడే తన తండ్రిగారైన, కలియుగంలో శ్రీవేంకటేశ్వరుని రూపంలో ఆవిర్భవించిన శ్రీమహావిష్ణువుకు జరిపించినట్లు భవిష్యోత్తర పురాణంలో చెప్పబడింది. అందుకే అవి ''బ్రహ్మోత్సవాలు''గా ప్రసిద్ధికెక్కాయి. అయితే, తిరుమలలో జరిగే మిగిలిన ఉత్సవాలతో పోలిస్తే ఇవి చాలా పెద్దయెత్తున జరుగుతాయి కాబట్టి వీటిని ''బ్రహ్మోత్సవాలు'' అంటారని కొందరు భావిస్తారు. ఏది ఏమైనా భక్తులను విశేషంగా ఆకర్షిస్తూ, మహమ్మదీయ, క్రైస్తవ పాలకుల హయాంలో కూడా నిరంతరాయంగా కొనసాగుతూ, ఈ ''బ్రహ్మోత్సవాలు'' తమ వైశిష్ట్యాన్ని చాటుకుంటున్నాయి.

**"నానా దిక్కుల నరులెల్లా**
**వానలలోనే వత్తురు గదలి..."**

అంటూ, అన్నమాచార్యుల వారు బ్రహ్మోత్సవాలను సందర్శించటానికి భక్తులు నలుదిక్కుల నుండి ఎండ వానలను లెక్కచేయకుండా, తండోపతండాలుగా ఎలా కదలి వస్తారో వివరించారు.

## చారిత్రక నేపథ్యం

చారిత్రకాధారాలు లభ్యమైనంతవరకూ, మొట్టమొదటగా బ్రహ్మోత్సవాల ప్రస్తావన 614 వ సంవత్సరంలో వచ్చింది. అప్పట్లో తమిళ నెల ''పెరటాసి'' మాసంలో జరిగే బ్రహ్మోత్సవాలలో భోగశ్రీనివాసుణ్ణి ఊరేగించేవారు. 966వ సంవత్సరంలో, పది రోజుల పాటు జరుపబడే బ్రహ్మోత్సవాల చివరి రోజును ''తీర్థవారి దినం''గా పిలిచేవారు. తరువాతి కాలంలో నిడివిని మరో రోజు పొడిగించి, 11వ రోజున ''విదయాత్ర'' పండుగ నిర్వహించేవారు. వివిధ పాలకుల హయాంలో ఈ బ్రహ్మోత్సవాలను వివిధ పేర్లతో పిలిచినప్పటికీ, రోజుల సంఖ్యలో కొద్ది మార్పులున్నప్పటికీ, ఈ ఉత్సవాలు దాదాపు 1400 సంవత్సరాలుగా తమ మౌలిక స్వభావాన్ని యథాతథంగా ఉంచుకోగలిగాయి. తెలుగు పల్లవరాజు విజయగండ గోపాలుడు ''ఆడితిరునాళ్ళు'' పేరుతోనూ, వీరప్రతాప దేవరాయలు ''మాసి తిరునాళ్ళు'' పేరుతోనూ, అచ్యుతరాయలు ''అచ్యుతరాయ బ్రహ్మోత్సవం'' పేరుతోనూ ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేవారు. 1583వ సంవత్సరంలో నెలకోసారి జరిగే బ్రహ్మోత్సవాలు, 1638 వ సంవత్సరంలో 11 సార్లు నిర్వహించబడ్డాయి. ఒక్కోసారి 3 నుంచి 5 రోజుల వరకూ ఈ ఉత్సవాలను జరిపించేవారు. బ్రహ్మోత్సవాల్లో ఏ రోజు ఏ వాహనం మీద స్వామిని ఊరేగించాలనే విషయం ఆగమ శాస్త్రంలో నిర్దిష్టంగా చెప్పబడలేదు. ఆయా కాలాల్లో అప్పటి నిర్వాహకులు, అర్చక స్వాములు కలిసి ఏయే వాహనాలను ఏయే రోజుల్లో ఉపయోగించాలో నిర్ణయించేవారు. కాలక్రమేణా ఉత్సవాల స్థాయి, వైభవం పెరుగుతూ, రోజుల సంఖ్య తగ్గుతూ వచ్చి, ప్రస్తుతం ఈ ఉత్సవాలను సంవత్సరానికోసారి, తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్నారు. అదే, అధికమాసం వచ్చిన సంవత్సరంలో మాత్రం రెండు సార్లు నిర్వహిస్తారు. ఆ వివరాలు తరువాత తెలుసుకుందాం.

## బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

పూర్వకాలంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా పంపించే ఆహ్వానం ఆసక్తికరంగా ఉండేది. శ్రీవారి ఆలయద్వారం ముందుగా పెద్ద శబ్దం వచ్చేటట్లుగా బాణాసంచా పేల్చేవారు.

తరువాత మహంతుల కాలంలో భక్తులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ, చుట్టుప్రక్కల పల్లెలు, పట్టణాలు, తిరుమల గ్రామంలో ''దండోరా'' వేసేవారు. ఈ మధ్య కాలం వరకూ తిరుమల గ్రామ ప్రజలు తమ ఇళ్ళను కొబ్బరి, అరటి, మామిడి ఆకులతో అలంకరించుకుని, దేవాలయాన్ని కూడా శోభాయమానంగా అలంకరించి, ఇతర గ్రామాల్లో ఉన్న తమ బంధుమిత్రులను స్వంత ఇంట్లో శుభకార్యానికి ఆహ్వానించినట్లు బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేవారు. దేవాలయ పరిశుభ్రత, భద్రత, యాత్రికులకు వసతి, భోజనం, మంచినీటి సౌకర్యం లాంటి ఏర్పాట్లన్నీ తిరుమల గ్రామప్రజలే స్వయంగా నిర్వహించేవారు.

## బ్రహ్మోత్సవాల్లో రకాలు

- నిర్ధారిత మాసంలో, నిర్ధారిత నక్షత్రంలో 3,5,7,9,11,13 రోజుల పాటు జరిగే వాటిని ''నిత్య బ్రహ్మోత్సవాలు'' అంటారు. ఇప్పుడు మనం చెప్పుకుంటున్నది ఈ బ్రహ్మోత్సవాల గురించే.
- కరువులు, వ్యాధులుచ, దుష్టగ్రహ కూటములు సంభవించినప్పుడు ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలను ''శాంతి బ్రహ్మోత్సవాలు'' అంటారు.
- భక్తులకెవరికైనా కోరిన కోర్కెలు నెరవేరిన సందర్భంగా, స్వంతధనం వెచ్చించి జరిపించుకునేవి ''శ్రద్ధా బ్రహ్మోత్సవాలు''. శ్రీవారి ఆలయంలో ప్రతిరోజూ జరిగే ''ఆర్జిత బ్రహ్మోత్సవాలు'' ఈ కోవలోకే వస్తాయి.
- ఇవన్నీ కాకుండా, తిరుమలలో సంవత్సరానికి ఒక్కరోజు మాత్రమే జరిగే మరో మూడు బ్రహ్మోత్సవాలున్నాయి. అవి రథసప్తమి నాడు జరిగే ''ఆర్షము'', కైశిక ద్వాదశి రోజున జరిగే ''రాక్షసం'', ముక్కోటి ఏకాదశి నాడు జరిగే ''దైవికం''.

## పుష్ప, విద్యుద్దీపాలంకరణ

బ్రహ్మోత్సవాల సందర్భంగా, ఉద్యాన వన విభాగ ఆధ్వర్యంలో తిరుమల ప్రధాన ఆలయాన్ని, ఉత్సవ వాహనాలను, పరిసరాలను, మాడ వీధులను, ఇతర దేవాలయాలను, మండపాలను, కూడళ్ళను, రహదార్లను రంగు రంగుల పుష్పాలతో శోభాయమానంగా అలంకరిస్తారు. ఇందు నిమిత్తం పోయిన బ్రహ్మోత్సవాల్లో సుమారు 40 టన్నుల సాంప్రదాయ పుష్పాలు, రెండు టన్నుల కట్ ఫ్లవర్స్, 50 వేల ఆ కాలంలో మాత్రమే దొరికే పుష్పాలను వినియోగించారు. ఇంతేకాకుండా వందలకొద్దీ విద్యుత్ కార్మికులు వారాల తరబడి శ్రమించి కళ్ళు మిరుమిట్లు గొలిపేలా; లక్షలాది విద్యుద్దీపాలతో అనేక పౌరాణిక పాత్రలు, భారత భాగవత ఘట్టాలు, వన్యప్రాణులు, దేవతలు మున్నగువాటిని ఆవిష్కరింపచేస్తారు.

## కళాకార్ల బృందాలు

వివిధ కళారూపాలతో స్వామివారిని కొలుస్తూ భక్తులకు కనువిందు చేయటం కోసం, 2019 బ్రహ్మోత్సవాలకు 18 రాష్ట్రాల నుండి, 357 బృందాలుగా, 8200 మంది కళాకారులు విచ్చేశారు. ఏటా ఈ సంఖ్య పెరుగుతూనే ఉంది. మాడవీధుల్లో స్వామివారి వాహనానికి ముందుండి ఈ కళాకారులందరూ వివిధ రకాల విన్యాసాలు, దేవతామూర్తుల వేషధారణ, అభినయం, కోలాట ప్రదర్శన, కోయనృత్యాలు, కూచిపూడి, భరతనాట్యం, అస్సాంకు చెందిన బిహు నాట్యం, ఉత్తరాఖండ్ కు చెందిన చోలియా నృత్యం, తమిళనాడుకు చెందిన టపాటం, గరగాటం, బయలాటం, సయ్యాండిమేళం, కొక్కిల్ ప్రదర్శనలతో భక్తులను అలరిస్తారు. దాదాపుగా భారతదేశంలో నుండే అన్ని కళారూపాలను మనం బ్రహ్మోత్సవాల సందర్భంగా, మాడ వీధులలో చూసి ఆనందించవచ్చు. ఆలయానికి నాలుగు ప్రక్కలా ఉన్న మాడవీధుల గ్యాలరీల్లో కూర్చుని సుమారు రెండు లక్షల మంది భక్తులు ఈ ఉత్సవాల్ని కన్నుల పండువగా వీక్షిస్తారు. వివిధ మాధ్యమాల ద్వారా ఈ ఉత్సవాల్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

## గజరాజుల సేవ

పద్మ, పెద్ద పద్మ, లక్ష్మి, మహాలక్ష్మి అనే నలుగురు గజరాజులను మావటీలు ముందుగా శుభ్రం చేసి, ముస్తాబు చేసి, శరీరం కాంతివంతంగా మెరిసిపోవడానికి నువ్వులనూనెతో మర్దనా చేస్తారు. వీటి నుదుటన తెల్లని నామాలు, మధ్య సిందూరంతో అలంకరించి ఆలయం వద్దకు తీసుకుని వస్తారు. అలాగే, అలంకరించిన వృషభాలను కూడా తోడ్కొని వస్తారు.

## నూతన గొడుగుల వితరణ

శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా చెన్నైకు చెందిన హిందూమహాసభ సభ్యులు గత ఎనిమిది సంవత్సరాలుగా శ్రీవారికి ఈ క్రింది వాటిని లాంఛన ప్రాయంగా సమర్పిస్తున్నారు.

- 12 జానల శ్వేత గొడుగులు 2
- 10 జానల పట్టు గొడుగులు 2
- 6 జానల శ్వేత గొడుగులు 3

ఈ గొడుగులన్నింటినీ వైభవోత్సవ మండపానికి తీసుకుని వచ్చి, అక్కడ నుండి ఆలయ అధికారులతో కలిసి వాటిని ఆలయం లోనికి తీసుకుని వెళతారు.

స్వామివారి వాహనానికి వెనుకగా, ''ఘటాటోపం''

అనబడే ఒక గుడారాన్ని పరిచారకులు మోసుకుంటూ వెళ్తారు. అకస్మాత్తుగా వర్షం వస్తే స్వామివారి వాహనానికి ఇది రక్షణ కల్పిస్తుంది.

## దర్భ సమర్పణ

బ్రహ్మోత్సవాల సందర్భంగా తి.తి.దే అటవీ శాఖాధికారులు, ఆలయ అధికారులకు దర్భను సమర్పిస్తారు. ధ్వజారోహణ పర్వంలో; ఆలయం నందు నిర్వహించే సేవలు, కైంకర్యాలు, హోమాల్లో ఈ దర్భను వినియోగిస్తారు. ఈ దర్భతో తయారు చేయబడిన చాప, తాడు ఊరేగింపుగా తీసుకొని వచ్చి ఆలయాధికారులకు అందజేస్తారు. ఈ దర్భను తిరుమలలోని కళ్యాణవేదికకు ఎదురుగా ఉండే తి.తి.దే అటవీ విభాగం నర్సరీల్లోనూ, తిరుపతి సమీపం నందున్న వడమాలపేట గ్రామంలోని పొలం గట్ల నుండి సేకరిస్తారు. ఇలా సేకరించిన దర్భలను 15 రోజులు నీడలో ఆరబెడతారు. ఆ దర్భతో తయారు చేసిన కొడితాడు, చాప, విడిగా సుమారు 10 కిలోల దర్భను అధికారులకు అందజేస్తారు.

## రవాణా సదుపాయాలు

తిరుపతి-తిరుమల మధ్య రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నడిపే తొలి బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించి, బస్సులన్నింటినీ అరటి పిలకలు, మామిడి తోరణాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరిస్తారు. బ్రహ్మోత్సవాల సమయంలో రోజుకు సుమారు 400 బస్సులతో, 2000 ట్రిప్పులతో, రెండు లక్షల మంది భక్తులను కొండపైకి చేరవేస్తారు. గరుడ వాహనం రోజున ఈ సంఖ్య దాదాపుగా రెట్టింపవుతుంది.

## భోజన సదుపాయాలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా నిత్యం సుమారు మూడు లక్షల మందికి ఉచిత భోజనం అందజేస్తారు. గరుడసేవ రోజున రాత్రి 1.30 గంట వరకూ భోజనాలు వడ్డిస్తుంటారు. ప్రధాన అన్నదాన కేంద్రమైన తరిగొండ వెంగమాంబ భవనంలోనే కాకుండా, తిరుమలలోని వివిధ కూడళ్ళలో కూడా అన్నదానం చేస్తుంటారు. భోజన ఏర్పాట్లు ఏ స్థాయిలో జరుగుతాయంటే క్రితం బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ రోజున రెండు లక్షల పులిహోర పొట్లాలు, లక్షా డెబ్భై అయిదు వేల పళ్ళాల టమాటా అన్నం, సాంబారన్నం సరఫరా చేశారు. మొత్తం 32,500 కిలోల బియ్యం, 20 వేల లీటర్ల పాలు, 8000 కిలోల ఉప్మా రవ్వను ఉపయోగించారు. దాదాపుగా ఈ మొత్తం సరుకుల్ని దాతలే సమకూర్చారు.

## వివిధ భాగాల సేవలు

వేలకొద్దీ పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం శ్రమిస్తూ, పరిశుభ్రతకు పెద్దపీట వేస్తారు. అలాగే డజన్ల కొద్దీ వైద్యసిబ్బంది అహోరాత్రాలు వైద్యసేవల నందిస్తుంటారు. వేలకొద్దీ పోలీసులతో బాటుగా, వందలాది మంది ఆలయ సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేస్తారు. వేలాదిమంది శ్రీవారి సేవకులు, స్కౌట్లు క్యూల నిర్వహణతో పాటు, భక్తులకు ఇతర సేవల నందిస్తుంటారు. ''వాహన బేరర్లు'' రెండు పూటలూ కలిపి సుమారుగా రోజుకు ఐదు గంటల పాటు స్వామివారి వాహనాల్ని మోస్తుంటారు. బ్రహ్మోత్సవాల్లో లడ్డూ మొదలగు ప్రసాదాల్ని కూడా భారీగా తయారు చేయిస్తారు.

## ఉత్సవాలు, ఊరేగింపులు ఎందుకు జరుగుతాయి?

అశౌచం, అంగవైకల్యం, అనారోగ్యం, వృద్ధాప్యం, సమయాభావం లేదా మరే ఇతర కారణాల చేతనైనా గుడిలోని దేవుణ్ణి దర్శించుకోలేని వారికోసం దైవమే స్వయంగా, ఉత్సవమూర్తుల రూపంలో, ఆలయం వెలుపలి కేతెంచి భక్తులను అనుగ్రహించటం కోసం; ఆగమ శాస్త్రానుసారం ఉత్సవాలు, ఊరేగింపులు ప్రవేశ పెట్టబడ్డాయి. దేవతలు, గంధర్వ, యక్ష, కిన్నెర, కింపురుషులు, మానవులే కాకుండా అనేక వన్యమృగాలు, పక్షులు కూడా స్వామివారి సేవలో తరించాయి. అవి వేర్వేరు సమయాల్లో స్వామివారికి సమర్పించిన సేవలకు గుర్తుగా బ్రహ్మోత్సవాల్లో స్వామివారు జంతు మరియు ఖగ (పక్షి) వాహనాలపై ఊరేగుతారు.

## తిథి – నక్షత్రాలు

సాధారణంగా ప్రతి ఆలయంలో ఉత్సవాలను ప్రారంభ తిథికి అనుగుణంగా మొదలు పెడతారు. కాని తిరుమలలో మాత్రం ముగింపు రోజును పరిగణన లోనికి తీసుకుని ఉత్సవాలను ప్రారంభించే సాంప్రదాయం అనాదిగా ఉంది. కన్యారాశిలో శ్రవణా నక్షత్రం నాడు ''అవభృధము'' లేదా ''చక్రస్నానం'' నిర్ణయించి, దానికి తొమ్మిది రోజుల ముందుగా బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తారు. సాధారణ సంవత్సరాల్లో – అంటే అధికమాసం లేని సంవత్సరాల్లో – ఈ బ్రహ్మోత్సవాలు ఆశ్వయుజ మాసమందు దసరా నవరాత్రుల్లో ఒక్కసారి మాత్రమే వస్తాయి. వీటిని ''సాలకట్ల బ్రహ్మోత్సవాలు'' అంటారు. ఉత్తర భారతీయ భాషల్లో ''సాల్'' అంటే సంవత్సరం. ''కట్ల'' లేదా ''కట్టడి'' అనే తెలుగు పదానికి ''సాంప్రదాయం'' అని అర్థం. మహంతుల కాలం నుండి ఈ పదం వాడుక లోనికి వచ్చింది.

అదే అధికమాసం వచ్చిన సంవత్సరాల్లో బ్రహ్మోత్సవాలు

రెండుసార్లు జరుగుతాయి. ఈ సంవత్సరాల్లో కన్యాశ్రవణం భాద్రపద మాసంలో వస్తుంది. ఈ మాసంలో జరిగే బ్రహ్మోత్సవాలను ''వార్షిక బ్రహ్మోత్సవాలు'' అని పిలుస్తారు. ఇవి ముఖ్యమైనవి. ఆ సంవత్సరంలో రెండవసారి, ఆశ్వయుజ మాసంలో జరిగే ఉత్సవాలను ''నవరాత్రి బ్రహ్మోత్సవాలు''గా పిలుస్తారు. ఈ సందర్భంలో అధికమాసం గురించి కొద్దిగా చెప్పుకోవాలి.

తమిళులు ఎక్కువగా అనుసరించే, సంవత్సరానికి 365 రోజులు గల సౌరమానంలో అధిక మాసాలు లేవు. కానీ తెలుగువారు అధికంగా అనుసరించే చాంద్రమానంలో సంవత్సరానికి 354 దినాలు. అంటే చాంద్రమాన సంవత్సరం. సౌరమాన సంవత్సరం కంటే 11 రోజులు తక్కువగా ఉండడంతో చాంద్రమానంలో సూర్యసంక్రమణం లేని మాసం వస్తుంది. అదే అధికమాసం. సౌరమానం మరియు చాంద్రమానాన్ని సమన్వయ పరచడం కోసం ఏర్పాటు చేయబడిన ఈ అధికమాసం ప్రతి మూడవ సంవత్సరంలో వస్తుంది. ఇలా సమన్వయించకపోతే, ఋతుచక్రం కొంత కాలానికి గతి తప్పుతుంది.

సాలకట్ల బ్రహ్మోత్సవాలు మరియు వార్షిక బ్రహ్మోత్సవాలు, ''అంకురార్పణ'', ''ధ్వజారోహణం'' తో ప్రారంభమై ''ధ్వజావరోహణం''తో ముగుస్తాయి. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఇవి ఉండవు. ఇంకో ముఖ్యమైన తేడా ఏమిటంటే వార్షిక బ్రహ్మోత్సవాల్లో రథోత్సవానికి ''కొయ్యతేరు''ను ఉపయోగిస్తారు. అదే, నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో కొయ్యతేరుకు బదులు మొదట్లో వెండి రథాన్ని, ప్రస్తుతం బంగారు రథాన్ని ఉపయోగిస్తున్నారు.

## బ్రహ్మోత్సవాల పరమార్థం

బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు జరిగే అంకురార్పణ పర్వం నుండి తొమ్మిదవ రోజున జరిగే చక్రస్నానం వరకు జరిగే ప్రతి వేడుక, ప్రతి ఉత్సవం, స్వామివారు అధిరోహించే ప్రతి వాహనం సందేశాత్మకమే. వాహనాలపై విహరించే మలయప్పస్వామిని దర్శించుకుంటే అశ్వమేధయాగం చేసినంత ఫలితం వస్తుందని పురాణాల్లో చెప్పబడింది.

## అంకురార్పణ ఘట్టం

ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాల యందు అర్చకుల్లో ఒకరిని ''కంకణ భట్టాచార్యులు''గా నియమిస్తారు. అంకురార్పణ ఘట్టం నుండి చక్రస్నానం వరకు వాహనసేవల్లో, యాగశాలలో, ఇతర పూజాదికాల్లో ఆయనే ప్రధాన పాత్ర వహిస్తారు. ఆగమ శాస్త్రం ప్రకారం ఉత్సవాలు పూర్తయ్యేంత వరకు వీరు పొలిమేర దాటి వెళ్ళరాదు.

వైఖానస ఆగమ సాంప్రదాయ క్రతువుల్లో తలపెట్టిన కార్యక్రమం విజయవంతం కావటం కోసం తొలిగా జరిపించే ''అంకురార్పణం'' లేదా ''బీజావాపనం'' అత్యంత ముఖ్యమైన ఘట్టం.

ఈ ఘట్టం ఆరంభంలో, స్వామివారి సేనాధిపతి అయిన విష్వక్సేనుడు నాలుగు మాడ వీధుల్లో ఊరేగే సన్నివేశాన్ని అన్నమయ్య ఇలా వర్ణించాడు –

**"అది వచ్చె నిది వచ్చె నచ్యుత సేనాపతి**
**పది దిక్కులకు నిట్టె పార లో యసురులు"**

తాత్పర్యమేమంటే, ''విష్ణుదేవుని యొక్క సేనాధిపతి అయిన విష్వక్సేనుని రాక దానవులందరికీ భయం కలిగించింది''.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావడానికి ముందురోజున, విష్వక్సేనుల వారు పంచాయుధ ధారియై తన తిరుచ్చి వాహనంపై ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి నాలుగు మాడ వీధుల్లో బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తారు. ఇందులో భాగంగా పడమర వీధిలోని నైఋతి మూలన ఉన్న వసంత మండపంలోకి విచ్చేస్తారు. ఆ తరువాత నిర్ణీత ప్రదేశంలో భూదేవి ఆకారాన్ని చిత్రించి, అందులోని లలాట, బాహు, స్తన ప్రదేశాల నుండి మట్టిని తీసి ఆలయం లోనికి తీసుకు వస్తారు. దీన్నే ''మృత్సంగ్రహణం'' లేదా ''పుట్టమన్ను సేకరించటం'' అంటారు. ఆలయంలోని యాగశాలకు సమీపంలో అంకురార్పణ జరిగే ప్రదేశాన్ని ముందుగా ఆవుపేడతో శుద్ధి చేసి, తరువాత సేనాధిపతికి ఆ ప్రదేశంలో ''బ్రహ్మపీఠాన్ని'' ఏర్పాటు చేస్తారు. తదుపరి, అగ్ని ద్వారా – బ్రహ్మ, గరుడ, శేష, సుదర్శన, సోమ, శంత, ఇంద్ర, ఇసాన, జయ – దేవతలను ఆహ్వానిస్తారు. ముందుగా సేకరించినటువంటి మట్టితో నింపిన 9 పాళికల్లో శాలి, వ్రీహి, యవ, ముద్గ (పెసలు), మాష (మినుములు), ప్రియంగు (కొర్రలు) వంటి నవధాన్యాలను చల్లి, వరుణ మంత్రాన్ని పఠించి నీరు చిలకరిస్తారు. ఈ పాళికలను నూతన వస్త్రాలతో అలంకరించి పుణ్యాహవచనం చేస్తారు. ప్రతిరోజూ ఈ పాళికల్లో నీరు పోస్తూ పచ్చగా మొలకలు వచ్చేలా చూస్తారు. అందుకే ఇది ''అంకురార్పణ కార్యక్రమం''గా పిలువబడుతుంది. ఈ కార్యక్రమానికి సోముడు లేదా చంద్రుడు అధిపతి. పాళికల లోని నవధాన్యాలు శుక్లపక్ష చంద్రునిలా దినదినాభివృద్ధి చెందాలని ప్రార్థిస్తారు. ఆ తరువాత సోమరాజ మంత్రాన్ని, విష్ణుసూక్తాన్ని పఠిస్తారు. ఖగోళ శాస్త్రానుసారం ఔషధాధిపతి చంద్రుడు కాబట్టి, రాత్రి సమయంలోనే విత్తనం నాటడం ఆనవాయితీగా వస్తోంది. ఇలా వేడుకగా, శాస్త్రయుక్తంగా సమకూరే అంకురార్పణ కార్యక్రమంతో స్వామివారి బ్రహ్మోత్సవ వేడుకలు మొదలవుతాయి.

**(సశేషం)**





# మంత్రాలయ శ్రీ రాఘవేంద్ర స్వామి

**– ప్రొ.జి.వి.ఎస్.రెడ్డి**

మంత్రాలయము! ఈ పేరు వినిన మరుక్షణము భక్తుల మనస్సునందు తెలియని ఒక విధమైన భక్తి, ఉద్రేకములతో కూడిన అవ్యక్తానందము కలుగును. ఈ ఆనందమునకు కారణము ఏమనగా ఈ క్షేత్రపు ఇతిహాసము నిన్న మొన్నటిది కాదు. నాలుగు యుగములకు సంబంధించినది. కావుననే ఈ క్షేత్రము ఇంతటి మహిమచే కూడుకుని యున్నది.

కృతయుగమునందు భాగవతోత్తములు అయినటువంటి శ్రీ ప్రహ్లాదరాజుల వారు, తండ్రియైన హిరణ్యకశిపునకు శ్రీనరసింహ దేవుని దర్శనము చేయించుట ద్వారా శ్రీహరి యొక్క మహిమను ప్రపంచమునకు చాటి చెప్పినారు. ఆ సందర్భమునందు శ్రీ ప్రహ్లాదరాయలవారు ఈ క్షేత్రమునందు యజ్ఞమును గావించిరి. ఆ స్థలమునందే నేడు శ్రీ గురురాయల వారి బృందావనము ఉన్నది. హిరణ్యకశిపుడు మరియు హిరణ్యాక్షుడు తపస్సు గావించి, పరమశివుని సాక్షాత్కరింప చేసుకున్న సంఘటనలు కూడా మంత్రాలయ పరిసర ప్రాంతముల యందు సంభవించినవి. ఈ విధముగా ఈ క్షేత్రమున శ్రీ ప్రహ్లాదరాజుల వారి చరిత్రకు సంబంధించిన సంఘటనలు సంభవించినవి.

త్రేతాయుగములో శ్రీరామచంద్రమూర్తి వనవాసము చేయు సందర్భము నందు మంత్రాలయ క్షేత్ర పరిసర ప్రాంతముల యందునూ సంచరించి ఉన్నారు. ఈ విధముగా సంచరించుచూ మంత్రాలయము నుండి 8 కిలోమీటర్ల దూరములో ఉన్నటువంటి మాధవరం (మహాద్వారము) ప్రాంతము నందు గల ఒక శిలపై కొద్దిసేపు విశ్రాంతిని పొందినారు. ఆ సందర్భమునందే శ్రీరామచంద్రమూర్తి మంత్రాలయము నందు శ్రీరామలింగేశ్వరుని ప్రతిష్ఠించినారు.

మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి ప్రహ్లాదుని అవతారంగా శిష్యకోటి పూజిస్తారు. తమిళనాడులోని కుంభకోణంలో మధ్వ పీఠాధిపతిగా ఉంటూ అనేక ప్రాంతాలలో యాత్రలు చేశారు. ఈయన శ్రీ పంచముఖ ప్రాణదేవరు (పంచముఖ హనుమంతుని) పరమభక్తుడు. వీరు మంత్రాలయంలో 1671లో జీవసమాధి పొందారు. రాబోయే 800 సంవత్సరాలు తాను జీవించి ఉంటానని శిష్యకోటికి సూచించారు.

**పూజ్యాయ రాఘవేంద్రాయ సత్య ధర్మ రతాయచ**
**భజతాం కల్పవృక్షాయ నమతాం కామధేనవే**

అని ప్రస్తుతించబడే రాఘవేంద్రస్వామి ద్వైత సిద్ధాంత పరంపరలో వెలసిన పరమ గురుదేవులు మధ్వాచార్యులు ప్రబోధించిన ద్వైత సిద్ధాంతాన్ని అవలంబించి అశేష శిష్యగణాలను తరింపచేశారు.

తమిళనాడు లోని భువనగిరిలో తిమ్మన్నభట్టు, గోపికాంబల రెండవ సంతానంగా వెంకన్నభట్టు జన్మించారు. వీరి జననం 1598 లేదా 1601 అనే వాదనలు వినిపిస్తున్నాయి. కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వరుని అనుగ్రహంతో జన్మించాడని

వేంకటనాథుడని, వేంకటాచార్య అని పిలిచేవారు. ఈయన మధురైలో తన బావగారైన లక్ష్మీ నరసింహచారి వద్ద తొలుత విద్య నభ్యసించారు. ఆ తర్వాత కుంభకోణంలో శ్రీమఠంలో విద్యార్థిగా చేరారు. 1614 లో సరస్వతీబాయితో వివాహం జరిగింది. వీరికి లక్ష్మీనారాయణాచార్య అని పుత్రుడు కలిగాడు.

ఆ తరువాత కుటుంబం అంతా కుంబకోణాన్ని చేరుకుంది. అక్కడ సుధీంద్ర తీర్థుల వద్ద వైదిక శాస్త్రాలలో పట్టు సాధించారు. అధ్యయన అధ్యాపనాలు కొనసాగిస్తూ శిష్యులకు బోధించసాగారు. సంగీత సాధన చేసి గొప్ప వైణికులయ్యారు. క్రమంగా సన్యాసం స్వీకరించారు. తర్వాత గురు మఠం బాధ్యతలను స్వీకరించారు. పీఠాధిపతిగా దక్షిణ దేశ యాత్రలు విజయం చేసి వేదాంత ప్రబోధం చేశారు. మార్గమధ్యంలో శిష్యులకు అనేక అద్భుతాలు ప్రదర్శించారు. మధ్వాచార్యులు ప్రబోధించిన ద్వైత సిద్ధాంతాన్ని ప్రబోధించారు. తర్కాలలో తనకంటే వయసులో పెద్దవారిని కూడా ఓడించారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని పంచముఖి వద్ద అనేక సంవత్సరాలు తపస్సు చేశారు. ఆయన దీక్షకు మెచ్చి పంచముఖ ఆంజనేయుడు ప్రసన్నుడై ప్రత్యక్షమయ్యాడు. అక్కడినుండి పవిత్ర తుంగభద్రా నది క్షేత్రమైన మంత్రాలయానికి వచ్చారు. ఆదోని నవాబు సిద్దిక్ మసూద్ ఖాన్ నుంచి మంచాల కమాండ్ని దానంగా పొందారు. ఒక బండరాయి సీతారాములకు విశ్రాంతి నిచ్చిందని ఇతిహాసము. ఆ బండరాయి 700 సంవత్సరాలు పూజలందుకుంటుందని, ఆ రాయితోనే తన బృందావనం ఏర్పాటు చేయమని రాఘవేంద్రస్వామి అప్పటి దివాన్ వెంకన్నాచారిని కోరారట. అదే ప్రకారం మాధవరం దగ్గర ఉన్న ఆ రాయితోనే స్వామివారి బృందావనం నిర్మించారు. ఆ బృందావనాన్ని అశేష భక్తజన సందోహం దర్శించి నేటికీ తరిస్తున్నారు. రాఘవేంద్ర తీర్థులు, సుధాపరిమళాచార్యులు అని కూడా వీరిని సంబోధిస్తారు. వీరు 1661-1971 మధ్యకాలంలో పీఠాధిపతి.

మంత్రాలయం ఒకప్పుడు మారుమూల గ్రామం. దానిని మంచాల గ్రామం అని పిలిచేవారు. ఆదోని నవాబు పాలనలో ఉండేది. మధ్వమఠంలో సన్యాసం స్వీకరించిన రాఘవేంద్రస్వామి అక్కడున్న మూలరాముడిని సేవిస్తూ మంత్రాలయానికి వచ్చారు. అక్కడే తాను జీవ సమాధి బృందావనస్తులయ్యే సంకల్పం కలిగింది.

వీరు రచించిన వ్యాసతీర్థ గ్రంథ వ్యాఖ్యలు పాండితీస్ఫోరకాలు. ఉపనిషత్తులను ద్వైత సిద్ధాంత పరంగా ఆవిర్భవించిన తీరు అద్భుతం. పూర్వ మీమాంసకు వీరి ప్రామాణిక సమన్వయము పండితులకు మార్గదర్శి వేణుగోపాల్ అనే నామంతో ఎన్నో కీర్తనలు రచించారు. 1663 లో మైసూరు వెళ్ళి అక్కడే మహారాజా దొడ్డదేవరాయ వడయారు వద్ద సన్మానితులై దానం స్వీకరించి చివరికి మంత్రాలయంలో స్థిరపడ్డారు. వారి వంశ ప్రతిష్ఠ గొప్పది. ఆయన ప్రపితామహులు కృష్ణభట్టు విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయలకు విద్యను బోధించారు. తాతగారు కనకాచారిభట్టు, ప్రసిద్ధపండితులగు తండ్రి తిమ్మనభట్టు సంగీత సాహితీ నిధి ఆయన రాఘవేంద్ర స్వామి చిరువయసులో ఉండగానే పరమపదించారు. ఈ విధమైన వంశ ప్రతిష్ఠ గల గురు రాఘవేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు మంత్రాలయంలో ఆగస్టులో వైభవంగా జరుగుతాయి.

మంత్రాలయం పవిత్ర తుంగభద్రానది ఒడ్డున వెలసింది. రాఘవేంద్ర స్వామి ద్వైత సిద్ధాంత పరంపరలో వెలసిన పరమ గురువు. మధ్వాచార్యులు ప్రబోధించిన ద్వైత సిద్ధాంతాన్ని అవలంబించారు. రాఘవేంద్రస్వామి ప్రఖ్యాతి చెందిన మధ్వ సన్యాసి మరియు ఆధ్యాత్మికవేత్త. స్వామివారు 1595 నుండి 1674 వరకు భక్తులను ఆధ్యాత్మికంగా అలరించారు. మహిమలు కలిగిన స్వామి అనే నమ్మకం భక్తులలో ఉంది. ఈయనను ప్రహ్లాద అవతారమని శిష్యకోటి పూజిస్తారు. వారి కష్టాలను తీర్చి శాంతిని, అపార ఐశ్వర్యాలను ప్రసాదించే దైవంగా భావిస్తారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనా ఉత్సవాలు మంత్రాలయంలో ఆగస్టు 18 నుండి 24 వరకు జరుగుతాయి. ఈ ఉత్సవాలు గురు రాఘవేంద్రస్వామివారి బృందావన ప్రవేశాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు, ఊరేగింపులు ఉంటాయి.


**ముఖ్య ఉత్సవ తేదీలు :** ఆగస్టు 18 నుండి 24 వరకు.

**ముఖ్య కార్యక్రమాలు :** పూజ, శతోత్సవము, రజిత మండపోత్సవం, ఋగ్వేద, యజుర్వేద ఉపాకర్మలు, పూర్వారాధన, మధ్యా ఆరాధన, మహా రథోత్సవం, జ్ఞానేంద్ర తీర్థుల ఆరాధన, సర్వసేవ స్ఫోరణ.

మంత్రాలయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కర్నూలు జిల్లాలోని ఒక పుణ్యక్షేత్రం. ఇది తుంగభద్రానది ఒడ్డున ఉన్నది. ఇక్కడ శ్రీ రాఘవేంద్ర స్వామివారి జీవ సమాధి ఉన్నది. దీనిని భక్తులు అధిక సంఖ్యలో సందర్శిస్తారు. రాఘవేంద్ర స్వామి 17వ శతాబ్దంలో జీవించిన గొప్ప తత్త్వవేత్త మరియు సాధువు. ఆయన ద్వైత వేదాంతం అనుసరించారు. మరియు శ్రీ మధ్వాచార్యుల బోధనలు వ్యాప్తి చేశారు.

**సౌకర్యాలు :** మంత్రాలయంలో భక్తుల కోసం భోజన వసతి సదుపాయాలు ఉన్నాయి. ఇక్కడకు రావడానికి కర్నూలు నుండి బస్సులు, రైళ్ళు అందుబాటులో ఉన్నాయి.

**సందర్శన సమయం:** మంత్రాలయాన్ని ఎప్పుడైనా సందర్శించవచ్చు. అయితే పండుగరోజు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది.




# సచికేతుడు తెలుసుకున్న ఆత్మ వివరాలు

– కౌతా నిర్మల

సచికేతుని గురించి కఠోపనిషత్తులో తెలియచేయబడింది. గౌతముని కుమారుడు సచికేతుడు. గౌతముడు విశ్వజిత్ అనే యజ్ఞం చేస్తున్నాడు. ఆ యజ్ఞ నియమాన్ని బట్టి తనకున్న సమస్తం దానం చేయాలి. గౌతముడు నిరుపయోగమైన, నిర్బలమైన గోవులను దానం చేశాడు. అవి ముసలి గోవులు. శక్తిహీనమైనవి. తండ్రి చేసినది అనుచిత దానం అనిపించించి సచికేతునికి.

అతడు తండ్రి వద్దకు వెళ్ళి, ''నాన్నగారూ మీరు ఈ యజ్ఞంలో సమస్తం దానం చేయాలి కదా, మీ సమస్తంలో నేనూ ఒక భాగమే కదా. మరి నన్ను కూడా దానం చేయండి'' అన్నాడు ఎంతో వినమ్రంగా.

గౌతముడు కొడుకు మాటలను అస్సలు పట్టించుకోలేదు. అయినప్పటికీ సచికేతుడు మళ్ళీ మళ్ళీ అవే మాటలు వల్లించాడు. ఆ మాటలు విన్నా, విననట్లే గౌతముడు మౌనంగా ఉన్నాడు. తిరిగి అవే మాటలు చెప్తూ, 'నన్నెవరికి దానం చేస్తారు, చెప్పండి నాన్నగారూ' అని అడిగాడు.

కొడుకు ప్రశ్నకు చిరాకుతో ''నిన్ను మృత్యుదేవతకు దానం ఇస్తాను'' అన్నాడు గౌతముడు.

తండ్రి మాటను నెరవేర్చాలనే నిర్ణయంతో సచికేతుడు యముని నగరానికి వెళ్ళాడు. అప్పుడు యమపురిలో యముడు లేడు. యముని కోసం సచికేతుడు ఎదురు చూడసాగాడు. మూడు రోజుల తర్వాత యముడు తన నగరానికి చేరుకున్నాడు. యమధర్మరాజు సచికేతుని చూసి ''మూడు రోజుల నుంచి నా కోసం నిరీక్షిస్తూ నిరాహారంగా ఉన్నందుకు నన్ను మన్నించు. నీకు వెంటనే ఆతిథ్యం ఇవ్వలేకపోయాను. అందుకు పరిహారంగా నీకు మూడు వరాలను ఇస్తాను కోరుకో'' అన్నాడు.

''అలాగే దేవా కోరుకుంటాను. మొదటిది ఏమిటంటే నేను ఇంటికి వెళ్ళేసరికి నా తల్లితండ్రులు, నేను వాళ్ళకు చెప్పకుండా ఇల్లు వదిలి వెళ్ళినందుకు నా పట్ల ఆగ్రహించకుండా, శాంతంగా ఉండేలా వరం ఇవ్వండి'' అన్నాడు సచికేతుడు.

''సచికేతా! నీ కోరిక తప్పక నెరవేరుతుంది. నీ తల్లితండ్రులు నీ పట్ల ప్రసన్నంగా ఉంటారు'' అని వరమిచ్చాడు యముడు.

''స్వర్గంలో ఆకలి దప్పులు ఉండవు. వృద్ధాప్యస్థితి ఉండదు. మరణ భయం ఉండదు. బాధలు, కష్టాలు, దుఃఖం ఉండవు. అలా స్వర్గంలో ఉండాలంటే 'అగ్ని చయనం' అనే యజ్ఞాన్ని

నిర్వర్తించాలని అంటారు. ఆ అగ్నిచయనం యజ్ఞాన్ని ఎలా చెయ్యాలో నాకు వివరించండి యమదేవా, ఇది నా రెండవ కోరిక'' అనడిగాడు సచికేతుడు.

''తప్పకుండా సచికేతా, ఆ యజ్ఞం గురించి, ఆ యజ్ఞం చేయవలసిన విధానాన్ని గురించి నీకు వివరిస్తాను'' అని నరకలోకాధిపతి ఆ యజ్ఞాన్ని గురించి, చేయవలసిన విధానాన్ని గురించి సచికేతునికి వివరంగా తెలియజేశాడు.

''నా పట్ల కరుణ చూపించి రెండు వరాలు ప్రసాదించినందుకు మీకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఇక మూడవది, ఆఖరుది అయిన కోరిక ఇది. మనిషి మరణం తరువాత ఏమవుతాడు? శరీరానికి ఆత్మ ఉంటుందనీ, శరీరంలోంచి ప్రాణం పోయినా, ఆత్మ ఉంటుందని పెద్దలు అంటుంటారు. మరికొందరు పెద్దలు ఆత్మ లేదంటారు. నిజానికి ఆత్మ ఉన్నదా లేదా? ఉంటే ఆ ఆత్మను గురించి తెలుసుకోవాలని కోరుకుంటున్నాను'' అని అడిగాడు సచికేతుడు.

అతని ప్రశ్న విన్న యమధర్మరాజు వెంటనే సమాధానం ఇవ్వలేదు. కొంతసేపటి తర్వాత ''ఈ విషయం ఎంతో సూక్ష్మమైనది. ఈ విషయంలో దేవతలు కూడా సందిగ్ధస్థితిలో ఉండి, ఒక నిర్ణయానికి రాలేకపోయారు. సచికేతా నీకు స్వర్గసుఖాలు, భౌతికమైన ఆనందాలు ఎన్నైనా ఇస్తాను కానీ ఇది తప్ప ఇంకేదైనా వరం కోరుకో'' అన్నాడు.

తాను ఆ విషయాలు తెలుసుకోవలసిందేనని సచికేతుడు మొండిపట్టు పట్టడంతో, యమధర్మరాజు సచికేతునితో ''మనిషికి శ్రేయోమార్గం, ప్రేమమార్గం అని రెండు మార్గాలున్నాయి. మొదటిది నివృత్తి మార్గం, రెండవది ప్రవృత్తి మార్గం. నిగ్రహం లేని మానవుడు జనన మరణ చక్రంలో చిక్కుకుంటాడు. నిగ్రహంతో ప్రవర్తిస్తే జనన మరణ చక్రమనే మార్గాన్ని వదిలేసి అమృత తత్త్వాన్ని చేరుకుంటాడు. సృష్టి మొదలైనప్పటినుంచి ఆత్మ మనసుతో, ఇంద్రియాలతో, బాహ్య ప్రపంచంతో పరిచయం పొందుతుంది. అంతర్ముఖుడైనవాడు మెలకువలో, నిద్రలో తనని తాను తెలుసుకోగలుగుతాడు. ఆత్మ అన్నిటికీ ఆధారమని గ్రహించగలుగుతాడు.

ఆ విషయాన్ని తెలుసుకోవడం వల్ల దుఃఖాన్నుంచి విముక్తి పొంది. ఆనందంగా ఉంటాడు. ఆత్మకు రూపం ఉండదు. ఆత్మను ఎవ్వరూ చూడలేరు. ఆత్మ ఆది మధ్యాంత రహితం. ఈ సత్యాన్ని గ్రహించిన మానవుడు మృత్యువుని జయిస్తాడు. మానవులు నిద్రిస్తున్నప్పుడు కూడా ఆత్మ మేలుకునే ఉంటుంది. దీన్నే పరబ్రహ్మం అంటారు. ఆత్మ జీవులందరిలోనూ వేర్వేరు రూపాల్లో ఉంటుంది. పరమాత్మ మానవులలో అంతరాత్మగా ఉంటాడు. ఆ పరమాత్మ తనలోనే ఉన్నాడని తెలుసుకున్నవాడు జ్ఞాని. అటువంటి జ్ఞాని శాశ్వతానందాన్ని పొందుతాడు. పరమాత్మను ఆత్మలో చూడగలిగినవారు శాంతి, ఆనందంతో ఉండగలుగుతారు''.

''యమధర్మరాజా! అనిర్వచనీయమైన ఆ పరబ్రహ్మను, ఆ ఆనందాన్ని నేను ఎలా తెలుసుకోగలుగుతాను? అది వెలుగులో ఉంటుందా, స్వయంగా ప్రకాశిస్తుందా?'' అని అడిగాడు సచికేతుడు.

''సచికేతా! పరమాత్మ వెలుగులోనే సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, మెరుపులు, అగ్ని ప్రకాశిస్తాయి. ఆత్మ మిక్కిలి ప్రకాశవంతమైనదని తెలుసుకున్నవారు జనన మరణాలలో చిక్కుకోకుండా అమృత తత్త్వాన్ని పొందుతారు. ఆ పరబ్రహ్మని దేహం నశించకముందే తెలుసుకోగలిగినవారు బంధాల నుంచి విముక్తి పొందుతారు. అలా కానప్పుడు జన్మలు, జనన మరణాలు తప్పవు. శరీరంలో ఉన్న పరమాత్మ పితృలోకంలో స్వప్నం లాగా, గంధర్వలోకంలో నీటిలోని ప్రతిబింబం గానూ, బ్రహ్మలోకంలో వెలుగు నీడలుగా కనిపిస్తుంది. ఇంద్రియాలకు లోబడకుండా ఉండేవాడు ఉత్తమ జ్ఞాని అవుతాడు.

ఇంద్రియాలకన్నా మనస్సు గొప్పది. మనస్సు కంటే బుద్ధి విశిష్టమైనది. బుద్ధి కంటే విశ్వాత్మ ఉత్తమమైనది. విశ్వాత్మకంటే అవ్యక్త ప్రకృతి ఉన్నతమైనది. అవ్యక్త ప్రకృతి కంటే పరమపురుషుణ్ణి తెలుసుకోగలిగిన మనిషి అమృతత్వాన్ని పొందుతాడు. ఆ పరమపురుషుడిని మనోనేత్రంతో దర్శించేవారికి, మనస్సును శాసించే బుద్ధికి మాత్రమే కనబడి, వారికి జనన మరణాలు లేకుండా చేస్తాడు. ఇంద్రియాలను, మనో వికారాన్ని నిగ్రహించగలిగినవాడు యోగి అవుతాడు.

ఆత్మను ఎవ్వరూ దర్శించలేరు. మనిషి మనోవాంఛ లేకుండా, కోరికలను అరికట్ట గలిగి, వాటిని నశింపచేసుకుంటే శరీరం ఉండగానే బ్రహ్మత్వాన్ని పొందుతాడు. మానవుడు బ్రతికుండగానే తన బంధాల నుంచి విముక్తి పొందగలిగితే అతను మరణం లేనివాడవుతాడని వేదాంత శాస్త్రం బోధిస్తోంది. మనిషి శరీరంలో నూట ఒక్క గతులున్నాయి. వాటిలో ఒకటి శిరస్సులోకి ప్రయాణిస్తుంది. దాని ద్వారా ఆ మనిషి అమృతత్వాన్ని పొందుతాడు. మిగిలిన నాడులన్నీ శరీరంలో అన్ని వైపులకూ ప్రయాణిస్తూ, క్రమేపీ అంతరించిపోతాయి. సాధనతో మానవుడు మాత్రమే ఆత్మను గురించి తెలుసుకోగలుగుతాడు. అందుకే సమస్త జీవులలోకి మానవజన్మ ఉత్తమమైనది''.

యమధర్మరాజు చెప్పినదంతా సచికేతుడు శ్రద్ధగా, ఆసక్తిగా ఆలకించాడు. అతడు మృత్యువును జయించి బ్రహ్మత్వాన్ని పొందాడు. కఠోపనిషత్తులో చెప్పబడిన ఆత్మజ్ఞానాన్ని అభ్యసించి, దాన్ని అనుభూతి పొందినవారు జీవన్ముక్తులవుతారు. జనన మరణాల చక్రంలో చిక్కుకోకుండా, బ్రహ్మజ్ఞానులై, ఆత్మతత్త్వాన్ని పొందుతారు.

# నవవిధ భక్తిమార్గాలు

– డా|| కూర్మాచలం శంకరస్వామి



## సఖ్యభక్తి

నవవిధ భక్తిమార్గాలలో సఖ్యభక్తి ఒకటి. భగవంతుని కథలు మొదట శ్రవణం (వినడం) చేయడం, వాటిని విని నోరారా అతనిని కీర్తించడం, తరువాత మనసులో ఆ నామ విశేషాలను స్మరించడం తరువాత ఆ స్వామికి పాదసేవనం చేయడం, ఆ విరాట్పురుషునికి వందనం చేసి అర్చించడం, ఆ దేవదేవునికి దాసత్వం వహించడం, ఆ తరువాత సఖ్యత (చెలిమి) తో ఆ వాసుదేవుణ్ణి పొందడం జరుగుతుంది. ఇక స్నేహంలో ఎలాంటి అరమరికలు ఉండవు. ఎలాంటి భయాలు ఉండవు. ఒకరికొకరు తోడు ఉన్నారనే ధైర్యం కలుగుతుంది. స్నేహంలో ముఖ్యంగా చెప్పుకోదగినది ''త్యాగ గుణం'' – భగవంతుని కోసం అవసరమైనచో తన ప్రాణాన్నైనా త్యజించడానికి సిద్ధపడతాడు భక్తుడు. సఖ్యభక్తులకు బాహ్య ప్రపంచం, భవబంధాలు శాశ్వతము కావని, పరమాత్మ ఒక్కడే శాశ్వతుడని బలంగా నమ్ముతారు. అలాంటి వారిపట్ల ఆ వాసుదేవుడు రక్షణ కవచంగా ఉంటూ రక్షిస్తుంటాడు అని భారత, భాగవతాలు బోధిస్తున్నాయి. సఖ్యభక్తికి ప్రతీకలుగా అర్జునుడు, కుచేలుణ్ణి పేర్కొన్నాయి మన పురాణాలు.

కృష్ణార్జునులది జన్మ జన్మల బంధము. వారిరువురు పూర్వజన్మలో నర నారాయణులు. ఈ జన్మలో నరుడుగా అర్జునుడు, నారాయణుడుగా కృష్ణుడు అవతరించారు. అర్జునుని సఖ్యభక్తి అనన్య సామాన్యమైనది. అందుకే కృష్ణపరమాత్మ అడుగడుగునా అర్జునుణ్ణి కాపాడగలిగాడు. పైగా ద్వాపర యుగంలో వాసుదేవుడైన కృష్ణుని మేనత్త కుమారుడు అర్జునుడు. అంతేకాదు తన సోదరియైన సుభద్రను అర్జునునికిచ్చి వివాహం జరిపించి బంధువయ్యాడు. అలాంటి బంధువైనప్పటికీ అర్జునుడు తన సఖ్యభక్తిని విడనాడలేదు. ఎల్లప్పుడూ దేవదేవుడైన వాసుదేవుణ్ణి తన అంతరంగమందు నిలుపుకుని ధ్యానించేవాడు.

కురురాజైన ధృతరాష్ట్రుడు దుర్బుద్ధి, పుత్రవ్యామోహం కలవాడు. అతని కుమారులే కౌరవులు. దుర్యోధనాదులు. వారు కూడా ఈర్ష్య, ద్వేషాలు, అసూయ, అహంకార పరులు. ధృతరాష్ట్రుని సోదరుడైన పాండురాజు కుమారులే పాండవులు. వీరు పంచ పాండవులు. ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు. వీరు ఐదుగురు ధర్మపరులు. అందువల్లనే కృష్ణుడు వారి పక్షాన నిలబడి కంటికి రెప్పలా కాపాడాడు. ఎందుకంటే కృష్ణావతారం యొక్క ప్రధాన

కర్తవ్యమే ధర్మపరిరక్షణ అని భగవంతుడే భగవద్గీతలో ఇలా అర్జునునితో చెప్పాడు. ''పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం, ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే'' అనగా ఎప్పుడెప్పుడు అధర్మ విలయతాండవం చేస్తుందో, అప్పుడప్పుడు నేను అవతరిస్తానని చెప్పినమాట ప్రకారం శ్రీకృష్ణుడు పాండవుల పక్షాన నిలిచి అనేక సందర్భాలలో రక్షించాడు. ముఖ్యంగా పాండవ మధ్యముడైన అర్జునుడంటే కృష్ణపరమాత్మకు అమితమైన వాత్సల్యం.

దుష్టులైన దుర్యోధనాదులు పాండవులను లక్క ఇంటిలో దగ్ధం చేయాలని శకుని మామతో కలిసి కుట్రలు చేసినప్పుడు కృష్ణుడు విదురుని చేత వారిని రక్షించి వారిని కొంతకాలం బ్రాహ్మణులుగా జీవించాలని ఆదేశించాడు. ద్రౌపదీ స్వయంవరంలో బ్రాహ్మణ వేషంలో ఉన్న అర్జునుడు మత్స్యయంత్రాన్ని పడగొట్టినప్పుడు ద్రుపద మహారాజు ద్రౌపదీ అర్జునుల వివాహం జరిపించుటకు ఆలోచిస్తుండగా కృష్ణుడే సర్ది చెప్పాడు.

రాజ్యకాంక్షతో కౌరవులు పాండవులకు అరణ్యభాగం అప్పగించగాకృష్ణుడుఅర్జుననితోకలిసిఖాండవవనాన్నిదహించి గొప్ప ఇంద్రప్రస్థ నగరాన్ని నిర్మించుటకు సహకరించాడు. అంతేకాదు ధర్మరాజు చేత రాజసూయ యాగము చేయించి తొలి పూజను అందుకున్నాడు. ఆ అగ్రపూజను వ్యతిరేకించిన శిశుపాలుడు మరో మేనత్త కొడుకే అయినప్పటికీ నూరు తప్పులు చేసినా సహించి, నూట ఒక్క తప్పుకు అతని శిరస్సు ఖండించాడు. కురుసభలో మాయా జూదంలో పాండవులను ఓడించి ద్రౌపదిని దుశ్శాసనుడు వివస్త్రను చేసి నిండు సభలో అవమానిస్తున్నవేళ ద్రౌపది ఆర్తితో కృష్ణుణ్ణి ధ్యానించగానే ఆమె మానాన్ని రక్షించిన ఆపద్బాంధవుడయ్యాడు కృష్ణుడు.

బలరాముడు సుభద్రను దుర్యోధనునకిచ్చి వివాహం జరిపించుటకు యత్నించగా శ్రీకృష్ణుడు ఆ కార్యాన్ని అడ్డగించి సుభద్రార్జునుల వివాహం జరిపాడు. కౌరవుల మాయా జూదంలో పాండవులు అడవుల పాలవ్వగా అడుగడుగునా వారిని రక్షించాడు. అంతేకాదు ఆ పన్నెండు సంవత్సరాలలో అర్జునుని సమయాన్ని వృథా చేయకుండా పాశుపతాస్త్రం సముపార్జనకు శివునికై తపమాచరించమని అర్జునుణ్ణి ప్రోత్సహించాడు. పాండవులు అనాలోచితంగా శపథాలు చేసినా వాటిని నెరవేర్చుటకు ఎంతగానో ప్రయత్నించాడు కృష్ణపరమాత్మ.

ముఖ్యంగా కురుక్షేత్ర యుద్ధంలో భీష్మ ద్రోణాదులను చూసి బంధుత్వం జ్ఞప్తికి వచ్చి అర్జునుడు అస్త్ర సన్యాసం చేసి దుఃఖిస్తున్నవేళ వాసుదేవుడే గీతాచార్యుడై భగవద్గీతను బోధించి అర్జునుణ్ణి యుద్ధ కార్యోన్ముఖుణ్ణి చేశాడు. తన కుమారుడైన అభిమన్యుడు పద్మవ్యూహంలో దుర్యోధన, ద్రోణ, కర్ణాదులు సంహరించారని తెలియగానే అర్జునుడు ఆక్రోశంతో సూర్యాస్తమయంలోపు సింధురాజైన సైంధవుణ్ణి వధిస్తానని, లేని పక్షంలో అగ్నికి ఆహుతి అవుతానని ప్రతిజ్ఞ చేయగా, శ్రీకృష్ణపరమాత్మ తన యుక్తిని ప్రదర్శించి సూర్యునికి తన చక్రం అడ్డుపెట్టి సైంధవ వధకు సహకరించి అర్జునుని ఆత్మార్పణ నుండి రక్షించింది ఈ సఖ్యభక్తి వల్లనే.

ఆ సర్వాంతర్యామియైన వాసుదేవునకు మేలు చేయడమే కాదు అప్పుడప్పుడు మందలించి వారిని ధర్మమార్గంలో నడిపించడం కూడా తెలుసు. ఆ తప్పు చేసినవాడు తన భక్తుడైనా, సఖుడైనా ఉపేక్షించడు. అర్జునుడు కర్ణునితో యుద్ధం చేస్తున్నప్పుడు మహావీరుడైన కర్ణుడు భయంకరమైన నారాయణ, నాగాస్త్రాలను ప్రయోగించినప్పుడు కృష్ణపరమాత్మ వాటినుండి ఎంతో నేర్పుతో అర్జునుణ్ణి రక్షించాడు. అలాగే కర్ణుడు వీర మరణం చెందగానే అది తన పరాక్రమం వల్లనే అని విర్రవీగుతూ కర్ణుణ్ణి అవమానించబోగా అతడు తన సఖుడే అయినప్పటికీ వీరమరణం పొందిన వీరులను అవమానించరాదని, అతడు మీ అగ్రజుడని, కర్ణుని జన్మ రహస్యాన్ని తెలిపి అర్జునుని కండ్లు తెరిపించాడు కృష్ణపరమాత్మ.

కురుక్షేత్ర యుద్ధంలో కాళ్ళు విరిగి పడి ఉన్న దుర్యోధనుని బాధ చూడలేక అశ్వత్థామ అతడు మరణించేలోపు పాండవుల తలలను నరికి తెస్తానని పాండవుల శిబిరానికి వెళ్ళి చీకటిలో పోల్చుకోలేక ఉపపాండవులను హత్య చేస్తాడు. ఈ విషయం గమనించిన భీమార్జునులు, కృష్ణుడు పారిపోతున్న అశ్వత్థామను పట్టుకోబోవ అతడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తాడు. దానికి ఉపసంహారం తెలియక అభిమన్యుని భార్య ఉత్తర గర్భంలో పెరుగుతున్న పరీక్షిత్తుపైకి ప్రయోగిస్తాడు. అప్పుడు దయార్ద్ర హృదయుడు, కరుణాసింధువైన శ్రీకృష్ణ పరమాత్మ తన చక్రాన్ని పంపించి ఆ శిశువుని రక్షించి అర్జునుని పాండవ వంశాంకురాన్ని నిలబెట్టాడు.

శ్రీకృష్ణ నిర్యాణ సమయంలో వేటగాని బాణం దెబ్బకు అడవిలో ఒంటరిగా నేలపై పడివున్న సమయంలో ద్వారక ప్రజలంతా వెదికినా ఆ పరమాత్మ జాడ తెలియకపోవడంతో అందరూ దుఃఖిస్తున్న సమయంలో వార్త తెలుసుకున్న అర్జునుడు పరుగు పరుగున వచ్చి అతని జాడ తెలుసుకుని ఎంతో దుఃఖిస్తాడు. ఆ తరువాత ఆ మృత దేహానికి అంతిమ సంస్కారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరిపించి తన సఖ్యభక్తిని చాటుకుని చరితార్థుడయ్యాడు. దీనిని బట్టి చెలిమి (సఖ్యత) తో కూడా ఆ భక్తవత్సలుని పొందవచ్చునని తెలియుచున్నది.

సఖ్యభక్తికి మరో ఉదాహరణ శ్రీకృష్ణ-కుచేల మైత్రి. శ్రీకృష్ణుడు-కుచేలుడు బాల్యంలో సాందీప మహర్షి వద్ద విద్యను అభ్యసించారు. ఆ సమయంలో వారి మధ్య విడదీయరాని మైత్రి బంధము ఏర్పడింది. కుచేలుని అసలు పేరు సుదాముడు.

అతడు నిరుపేద బ్రాహ్మణుడు. ఉన్నంతలో సంతోషించే సుగుణము కలవాడు. వాసుదేవునికి సమర్పించకుండా పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టేవాడు కాదు. ఆ విషయం గమనించిన బాల్యమిత్రుడైన శ్రీకృష్ణుడు ఎన్నడూ నీ చేతిని విడువనని, మన మైత్రీబంధం ఎప్పటికీ కొనసాగుతుందని సుదామునికి మాట ఇచ్చి ఏ అవసరమున్నా తనను కలవాలని వాగ్దానం చేసి ధైర్యం చెప్పాడు. గురుకుల విద్య అనంతరం శ్రీకృష్ణుడు ద్వారకా నగరానికి అధిపతి అయ్యాడు. కుచేలుడు దారిద్ర్యానికి చిక్కి సతమతమయ్యాడు. గంపెడు సంతానం, భిక్షాపాత్ర తప్ప ఎలాంటి ఆస్తులు లేవు. ప్రతిరోజు అయిదు గడపల్లో భిక్షను అర్థించాలి. వారు దయతో భిక్ష వేస్తే అది ముందుగా కృష్ణపరమాత్మకు సమర్పించి ఆ తరువాత పిల్లలకు పెట్టేవాడు. ఒకరోజు సుదామునికి భిక్ష లభించలేదు. అప్పుడు అతని భార్య ఇలా అంది.

**"వరదుడు సాధు భక్తజన వత్సలుడార్త శరణుడిందిరా**
**వరుడు దయాపయోనిధి భగవంతుడు కృష్ణుడా గుశస్థలి**
**పురమున యాదవ ప్రకరముల్ భజియింపగ నున్నవాడు నీ**
**వడిగిన మిమ్ము జూచి విభుడప్పడ ఇచ్చు ననూన సంపదల్"**

ఓ స్వామీ! మీ చిన్ననాటి మిత్రుడు శ్రీకృష్ణుడు భగవంతుడే. అతడు భక్తవత్సలుడు, వరములను ఇచ్చువాడు, దయాసాగరుడు ఇందిరాపతి. అతడిప్పుడు యాదవులు సేవింపుచుండగా ఆ కుశస్థలీపురమున ఉన్నాడు. మీరు ఒకసారి అచటికి పోయినచో ఆ ప్రభువు మిమ్ము చూచి స్వల్పములు కాని సంపదలు ఇచ్చును కదా! ఓ నాథా! ఆయనను చూచుటకు సంకోచింప వలదు. కలలోనైనను ఎన్నడూ ఆయనను స్మరించనట్టి కఠినాత్మునికైనను అతడు అసహాయుడై ఉన్నప్పుడు ఆయన పాదపద్మములను స్మరించినంతనే సంతసించి వారి ఆర్తిని హరించి తననైనను ఇచ్చు దయాసాగరుడు. నిశ్చలభక్తితో నిత్యము కొలుచునట్టి మీ వంటి సజ్జనులకు తప్పనిసరిగా సహకరిస్తాడు.

అప్పుడు కుచేలుడు ఆమెతో ఇట్లనెను. ఓ మానవతీ! నీ ఆలోచన ఆచరింపదగినది. ఆ రాజీవ లోచనుని పాదపద్మములను ఆశ్రయించుట పరమ శుభకరము. మరి ఆ చక్రపాణికి ఏమైనా కానుకను కొనిపోవుటకు మన ఇంటిలో ఏముంది? అన్నాడు. అప్పుడా ఇల్లాలు సరేనని అతని చినిగిన ఉత్తరీయపు కొంగున కొన్ని అటుకులను ముడివేసి ప్రీతితో అతనిని సాగనంపగా అతడు గోవింద సందర్శనోత్సాహియై ద్వారకకు బయలుదేరెను.

కుచేలుడు ద్వారకా నగరిలో ప్రవేశించి 16 వేల మంది భార్యల యొక్క మహనీయమైన బంగారు మణిమయ గోపురములతో మెరుస్తున్న సౌధములను చూచి మనస్సు బ్రహ్మానందముతో నిండిపోవగా, ఆనంద బాష్ప ధారలు వర్షింపగా మిక్కిలి ఆకర్షణీయమైన ఒక సౌధములో స్త్రీలు చామరములతో వీచుచుండ, మృదువైన హంసతూలికా తల్పముపై విభుడు తన ప్రియ పత్నితో వినోదించుచు, మహిత లావణ్య మన్మథుని వలె ప్రకాశిస్తున్న శ్రీకృష్ణుని చూచెను. నీలకమల శరీరుడు, దేవేంద్రుని వందనములు పొందువాడు, కరుణా నిలయుడు, మెరయుచున్న చెక్కిళ్ళు గలవాడు, కౌస్తుభమణిధారి, కల్పవృక్షము వంటివాడు, సుందరరూపుడు, దేవతలు సైతము శరణు జొచ్చువాడు, అఖిల లోకారాధ్యుడు అయిన ఆ శ్రీకృష్ణుని కుచేలుడు దర్శించాడు.

**"కని డాయంజనునంత గృష్ణుడు దళత్కంజాక్షు డప్పేద వి**
**ప్రుని నశ్రాంత దరిద్ర పీడితు గృశీభూతాంగు జీర్ణాంబరున్**
**ఘన తృష్ణాతుర చిత్తు హాస్య నిలయున్ ఖండోత్తరీయున్, గుచే**
**లుని, నల్లంతనే జూచి సంభ్రమ విలోలుండై దిగెన్ దల్పమున్"**

శ్రీకృష్ణుని చూచిన కుచేలుడు నెమ్మదిగా అతని చెంతకు చేరుకోగానే, ఆ పేద విప్రుని, నిరంతర దారిద్ర్య పీడితుడని, శిథిలమైన శరీరముతో నున్నవాడిని, చినిగిన వస్త్రముల వానిని, దాహపీడితుణ్ణి, నవ్వు పుట్టించువానిని, చినిగిన ఉత్తరీయం కల కుచేలుని శ్రీకృష్ణుడు అల్లంత దూరం నుండే చూచి, పాన్పు దిగి సంతోషముతో తన చిన్ననాటి బాల్యమిత్రుణ్ణి ఆహ్వానించాడు.

**"కరమర్థి నెదురుగా జని**
**పరిరంభణ మాచరించి బంధు స్నేహ**
**స్ఫురణన్ దోడ్తెచ్చి సమా**
**దరమున గూర్చుండబెట్టె దల దల్పమునన్"**

చేతులు చాచి ఎదురుగా వెళ్ళి కౌగలించుకొని, స్నేహబంధమును స్మరించుకొని, తోడ్కొని వచ్చి అత్యంతాదరముతో తన తల్పము మీద కుచేలుణ్ణి కూర్చుండబెట్టుకున్నాడు శ్రీకృష్ణుడు ఆ అపురూప దృశ్యాన్ని చూసిన అంతఃపుర కాంతలు తమ మనస్సులో ఇలా తలచుకున్నారు.

ఆహా! ఈ బ్రాహ్మణ శ్రేష్ఠుడు ఎంత ధన్యుడో కదా! ఇతడు పూర్వజన్మంలో ఎట్టి తపములు చేసియుండెనో కదా. యోగీవరేణ్యులచే ఉపాసింపబడి ప్రకాశించి ఈ జగన్నాథుని, రమానాథుని నిజతల్పముపై కూర్చునియున్న ఈ మహనీయమూర్తికి ఎంతటి గొప్ప మునిపుంగవులైనను సాటి రాగలరా!

ఆ తరువాత శ్రీకృష్ణుడు తన భార్యలతో కలిసి ఆ విప్రవరునికి అనేక విధాల ఉపచారాలు చేసి, భోజనానంతరము తాంబూలములిచ్చి సేదదీర్చిరి. అనంతరం బాల్యమిత్రులిరువురు సాందీప మహర్షి ఆశ్రమంలో జరిగిన బాల్య విశేషాలను ఒకరికొకరు గుర్తుకు తెచ్చుకున్నారు. ముని ఆశ్రమంలో ఉన్నప్పుడు గురువు కొరకు కట్టెలు తేవడానికి అడవికి వెళ్ళి జడివానలో చిక్కుకుని ఒకరినొకరు ఆలింగనం చేసుకుని భయపడుతూ రాత్రంతా అడవిలో గడిపిన విషయాలను,

మ రునాడు గురువుగారు వచ్చి వారిని ఆశీర్వదించి గురుకులమునకు శ్రీకృష్ణ కుచేలులను తోడ్కొని పోయిన విషయాలను గుర్తు చేసుకుని పరమానంద భరితులయ్యారు. వారిని అనగా బాల్యమిత్రులను చూచి శ్రీకృష్ణ పరమాత్మ దేవేరులు సైతం ఎంతగానో ఆనందించారు.

ఆ తరువాత శ్రీకృష్ణుడు దరహాసము చేస్తూ మిత్రమా! నా కొరకు ఏమి తెచ్చితివి అని అడుగగా కుచేలుడు తెచ్చిన కొద్దిపాటి అటుకులను శ్రీకృష్ణునకు ఇచ్చుటకు సంకోచిస్తుండగా శ్రీకృష్ణుడిట్లనెను. మిత్రమా! నిశ్చల భక్తితో నన్ను కొలిచి జనులర్పించిన పుష్పమైనను, ఫలమైనను, పత్రమైనను, జలమైనను నేను దానిని మధురాన్నముగా భావించి ప్రీతితో స్వీకరించెదను.

**"మురహరుడు పిడికెడటుకులు**
**గరమొప్పగ నారగించి కౌతుకమతియై**
**మఱియును పిడికెడు గొనఁద**
**త్కరమప్పుడు వట్టె గమల కరకమలములన్"**

శ్రీకృష్ణుడు పిడికెడు అటుకులు ఆరగించి ప్రీతితో మరియొక పిడికెడు అటుకులు తీసుకొనుచుండగా అప్పుడు రుక్మిణీదేవి అతని చేతిని తన కరములతో పట్టుకొని అలా తినవలదని వారించెను. దేవదేవా! సర్వాత్మహరీ! మూడు జగముల వారికి సంపదల ననుగ్రహించు ఓ ప్రభూ! ఈ విప్రోత్తమునకు సంపదలను అందించుటకు నీవారగించిన పిడికెడు అటుకులు చాలును. కావున ఇంకను భక్షింప వలదు అని రుక్మిణీదేవి వారించెను.

**"నా పుణ్య మరయ నెట్టిదో**
**యా పుణ్య నిధిం బ్రశాంతు నచ్యుతు నఖిల**
**వ్యాపకు బ్రాహ్మణ్యుని జి**
**ద్రూపకు బురుషోత్తముని బరుం గనుగొంటిన్"**

మరునటి ఉదయమున ఆ విప్రోత్తముడు (కుచేలుడు) ఈ విధముగా తలపోసెను. ఆహా! ఆలోచింపగా నా పూర్వపుణ్య విశేషమెట్టిదో కదా! పురుషోత్తముడు, ప్రశాంత చిత్తుడు, పుణ్యనిధి, అచ్యుతుడు, సర్వవ్యాపకుడు, బ్రాహ్మణ్యుడు, చిద్రూపుడు యైన ఆ శ్రీహరిని చూడగలిగితిని, మాటలాడ గలిగితిని. ఈ జన్మకిది చాలు అని ఎంతగానో ఆనందపడ్డాడు కుచేలుడు. సునిశ్చల సఖ్యభక్తితో ఆ భగవంతుణ్ణి కొలిచినవారికి ఆ పరంధాముని కృప తప్పనిసరిగా లభిస్తుందని ఈ రెండు ఉదంతాల వలన తెలుస్తోంది.

# మీ ప్రశ్న - మా సమాధానం

నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు

**1. మోక్షం లేదా పరమపద ప్రాప్తి గురించి భగవద్గీత ఏమి చెప్పింది?**

జవాబు - సమదృష్టిని, స్థితప్రజ్ఞతను (సుఖ దుఃఖాలను ఒకేరకంగా చూడటం, ఏ పరిస్థితుల్లో అయినా స్థిరబుద్ధితో ఒకేరకంగా ఉండటం) సంతరించుకుని కర్మఫలాన్ని ఆ దైవానికే వదిలిపెట్టినవారు జన్మ రాహిత్యం పొందుతారు. వారికే నిర్వికార పరమపదం, ముక్తుల సాంగత్యం, తుదకు పరమాత్మతో సాయుజ్యం లభిస్తాయి. అనగా పరమాత్మతో నిత్య సంయోగం లభించి తద్వారా కర్మయోగం పరిపూర్ణమవుతుంది. మనిషి తన సత్ స్వరూపమైన బ్రహ్మ భావంతో (చతుర్ముఖ బ్రహ్మ కాదు) నిలకడగా ఉంటే, జనన – మరణ చక్రం నుండి విముక్తుడై జీవన్ముక్తి ఆనందం పొందగలుగుతాడు.

**2. దైవానుగ్రహం ఉంటేనే మనకు లభించేవి ఏమిటి?**

జవాబు- దైవానుగ్రహం ఉన్నవారికి మానవజన్మ, ఆధ్యాత్మిక విషయములందు ఆసక్తి మరియు మహాత్ములు, మహితాత్ములు తమ దివ్య అనుభూతులను, అనుభవాలను మనకోసం ఏర్పరచిన గ్రంథాలు, సదాచార్యుల మార్గదర్శనం లభిస్తాయి.

**3. ముముక్షువు అంటే?**

జవాబు – ముముక్షువు అంటే మోక్షాపేక్ష కలిగినవాడు. ధర్మార్థ కామ మోక్షములు అను నాలుగు విధములైన పురుషార్థములలో 'మోక్షము'నే అనగా ముక్తి – అనగా భవబంధాల నుండి విడివడి, నిత్యము, శాశ్వతము అయిన భగవత్ సన్నిధిని పొందవలెననే తీవ్రమైన ఆకాంక్ష (కోరిక) కలవాడు. తిరిగి ఈ దుఃఖమయమూ, భ్రాంతిజనకమూ అయిన లోకమునకు వచ్చుటకు ఇష్టపడక, నిత్యులు, ముక్తులతో కలిసి, నిత్యమూ మాటలకందని, కాదు ఊహకే అందని ఆనందమును పొందగోరువాడు.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు. – ఎడిటర్, శ్రీవేంకటేశం**

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.
కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.
ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము.
శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.
శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథ యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము. (హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము

ఆకస్మిక ధనవ్యయం ఉండును. ఎవరికి ధనం ఇచ్చినచో తిరిగి రాదు. మా నసిక ఒత్తిడి కలుగును. తొందరపాటు నిర్ణయాల వలన కోలుకోలేని ఇబ్బందులు రావచ్చును. ప్రతి నిమిషము జాగ్రత్తగా వ్యవహరించినచో ఆకస్మిక ధనలాభము కలుగును. నవగ్రహ ప్రదక్షిణలు చేయవలెను.

## వృషభరాశి

కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.

ఈ మాసం కూడా అనుకూలంగా ఉంటుంది. విద్యార్థులకు ఉత్తమ ఫ లితములు, ర్యాంకులు లభించును. వ్యాపారస్తులకు లాభములు, ఉద్యోగస్తులకు ప్రమోషన్లు కలుగును. తెలియని ఆనందము, వివాహ ప్రయత్నముల విజయము, ఆర్థిక వెసులుబాటు ఉండును. నవగ్రహ ప్రదక్షిణలు, దానములు, శ్రీవారి నామ స్మరణ శుభప్రదం.

## మిథునరాశి

మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.

ఈ రాశి స్త్రీ–పురుషులకు అనుకూల ఫలితములు కలుగును. అవసరమైన సమయమున ధనసహాయం లభించును. ఖర్చుల విషయంలో జాగ్రత్తగా ఆలోచించి పొదుపు మార్గమును అనుసరించవలెను. వాక్చాతుర్యంగా మాట్లాడగలరు. విందులు–వినోదములు లభించును. నవగ్రహ ప్రదక్షిణలు చేయుట శుభప్రదము.

## కర్కాటకరాశి

పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ–పురుషులకు అనుకూలంగా గోచరిస్తుంది. కుటుంబంలోని పెద్దవారికి స్వల్ప అనారోగ్య సూచనలు ఉన్నా ధైర్యంగా ముందుకు సాగవలెను. ధనయోగము ఉన్నది. అవసర సమయమున ధనం అందును. పూర్తి విశ్వాసంతో, మానసిక ఒత్తిడి లేకుండా "ఓం నమో నారాయణాయ" నామస్మరణ చేయుట శ్రేయస్కరం.

## సింహరాశి

మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము

ఈ మాసంలో పరిస్థితులు అనుకున్నంత అనుకూలంగా ఉండవు. అయినా భయపడకుండా మనోనిగ్రహంతో లలితాంబికను ఆశ్రయించాలి. స్త్రీలకు దైవానుభూతి ఎక్కువగా కలుగుతుంది. ఆర్థిక అవసరాలు అవసరమైన మేరకు సమకూరుతాయి. మంత్రజపం: ఓం ఐం హ్రీం శ్రీ లలితాదేవి నమోనమః.

## కన్యారాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు

ఈ రాశి స్త్రీ–పురుషులకు సామాన్య ఫలితములు. ఎదుటివారు చులకనగా మాట్లాడగలరు. పంతాలకు పోతే పోలీస్ కేసులు, అనవసర సమస్యలు ఎదురగలవు. అత్యంత జాగ్రత్త అవసరం. ఓం నమో నారాయణాయ నామజపం నిరంతరం చేయవలెను.

## తులారాశి

చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.

ఈ రాశి స్త్రీ–పురుషులకు అనుకూల కాలం. భార్యాభర్తల మధ్య ఏకాభిప్రాయం లోపించవచ్చు. పిల్లల వివాహ ప్రయత్నములు, గృహం లేదా స్థలం విషయాలలో ఏదో ఒకటి అనుకూలంగా కుదురును. నవగ్రహ ప్రదక్షిణలు, స్కందగిరిలో పూజలు చేయించుట శ్రేయస్కరం.

## వృశ్చికరాశి

విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ–పురుషులకు అనుకూల ఫలితములు. పాత బాకీలు వసూలు కావచ్చు. ఉద్యోగస్తులకు ప్రమోషన్లు లభిస్తాయి. తీర్థయాత్రల యోగం ఉంది. అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తుంది. స్త్రీలు ప్రతి విషయంలో ముందడుగు వేస్తారు. శనివారం శనైశ్వరునికి తైలాభిషేకం చేయవలెను.

## ధనూరాశి

మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.

ఈ రాశివారికి అనుకూలమైన కాలము. ప్రయాణాలలో అనుకూలత ఉంటుంది. ఆర్థిక చిక్కులు తొలగి చింతలు తగ్గును. విందు వినోదములు, బంధుమిత్రుల కలయిక, ఆదరాభిమానములు, గౌరవమన్ననలు కలుగును. ఆభరణ ప్రాప్తి సూచనలు. లక్ష్మీ–గణపతి హోమం చేయుట శుభకరం.

## మకరరాశి

ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు

ఈ రాశి వారికి అనుకూలమైన మాసము. ప్రతి సమస్యకు తక్కువగా మాట్లాడటం మేలు చేస్తుంది. పనులు వేగవంతమవుతాయి. ఆకస్మికంగా ధనం చేతికి వచ్చినట్లు కనిపించి మధ్యలో ఆగే పరిస్థితులు ఉండవచ్చు. ప్రయాణ ప్రమాద నివారణకు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పూజలు, నవగ్రహ ప్రదక్షిణలు చేయండి.

## కుంభరాశి

ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.

ఈ రాశి వారికి అనుకూలంగా కనిపించినా గురువు రాశి మారుట వలన తెలియని చికాకులు ఎదురవుతాయి. శ్రమ అధికంగా ఉండి ఆదాయంలో తగిన అనుకూలత ఉండదు. కుటుంబ సభ్యులతో తక్కువగా మాట్లాడటం మేలు. నవగ్రహ ప్రదక్షిణలు చేయండి.

## మీనరాశి

పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.

ఈ రాశి వారికి సామాన్య ఫలితములు. గురుబలం కొరకు గురు పారాయణం చేయుట శుభకరం. అవసరమైనవి మీకు సమకూరుతాయి. శత్రువులను జయించగల కాలము. అయినా ఎవరి వద్దా అనవసరంగా మాటలు చెప్పకూడదు. మీ మాటలకు గౌరవం. ఆకస్మిక ధనలాభం, వస్త్ర లాభములు.

# మీ విజ్ఞానం

నిర్వహణ: డా.పి. లలితవాణి


**శ్రీ వేంకటేశం**
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com


ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. తల్లి కడుపులో ఉన్నప్పుడే దేవాన్ని దర్శించిందెవరు?
2. శమీక మహర్షి కొడుకు ఎవరు?
3. గోవింద దాసుని ఉపాధ్యాయులు ఎవరు?
4. మీనావతార విష్ణువు ఏ రాజుతో సంభాషించాడు?
5. ఎవరు – గజేంద్రునిగా పుట్టారు?
6. స్వామిమల క్షేత్రంలోని దేవుడెవరు?
7. సింహాచలంలోని చందనసేవకు ఎక్కడ నుండి గంధం చెక్కలు తెస్తారు?
8. లంకానగర నిర్మాత ఎవరు?
9. రావణుని శపించిందెవరు?
10. 'పీయూష లహరి' రచించింది ఎవరు?
11. 'గీతగోవిందం'లో ఎన్ని ప్రబంధాలున్నాయి?
12. శ్రీవారి సేనాధిపతి ఎవరు?
13. నాగలాపురంలోని దేవుడు ఎవురు?
14. హనుమ భక్తితో ఆత్మాహుతి చేసుకున్న రాక్షసుడు ఎవరు?
15. శ్రీవారికి ఉడుధార నగ చేయించిందెవరు?

1. ..............................................................
2. ..............................................................
3. ..............................................................
4. ..............................................................
5. ..............................................................
6. ..............................................................
7. ..............................................................
8. ..............................................................
9. ..............................................................
10. ..............................................................
11. ..............................................................
12. ..............................................................
13. ..............................................................
14. ..............................................................
15. ..............................................................

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. శ్రీమాతను, 2. 20-07-2021 తొలి ఏకాదశినాడు, 3. అగస్త్యుడు, 4. శ్రీరామ మంత్రం, 5. లోపాముద్ర, 6. మారీచునికి, 7. మయుడు 8. విభీషణుడు, 9. కుముదాక్షుడు, 10. వ్యాసుడి, 11. గీత గోపీపతి, 12. జగన్నాథ, గురువాయూరు ఆలయాలలో, 13. అక్రూరుడు, 14. గరుత్మంతుడు, 15. ఆశ్వయుజ పూర్ణిమ నాడు

## సరైన సమాధానాలు రాసినవారు

1. చింతలపాటి శివశంకర శాస్త్రి, 2. జనమంచి జయశ్రీ, 3. పి. యశోద, 4. చిల్లర సీతారామారావు

పేరు: ____________________

చిరునామా: ____________________

____________________

____________________

____________________

పిన్‌కోడ్: ____________________

ఫోన్: ____________________

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

**జనమంచి జయశ్రీ**



RNI No.: APTEL/2008/23122 | Postal Registration No: HSE/879/2025-2027 | Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month | Posting at BPC-IV Patrika channel, Nampally, Hyderabad-01.



If Un Delivered Please Return to:

**SRI VENKATESHAM,**

(Sri Venkateshwara Maha Mantra Peetham)

H.No: 1-1-53, Street No. 1, Habsiguda,
Hyderabad-500007.Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు
https://www.srivenkatesham.org లో చదవండి.

Srivenkatesham Magazine in Google Drive
https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGIh6kVYyLq